
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 5-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 119 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: దశమి రా. 6:59 తదుపరి ఏకాదశి, నక్షత్రం: స్వాతి రా.7:51 తదుపరి విశాఖ, వర్జ్యం: రా.2:06-3:54, దుర్ముహూర్తం: ఉ.5:49-7:33, అమృతఘడియలు: ఉ.9:56-11:44, రాహుకాలం: ఉ. 9:00-ఉ.10:30, సూర్యోదయం: 5:49, సూర్యాస్తమయం: 6:50 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 5-7-2025

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal |Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుంటూరు సిటీ

చైనాలో మూడో బిడ్డను కంటే రూ. 12 లక్షలు!

బీజింగ్, జూలై 4: ప్రజల మీద అత్యంత కఠిన మైన ఆంక్షలు విధించి జనాభాను తగ్గించుకున్న చైనా.. ఇప్పుడు పడిపోతున్న జనాభాను పెంచుకోవటానికి నానాతంటాలు పడుతోంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ముగ్గురిని కన్నా ఫర్వాలేదు.. డబ్బులిస్తాం అని ప్రకటిస్తోంది. రెండో బిడ్డను కన్న



మిగతా 2వ పేజీలో...

- రెండో బిడ్డకైతే రూ.6 లక్షలు
- జనాభాను పెంచుకోవటానికి చైనా తంటాలు.. నగదు ప్రోత్సాహకాలు
- గృహనిర్మాణ సబ్సిడీలూ ఇస్తున్న వైనం
- పుట్టే ప్రతి శిశువుకూ మూడేళ్లపాటు ఏటా 43 వేలు.. త్వరలో కొత్త పథకం
- చైనాలో పెరుగుతున్న వృద్ధుల సంఖ్య
- ఉద్యోగాలు చేసే వయస్కుల తగ్గుదల
- వివాహం పట్ల యువతలో విముఖత

ఫ్రీ హోల్డ్‌కు రైట్ రైట్

అర్హత గల అసైన్డ్ భూములకు స్వేచ్ఛ కల్పించండి

వీటికి లైన్ క్లియర్

ఫ్రీ హోల్డ్‌కు అర్హులైన వారు వైసీపీ కార్యకర్తలయినా, టీడీపీ కార్యకర్తలైనా, ఏ పార్టీ వారైనా చేయాల్సిందే. అర్హత ఉన్న అసైన్డ్ భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించే విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోండి. ఈ విషయంలో ఇక నాన్చుడు ధోరణి వద్దు. అసైనీలు భూమిపై పొజిషన్‌లో ఉన్నవి, పక్కా అసైన్‌మెంట్ రికార్డులు కలిగి ఉండి 20 ఏళ్లు గడువు దాటిన వాటిని రాజకీయాలతో సంబంధం లేకుండా ఫ్రీ హోల్డ్ చేయండి.

వీటికి ఫ్రీ హోల్డ్ వద్దు

అసైన్‌మెంట్ రికార్డులు లేని భూములు, కలెక్టర్ ఉత్తర్వులు లేనివి, జీఓ 596కి విరుద్ధంగా ఉన్నవి, అధిక విస్తీర్ణం క్లెయిమ్ చేసేవి, అసలైన అసైనీలు భూమిపై పొజిషన్‌లో లేనివి, ఇతరులు క్లెయిమ్ చేసే భూములు, అభ్యంతరాలున్న పోరంబోకు భూములు, నీటి వనరులున్న పోరంబోకు భూములు, 20 ఏళ్లు గడువుదాటని అసైన్డ్ భూములు.

- రెవెన్యూ శాఖకు సీఎం చంద్రబాబు ఆదేశం

- 22ఏలోని ఇనాం, చుక్కలు, షరతు పట్టా భూములకూ
- రెవెన్యూ శాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం
- నిషేధిత జాబితా నుంచి తొలగించడంపై స్పష్టత
- ఆగస్టు 25 నుంచి కొత్త పాసు పుస్తకాల జారీ
- రెవెన్యూ శాఖపై సమీక్షలో సీఎం ఆదేశం

'ఆంధ్రజ్యోతి' కథనంపై చర్చ

- వైసీపీ వారికి మేలు చేసేలా వార్తలు: అనగాని
- మంత్రి వాదనను తోసిపుచ్చిన చంద్రబాబు
- అన్నీ కరెక్టుగా ఉన్నవి ఎందుకు ఆపుతున్నారు?
- వార్తలో ఉన్నది అదే కదా అంటూ ప్రశ్న



రెవెన్యూ సమీక్షలో సీఎం చంద్రబాబు, మంత్రి అనగాని తదితరులు

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): చట్టప్రకారం అర్హత గల భూములకు నిషేధిత జాబితా 22(ఏ) నుంచి స్వేచ్ఛ (ఫ్రీ హోల్డ్) కల్పించే విషయంలో సత్వరమే నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ శాఖను ఆదేశించారు. ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల కొనసాగింపుపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈ విషయంలో ప్రజలు ఇంకెంతకాలం ఇబ్బంది పడాలని, రెవెన్యూ శాఖ ఎందుకు స్పష్టమైన

మిగతా 11వ పేజీలో...

బంగారు కుటుంబాలకు సంక్షేమంలో కోత ఉండదు

వారికి పథకాలు యథాతథం: చంద్రబాబు

- పేద, ధనిక అంతరాలు తగ్గించేందుకే పీ-4.. పథకం సమర్థ అమలుకు 2 కమిటీలు
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 6-10 వేల బంగారు కుటుంబాలు
- స్థానికంగా పరిశ్రమలుంటే వాటికి కుటుంబాల దత్తత బాధ్యత
- ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలు
- లక్ష మంది మార్గదర్శులనూ గుర్తించాలి
- ఫౌండేషన్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ
- పీ-4 లోగో ఆవిష్కరణ.. ఈ విధానం అమల్లో బాపట్ల నంబర్ వన్

12

కొందరు మార్గదర్శులు ఒక్కసారి ఆర్థిక సాయం చేస్తే సరిపోతుందని భావిస్తున్నారు. ఇలాంటి వారి సాయాన్ని పీ-4 వేదికగా పేదలకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధమే. అయితే దత్తత తీసుకున్న పేద కుటుంబాలకు నిరంతరం దిశానిర్దేశం చేసే మార్గదర్శులను గుర్తించాలి. - చంద్రబాబు



వైసీపీ వారేదో అద్భుతమైన పాలన చేసినట్టు ప్రజల ముందు వాపోతున్నారు కదా?. నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే 11 సీట్లకు ఎందుకు పరిమితమయ్యారు.

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

మీరెలా వస్తారో చూస్తాం!

వైసీపీని మళ్లీ రానివ్వం.. ఆ పార్టీ రౌడీయిజానికి భయపడం

- నరుకుతాం అంటే మౌనంగా ఉంటామా?
- గూండాయిజం తప్ప ప్రజలకు మేలు చేయటం ఆ పార్టీ నేతలకు తెలియదు
- తాటాకు చప్పుళ్లకు కూటమి భయపడదు
- మరో పదిహేనేళ్ల వరకు కలిసే ఉంటాం
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టీకరణ
- మార్కాపురంలో 'జల్‌జీవన్' పనులకు శ్రీకారం

'వైసీపీ నాయకులు గత ఐదేళ్లూ అభివృద్ధిని గాలికొదిలేశారు. అధికారం చేజారిపోయాక మళ్లీ మేమొస్తే అంటూ బెదిరించాలని చూస్తున్నారు. 2029లో వైసీపీ అధికారంలోకి ఎలా వస్తుందో చూస్తాం' - ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఒంగోలు, జూలై 4(ఆంధ్రజ్యోతి): "వైసీపీ నాయకులు ప్రజల కోసం ఆలోచించరు. రౌడీయిజం, గూండాయిజం చేయాలన్నదే వారి భావన. మళ్లీ మేమొస్తే... అని ఇప్పటి నుంచే బెదిరిస్తున్నారు. వాళ్లను మళ్లీ అధికారంలోకి రానివ్వం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. సినిమా డైలాగులు ప్రజలకు వినోదం కోసం, ఉత్సాహం నింపటానికి మాత్రమేనన్నారు. రాజకీయాల్లో తాను సినిమా డైలాగులు చెప్పనని తెలిపారు. అయితే, వైసీపీ నాయకులు సినిమా డైలాగులు ఉపయోగించి నరుకుతాం, చంపుతాం, రంపాలు తెస్తాం, రప్పా రప్పా కోస్తాం.. అని అంటున్నారని, ఇలాంటి బెదిరింపులకు భయపడే వాళ్లం కాదని పవన్ స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం నరసింహాపురంలో జల్ జీవన్ మిషన్ కింద రూ.1,290 కోట్లతో చేపడుతున్న తాగునీటి పథకానికి శుక్రవారం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో

మిగతా 11వ పేజీలో...

లక్షల కోట్లు పంచామంటూ..

31,500 కట్టలేకపోయారు!



జగన్ జమానాలో ఆర్థిక దౌర్భాగ్యం

- న్యాయ శాఖ లైబ్రరీకి జర్నల్స్, బుక్స్ కొనుగోలు చేసిన బిల్లులు పెండింగ్
- మరో బిల్లు 93,510 కూడా.. ఇలాంటి పెండింగ్ కేసులు వేలల్లోనే

రూ.31,500 బిల్లు.. రాష్ట్ర ప్రభుత్వానికి చాలా చిన్నది. దాదాపు రూ.3 లక్షల కోట్లు బడ్జెట్ ఉన్న ప్రభుత్వానికి ఈ బిల్లు చెల్లించడం చిటికెలో పని. కానీ 'బటన్' నొక్కి రూ.2 లక్షల కోట్లు పేదలకు పంచామని గొప్పలు చెప్పుకొన్న గత జగన్ సర్కారు ఈ బిల్లును కూడా చెల్లించలేకపోయింది. అంతేకాదు ఎంతో మంది చిన్న చిన్న కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా అన్యాయం చేసింది. తక్కువలో తక్కువగా వేల రూపాయల్లో చెల్లించాల్సిన వేలాది బిల్లులను పెండింగ్‌లో పెట్టింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో న్యాయ శాఖ లైబ్రరీకి అవసరమైన జర్నల్స్, బుక్స్ రెండు వేర్వేరు చోట్ల నుంచి తీసుకున్నారు. వీటి బిల్లులు రూ.31,500, రూ.93,510 అయ్యాయి. ఈ బిల్లులు చెల్లించాలని 2024 జనవరి 12వ తేదీన న్యాయ శాఖ రెండు జీవోలు ఇచ్చింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ బిల్లులను చెల్లించలేదు సరికదా.. 2024 మార్చి 31 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున వాటిని తదుపరి ఆర్థిక సంవత్సరానికి తీసుకురాకుండా రద్దు చేసేసింది. అన్ని అనుమతులూ పొంది, సీఎఫ్ఎంఎస్ వ్యవస్థలోకి

మిగతా 2వ పేజీలో...

నవ భారతంలో అవకాశాలకు

హద్దే లేదు

- త్వరలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కానుంది
- ఏఐ, సెమీ కండక్టర్, క్వాంటమ్ కంప్యూటింగ్‌లతో ముందంజ
- బిహార్ వారసత్వం ఘనమైనది
- ట్రినిడాడ్, టుబాగోలో మోదీ



పోర్ట్ ఆఫ్ స్పెయిన్, జూలై 4: భారత్‌లో అవకాశాలకు హద్దే లేదని, త్వరలో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించనుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఏఐ, సెమీ కండక్టర్, క్వాంటమ్ కంప్యూటింగ్‌లో చేపడుతున్న పరిశోధనలు భారత్ అభివృద్ధికి నూతన చోదకాలుగా ఉన్నాయని చెప్పారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఆయన గురువారం ట్రినిడాడ్, టుబాగో చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక

మిగతా 2వ పేజీలో...

మిషన్ మోడ్‌తో నైపుణ్యం పోర్టల్

- యువత, పరిశ్రమల అనుసంధానం
- సెప్టెంబరులో ప్రారంభించేలా చర్యలు
- ఆగస్టు 7 నుంచి అక్షర ఆంధ్ర
- 3 నెలలకోసారి జాబ్ మేళాలు
- నైపుణ్యాభివృద్ధి, ఇంటర్ విద్య సమీక్షలో మంత్రి లోకేశ్

11

జెన్కో జోరు

8

- రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి
- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- మొత్తం 199 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

వర్సిటీలకు వీసీలు దొరకలేదా?

- ఏడాదైనా ఇన్‌చార్జి పాలనే
- 9 విశ్వవిద్యాలయాల్లో ఇక్కట్లు
- నిలిచిపోయిన విధాన నిర్ణయాలు
- జాతీయ విద్యా సంస్థల నుంచి మేధావులను తేవాలని యత్నం
- ముందుకు సాగని ప్రక్రియ

విశ్వవిద్యాలయాల పాలనకు కీలకమైన వైస్ చాన్సలర్ల (వీసీ) పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. పోస్టులు ఖాళీ అయి ఏడాది దాటినా ఇంకా తొమ్మిది వర్సిటీలకు వీసీలను నియమించలేకపోతోంది. అవన్నీ ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగుతున్నాయి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విశ్వవిద్యాలయాల పాలనకు వైస్ చాన్సలర్లే కీలకం. కానీ... రాష్ట్రంలో ఏకంగా తొమ్మిది వర్సిటీలు ఏడాదికిపైగా ఇన్‌చార్జిల పాలనలో నడుస్తున్నాయి. జగన్ హయాంలో వీసీలుగా నియమితులైనవారు ప్రభుత్వం మారడంతో రాజీనామాలు చేశారు. ఆ తర్వాత నోటిఫికేషన్ జారీకి ప్రభుత్వం కొంత సమయం తీసుకుంది. ఎట్టకేలకు గత ఏడాది సెప్టెంబరు 9న 17 వర్సిటీలకు వీసీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. అప్పట్లో

మిగతా 2వ పేజీలో...

లలిత్ మోదీ, విజయ్‌మాల్యా డ్యాన్స్

▸ లండన్‌లోని తన ఇంట్లో లలిత్ మోదీ పార్టీ.. వీడియో వైరల్



లండన్, జూలై 4: విదేశాలకు పారిపోయిన ఘరానా ఆర్థిక నేరగాళ్లు లండన్‌లోని ఓ పార్టీలో 'ఐ డిడ్ ఇట్ మై వే' అనే పాట పాడుతూ.. స్టెప్పులేయడం నెట్టింట వైరల్ అవుతోంది. కామన్వెల్త్ కుంభకోణం, మనీలాండరింగ్ కేసుల్లో నిందితుడు, ఐపీఎల్ మాజీ చీఫ్ లలిత్ మోదీ లండన్‌లోని తన ఇంట్లో ఇచ్చిన ఓ పార్టీకి రూ.9 వేల కోట్ల మేర బ్యాంకు రుణాలను ఎగ్గొట్టిన కింగ్‌ఫిషర్ అధినేత విజయ్ మాల్యా హాజరయ్యారు. మాజీ క్రికెటర్ క్రిస్ గేల్ సహా.. 310 మంది అతిథులు ఈ పార్టీలో పాల్గొన్నారు. ఈ విందులో లలిత్ మోదీ, విజయ్ మాల్యా కలిసి ఫ్రాంక్ సినట్రా ఆలపించిన ప్రసిద్ధ పాట 'ఐ డిడ్ ఇట్ మై వే..'ను కలిసి పాడారు. ఈ వీడియోను లలిత్ మోదీ స్వయంగా తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో పోస్టు చేశారు. "ఇంటర్నెట్‌ను ఈ వీడియో బ్రేక్ చేయదని ఆశిస్తున్నా. ఇది వివాదాస్పదమే కానీ.. నేను చేసేది అదే" అని ఆయన పోస్టు చేశారు. క్రిస్ గేల్ కూడా తన సోషల్ మీడియా ఖాతాల్లో ఈ వీడియోలు, ఫొటోలను షేర్ చేశారు. విజయ్ మాల్యా, లలిత్ మోదీని భారత్‌కు రప్పించాలని సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే..! అయితే.. పరారీలో ఉన్న నేరస్థులుగా కోర్టులు గుర్తించిన వీరిద్దరు మాత్రం చిందులేయడంపై నెటిజన్లు మండిపడుతున్నారు.

ఆస్తే లేనప్పుడు మనీలాండరింగ్ ఎక్కడిది?

▸ నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా న్యాయవాది వాదనలు

న్యూఢిల్లీ, జూలై 4: నేషనల్ హెరాల్డ్ పత్రిక అప్పులు తీర్చే క్రమంలో నగదు అక్రమ చలామణికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీపై ఈడీ నమోదు చేసిన కేసుపై శుక్రవారం సీబీఐ ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసును పరిగణనలోకి తీసుకోవాలంటూ ఈడీ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు చేసిన వాదనను సోనియా తరపున హాజరైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఖండించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికను నిర్వహించే ఏజేఎల్‌కు ఉన్న రూ.90 కోట్ల అప్పులను యంగ్ ఇండియన్ అనే సంస్థ తీర్చిందని, ఇందుకు ప్రతిగా రూ.2వేల కోట్లు విలువ చేసే ఏజేఎల్ ఆస్తులను ఆ సంస్థకు బదలాయించారని ఈడీ ఆరోపించింది. యంగ్ ఇండియన్ సంస్థలో 76% వాటాలు సోనియా, రాహుల్ గాంధీలకు ఉన్నందున అంతిమ లబ్ధిదారులు వారేనని ఆరోపిస్తూ ఈడీ వారిపై మనీలాండరింగ్ కేసు పెట్టింది. అయితే, ఎలాంటి ఆస్తులు చేతులు మారకుండానే నగదు అక్రమ చలామణి జరిగినట్టు కేసు నమోదు చేయడం విచిత్రమని సింఘ్వీ వాదించారు. ఒకే పరిధిలో ఉన్న ఒక సంస్థ అప్పులను మరో సంస్థ తీర్చడం, అందుకు వివిధ మార్గాల్లో ఆస్తులు బదలాయించడం అన్ని కంపెనీలు చేస్తున్న పనేనని చెప్పారు. ఇందుకు చట్టం కూడా అనుమతి ఇస్తుందని తెలిపారు.

డ్రోన్ల తయారీకి రూ.20వేల కోట్ల ప్రోత్సాహకాలు

న్యూఢిల్లీ, జూలై 4: దేశంలో డ్రోన్ల తయారీకి భారీ ఊతం ఇస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డ్రోన్ల తయారీ, విడిభాగాల రూపకల్పన, యాంటీ డ్రోన్ వ్యవస్థకు భారీ మద్దతు ప్రకటించింది. వచ్చే మూడేళ్లలో స్వదేశీ డ్రోన్ల తయారీకి ప్రాధాన్యం ఇస్తూ సుమారు రూ.20 వేల కోట్లమేరకు ప్రోత్సాహకాలను అందించనుంది. గత మేలో పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో దాయాది దేశానికి టర్కీ, చైనాలు డ్రోన్ల సాయం చేశాయి. అదేవిధంగా చైనా కూడా అధునాతన డ్రోన్లను సమకూర్చుకుంది. ఈ నేపథ్యంలో సరిహద్దుల భద్రత, సీమాంతర ఉద్రిక్తతలను బలంగా ఎదుర్కొనేందుకు భారత్ కూడా బలమైన డ్రోన్ వ్యవస్థను కలిగి ఉండాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రూ.20 వేల కోట్ల ప్రోత్సాహకాలతో డ్రోన్ల రంగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నట్టు అధికారులు తెలిపారు. తాజా పథకంలో చిన్న, మధ్య తరహా డ్రోన్ల తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేవారికి స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా స్వల్ప వడ్డీకే రుణాలు ఇప్పించనున్నారు. కాగా, దేశంలో ఇప్పటికే 600లకు పైగా కంపెనీలు డ్రోన్లను ఉత్పత్తి చేస్తున్నాయి.

నవ భారతంలో
అవకాశాలకు హద్దే లేదు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమానికి ఆ దేశ ప్రధాని కమ్లా పెర్సాద్, కేబినెట్ మంత్రులు, శాసనసభ్యులు తదితరులు 4000 మందికిపైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. భారత్ నేడు అవకాశాల గని అని, అభివృద్ధి ఫలాలు అర్హులకు అందుతున్నాయని వారికి వివరించారు. ప్రధాని తన ప్రసంగంలో అక్కడ స్థిర పడిన భారత సంతతి ప్రజలను ప్రశంసలతో ముంచెత్తారు. అయోధ్య ఆలయ నమూనాను, సరయు నది జలాలను, కుంభమేళా సందర్భంగా సేకరించిన గంగా జలాలను వారి కోసం తీసుకువచ్చినట్లు చెప్పారు. భారత్‌లో డిజిటల్ చెల్లింపులను యూపీఐ విప్లవాత్మకం చేసిందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో జరిగే డిజిటల్ లావాదేవీల్లో సగం భారత్‌లోనే జరుగుతున్నాయన్నారు. ట్రినిడాడ్, టుబాగోలో తొలిసారిగా ఈ వ్యవస్థను ప్రవేశ పెడుతున్నందుకు అభినందనలు తెలిపారు. కాగా ట్రినిడాడ్ టుబాగోలోని కూవాలో మాట్లాడుతూ.. బిహార్ రాష్ట్రంతో అక్కడి వారికి ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేశారు. ఇక్కడున్న



ట్రినిడాడ్ అండ్ టుబాగో అత్యున్నత పౌర పురస్కారాన్ని మోదీకి అందజేస్తున్న ఆ దేశ అధ్యక్షురాలు క్రిస్టీన్ కార్లా

పలువురి పూర్వీకులు బిహార్ వారే అన్నారు. ఆ ద్వీప దేశ ప్రధాని పూర్వీకులు కూడా బిహార్ వారేనని, భారత ప్రజలు ఆమెను బిహార్ పుత్రికగా భావిస్తారని పేర్కొన్నారు. బిహార్‌లో ఈ ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రధాని ఆ రాష్ట్ర వివరాలను ప్రధానంగా ప్రస్తావించారని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా ప్రధాని మోదీని ట్రినిడాడ్, టుబాగో అత్యున్నత పౌర పురస్కారం 'ద ఆర్డర్ ఆఫ్ ద రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టుబాగో'తో శుక్రవారం సత్కరించారు. మరోవైపు ఆ దేశ ప్రధాని ఇచ్చిన విందులో ఆయనకు సోహరీ ఆకుపై భోజనం వడ్డించడం విశేషం.

వెస్ట్ ఇండీస్ జట్టు అంటే అభిమానం!

ట్రినిడాడ్ టుబాగో పర్యటనలో భాగంగా మోదీ ఆ దేశ పార్లమెంటులో శుక్రవారం ప్రసంగించారు. ఈ సందర్భంగా క్రికెట్ గురించి ప్రస్తావించి పార్లమెంటు సభ్యులను ఆకట్టుకున్నారు. వెస్ట్ ఇండీస్ క్రికెట్ జట్టుకు భారతీయులు గట్టి అభిమానులు అని... వారు భారత్‌తో ఆడినప్పుడు తప్ప మిగిలిన అన్ని పోటీల్లో వారి విజయాన్ని కాంక్షిస్తారని జోక్ చేశారు. 180 ఏళ్ల క్రితం భారతీయులు వలస రావడంతో మొదలైన రెండు దేశాల మధ్య అనుబంధాన్ని ఈ సందర్భంగా మోదీ గుర్తుచేసుకున్నారు. రాజకీయాల నుంచి కవితల వరకు, క్రికెట్ నుంచి వాణిజ్యం వరకు భారత్ నుంచి వలస వచ్చిన వారు ట్రినిడాడ్, టుబాగోలో అన్ని రంగాల్లో తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు.

భారత్‌కు ఒక సరిహద్దు.. ముగ్గురు శత్రువులు

▸ 81% పాక్ సైనిక హార్డ్‌వేర్ చైనాదే

▸ ఆర్మీ అధికారి రాహుల్ సింగ్ వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి తర్వాత చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా ఒక్క సరిహద్దు ఆవల ముగ్గురు శత్రువులతో భారత్ పోరాడిందని ఆర్మీ డిప్యూటీ చీఫ్ (క్యాపబిలిటీ డెవలప్‌మెంట్) లెఫ్టినెంట్ జనరల్ రాహుల్.ఆర్.సింగ్ అన్నారు. యుద్ధంలో పాకిస్థాన్ నేరుగా పాల్గొన్నా.. ఆ దేశానికి ఆయుధాలిచ్చి చైనా, తుర్కియేలు భాగస్వాములైనట్లు ఆయన తెలిపారు. 2015 నుంచి పాకిస్థాన్‌కు చైనాయే ఆయుధాలను, యుద్ధ సామగ్రిని సరఫరా చేస్తోందని గుర్తుచేశారు. పాకిస్థాన్ సైనిక హార్డ్‌వేర్‌లో 81% చైనా అందజేసినదేనని చెప్పారు. చైనా తన సైనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్ష యుద్ధ పరిస్థితుల్లో పరీక్షించేందుకు పాకిస్థాన్‌ను లైవ్ ల్యాబ్‌లా వాడుకుంటోందని వివరించారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన భారత, వాణిజ్య పరిశ్రమల సమాఖ్య(ఫిక్కీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆపరేషన్ సిందూర్ నుంచి తాము ఎంతో నేర్చుకున్నామని జనరల్ రాహుల్ సింగ్ పేర్కొన్నారు. "తొలుత 21 టార్గెట్లు అనుకున్నాం. కానీ, చివరి క్షణాల్లో టార్గెట్లను 9కి తగ్గించాం" అని ఆయన వివరించారు. చైనా-పాకిస్థాన్ సంబంధాలు కేవలం ఆయుధాల సరఫరాకే పరిమితం కాలేదని.. చైనా తన ఆధునిక సాంకేతికత, యుద్ధ తంత్రాలను పాకిస్థాన్‌కు అందజేస్తోందని జనరల్ రాహుల్ పేర్కొన్నారు. పాకిస్థాన్ గడ్డ మీద నుంచి నిఘా వ్యవస్థలు, డ్రోన్లను చైనా ప్రత్యక్షంగా ప్రయోగిస్తోందని వివరించారు.

బీజేపీకి మహిళా బాస్!

▸ రేసులో నిర్మల, పురందేశ్వరి, వనతీ శ్రీనివాసన్?

న్యూఢిల్లీ, జూలై 4: బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి తొలిసారి మహిళను వరించే అవకాశముంది. ఈ పదవికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ మాజీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతీ శ్రీనివాసన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురూ దక్షిణాదివారు కావడం విశేషం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు చేయాలని భావిస్తున్న నేపథ్యంలో మహిళా నాయకత్వం వైపు పార్టీ అగ్రనేతలు మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. మహిళా నాయకత్వానికి ఆరెస్సెస్ కూడా మద్దతు ఇస్తున్నట్టు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

పురందేశ్వరి

ఏపీ బీజేపీ మాజీ చీఫ్ పురందేశ్వరి బహుభాషావేత్త. గతంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రాజమండ్రి ఎంపీగా ఉన్నారు. ఎన్టీఆర్ కుమార్తెగానే గాక రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'ఆపరేషన్ సిందూర్'పై వివరించడానికి ఇటీవల కేంద్రం విదేశాలకు పంపిన అఖిలపక్ష ప్రతినిధి బృందంలో ఆమె ఉన్నారు.


నిర్మలా సీతారామన్

అధ్యక్ష రేసులో నిర్మలా సీతారామన్ ముందు వరుసలో ఉన్నారు. ఇటీవల ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు నడ్డా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌తో ఆమె భేటీ అయ్యారు. ఆమెకు పగ్గాలు అప్పగిస్తే దక్షిణాదిలో పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

వనతీ శ్రీనివాసన్

వనతీ శ్రీనివాసన్ తమిళనాడు బీజేపీ రాష్ట్ర శాఖ కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. 2020లో బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. 2022లో పార్టీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. ఈ పదవికి ఎంపికైన తొలి తమిళ మహిళ ఆమే.

లోకం తీరు



మూడో బిడ్డను కంటే రూ.12 లక్షలు!

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులకు 50 వేల యువాన్లు (దాదాపు రూ.6 లక్షలు), మూడో బిడ్డను కన్న వారికి ఏకంగా లక్ష యువాన్లు (రూ.12 లక్షలు) ఇస్తామంటూ చైనాలో ఓ రాష్ట్రమైన ఇన్నర్ మంగోలియా ప్రభుత్వం ప్రకటించటం అక్కడి పరిస్థితులను తేటతెల్లం చేస్తోంది. ఇదే బాటలో పలు స్థానిక ప్రభుత్వాలు నడుస్తున్నాయి. పిల్లల్ని కనే జంటలకు నగదు ప్రోత్సాహకాలు, గృహ నిర్మాణానికి సబ్సిడీలను ప్రకటించాయి. తాజాగా, అక్కడి కేంద్ర ప్రభుత్వం కూడా ఈ దిశగా యోచిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. పుట్టే ప్రతీ శిశువుకూ ఏటా 3,600 యువాన్ల (దాదాపు రూ.43 వేలు) చొప్పున మూడేళ్ల పాటు ఆ శిశువు తల్లిదండ్రులకు ఇచ్చే పథకంపై కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నాయి. ఈ ఏడాది జనవరి 1వ తేదీన, ఆ తర్వాత పుట్టిన శిశువులకు దీనిని వర్తింపజేయనున్నట్లు పేర్కొన్నాయి. జననాలు తగ్గటంతో చైనాలో వృద్ధుల సంఖ్య పెరిగిపోతోంది. ఉద్యోగాలు, పనులు చేయగల వయస్కుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది. ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాకు ఇది తీవ్ర నష్టదాయక పరిణామం. ఇదే పరిస్థితి కొనసాగితే.. 2100 నాటికి చైనా జనాభా ఏకంగా 80 కోట్లకు పడిపోతుందని ఐక్యరాజ్యసమితి జనాభా అంచనాల విభాగం లెక్కగట్టింది.

తాలిబన్ సర్కారుకు రష్యా గుర్తింపు

మాస్కో, జూలై 4: అఫ్గానిస్థాన్‌లో అధికారం చేపట్టిన నాలుగేళ్ల తర్వాత తాలిబన్ సర్కారుకు గొప్ప విజయం దక్కింది. తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తిస్తున్నట్లు రష్యా తాజాగా ప్రకటించింది. అఫ్గాన్ రాయబారి గుల్ హసన్ హసన్‌కు ఈమేరకు పత్రాలు అందజేసినట్లు రష్యా విదేశాంగ శాఖ తెలిపింది. ఇప్పటివరకు తాలిబన్ సర్కారును అధికారికంగా ఏ దేశం గుర్తించలేదు.

31,500 కట్టలేకపోయారు!

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన ఇలాంటి వేలాది బిల్లులను రద్దు చేసింది. ఇప్పుడు ఆ బిల్లులు చెల్లింపులకు అర్హత సాధించాలంటే మళ్లీ ఆ శాఖతో పాటు ఆర్థిక శాఖ అనుమతులు తీసుకోవాలి. పరిశీలనలు పూర్తయ్యాక దాన్ని చెల్లింపుల వ్యవస్థలోకి తీసుకురావాలి. ఈ లోపు ఆర్థిక సంవత్సరం పూర్తవుతుంది. కథ మళ్లీ మొదటికొస్తుంది. ఇలా జగన్ హయాంలో ఐదేళ్ల పాటు అలా రద్దవుతూ, వ్యవస్థలోకి ఎక్కుతూ ఉన్న బిల్లులు లెక్కలేనన్ని ఉన్నాయి. రూ.10,000 లోపు ఉన్న బిల్లులు కూడా అనేకం పెండింగ్‌లో పెట్టింది. చిన్న చిన్న కాంట్రాక్టర్లు సీఎంవో చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా కరుణించలేదు. బిల్లుల బాధితుల నుంచి తప్పించుకునేందుకు అప్పటి ఆర్థిక శాఖ అధికారులైతే ఏకంగా పోలీసులనే కాపలాగా పెట్టుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 9వ తేదీన ఆర్థిక శాఖ ఇచ్చిన మెమో ప్రకారం ఇలా ఆర్థిక సంవత్సరాంతంలో రద్దయిన బిల్లులకు మళ్లీ ఆర్థిక శాఖతో పాటు సంబంధిత అన్ని శాఖల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

నాడు అంతా అడ్డగోలు

జగన్ హయాంలో రాష్ట్రంలో ఉన్న ఆస్తులు, ప్రభుత్వ కార్యాలయాలు, కాలేజీలు, పార్కులు, భూములు తాకట్టు పెట్టారు. మద్యంపై వచ్చే ఆదాయాన్ని పాతికేళ్ల పాటు తాకట్టు పెట్టి మరీ అప్పులు చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా కార్పొరేషన్లను సృష్టించి వాటి ద్వారా లక్షల కోట్ల అప్పులు చేశారు. అయినా కాంట్రాక్టర్లకు పెద్ద ఎత్తున బిల్లులు చెల్లించలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ఆర్థిక శాఖపై ఇచ్చిన శ్వేతపత్రంలో గత ప్రభుత్వంలోని పెండింగ్ బిల్లులు రూ.13,5,000 కోట్లు ఉన్నాయని వెల్లడించారు. ఇంకా తేలాల్సిన బిల్లులు ఉన్నాయని చెప్పారు. నాడు ఆర్థిక వ్యవస్థను జగన్ అస్తవ్యస్తంగా నిర్వహించారు. గత ఐదేళ్ల పాలనలో ఆర్థిక శాఖను అప్పులు తెచ్చే శాఖగా మాత్రమే చూశారు. ఏనాడూ కూడా పెండింగ్ బిల్లులు, వాటి చెల్లింపులపై సమీక్ష చేయలేదు. అస్మదీయుల బిల్లుల చెల్లింపులు మాత్రమే ఆగకుండా జరిగాయి. బిల్లుల బాధితులు లక్షల సంఖ్యలో హైకోర్టును ఆశ్రయించారు. బిల్లులు చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పినా లెక్కచేయలేదు. దీంతో ఐఏఎస్‌లు స్వయంగా కోర్టుకు హాజరై శిక్షలు ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి.

21 వేల కోట్లు చెల్లించిన 'కూటమి'

చంద్రబాబు సీఎం అయ్యాక జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బిల్లుల్లో దాదాపు రూ.21,000 కోట్లు చెల్లించారు. కేంద్ర పథకాల కోసం మ్యాచింగ్ గ్రాంటుగా రూ.8,000 కోట్లు ఖర్చు పెట్టి దాదాపు 70 పథకాలను తిరిగి గాడిలో పెట్టారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో కేంద్రం పథకాల కోసం ఇచ్చిన డబ్బును, అందుకు మ్యాచింగ్‌గా రాష్ట్రం ఖర్చు చేయాల్సిన సొమ్మును కూడా దారి మళ్లించారు.

వర్సిటీలకు వీసీలు దొరకలేదా?

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 2,500 దరఖాస్తులు అందాయి. అయితే, జాతీయ విద్యా సంస్థల ప్రొఫెసర్లను వీసీలుగా నియమించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 18న తొమ్మిది వర్సిటీలకే వీసీలను నియమించింది. ఆంధ్రా, జేఎన్‌టీయూకే, యోగి వేమన, విక్రమ సింహపురి, రాయలసీమ, జేఎన్‌టీయూ అనంతపురం, పద్మావతి మహిళా, కృష్ణా, నన్నయ వర్సిటీలకు వీసీలను నియమించింది. అయితే, హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి వచ్చి వేమన వర్సిటీ వీసీగా నియామకం పొందిన ఫణితి ప్రకాశబాబు ఆ తర్వాత మంచి అవకాశం రావడంతో రాజీనామా చేసి వెళ్లిపోయారు. దీంతో మళ్లీ 9 వర్సిటీలకు వీసీలను నియమించాల్సి వచ్చింది. వీటిలో ఆచార్య నాగార్జున, శ్రీకృష్ణ దేవరాయ, జేఎన్‌టీయూ విజయనగరం, ద్రవిడ, ఉర్దూ, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఆంధ్ర కేసరి, శ్రీవెంకటేశ్వర, వేమన యూనివర్సిటీలు ఉన్నాయి. వీటిలో నాగార్జున, ఎస్వీయూ, శ్రీకృష్ణ దేవరాయ వంటి కీలక వర్సిటీలకు రెగ్యులర్ వీసీలు లేకపోవడంతో పాలన గాడి తప్పుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

ఇప్పుడు కొత్త సెర్చ్ కమిటీలు

కొన్నాళ్ల కిందట ప్రభుత్వం 4 యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను నియమించింది. యూజీసీ కొత్త నామినీలతో శ్రీకృష్ణ దేవరాయ, జేఎన్‌టీయూ విజయనగరం, ఆచార్య నాగార్జున, ద్రవిడియన్ యూనివర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు సిఫారసు చేసిన పేర్లు ప్రభుత్వానికి అందాయి. కాగా, ప్రభుత్వం మొత్తం తొమ్మిది వర్సిటీలకు ఒకేసారి వీసీల పేర్లు ప్రకటించాలనే ఆలోచనలో ఉంది. దీనికిగాను మరో రెండు మూడు నెలల సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది.

వీసీలే కీలకం...

రెగ్యులర్ వీసీ ఉంటే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటుంది. లేనిపక్షంలో సాధారణ అంశాలకే ఈసీ పరిమితం అవుతుంది. వర్సిటీల్లో కీలక మార్పులు చేయాలంటే వీసీ నేతృత్వంలోని ఈసీ నిర్ణయం తీసుకోవాలి. కీలకమైన ఆర్జీయూకేటీ కూడా రెగ్యులర్ చాన్స్‌లర్ లేకుండానే కొనసాగుతోంది. ఇటీవల ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు చాన్స్‌లర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. డైరెక్టర్లు కూడా వైసీపీ ప్రభుత్వంలో నియమించినవారే కొనసాగుతున్నారు. మరోవైపు ఉన్నత విద్యామండలిలో వైస్ ఛైర్మన్లు ఇప్పటికీ జగన్ ప్రభుత్వం నియమించినవారే ఉన్నారు.

లక్ష్యం బాగున్నా

రాష్ట్ర విశ్వవిద్యాలయాలను ప్రపంచంలోని టాప్-100లోకి తేవాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీనిలో భాగంగా ఐఐటీలు, ఎన్ఐటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లను తీసుకొచ్చి వీసీలుగా నియమిస్తే విశ్వవిద్యాలయాలను అద్భుతంగా తీర్చిదిద్దుతారని భావిస్తోంది. ఈ క్రమంలో మొదట ప్రకటించిన తొమ్మిది యూనివర్సిటీల్లో ఎక్కువ మంది బయటి వారికి అవకాశం కల్పించింది. దీంతో మిగిలిన యూనివర్సిటీలకు కూడా అదే తరహాలో వీసీలను నియమించాలని ప్రభుత్వం భావించింది. ఫలితంగా వీసీల నియామకంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అదేసమయంలో వైసీపీ హయాంలో భ్రష్టుపట్టిన వర్సిటీలకు తిరిగి పూర్వవైభవం తీసుకురావాలని సర్కారు సంకల్పించింది. కానీ... వీసీల నియామకం మాత్రం కొలిక్కి రావడం లేదు. వీసీల నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీల్లో యూజీసీ ప్రతినిధిని కూడా ఉండాలని... కేంద్ర ప్రభుత్వ స్పందన కోసం ఎదురు చూస్తున్నామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

డిగ్రీలో 'సింగిల్ మేజర్' విధానం!

▸ పలు మార్పులతో అమలుకు ప్రభుత్వం నిర్ణయం

▸ ఆఫ్‌లైన్‌లోనూ అడ్మిషన్లకు లోకేశ్ ఆదేశాలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యలో ప్రభుత్వం మళ్లీ మార్పులు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం మూడు సబ్జెక్టుల విధానాన్ని మార్చి.. సింగిల్ మేజర్ సబ్జెక్టు డిగ్రీ విధానాన్ని తీసుకొచ్చింది. దీనిపై సమీక్షించిన ఉన్నత విద్యా మండలి డ్యూయల్ మేజర్ (రెండు సబ్జెక్టులు) విధానంపై నిర్ణయం తీసుకుంది. అయితే అది యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా, విద్యార్థులకు భారం పెంచేలా ఉందని భావించిన ప్రభుత్వం.. సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్నే అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చింది. అయితే ప్రస్తుతం ఉన్నట్లు కాకుండా సింగిల్ మేజర్ డిగ్రీలో పలు మార్పులు తీసుకురానుంది. అడ్మిషన్లలో ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌కి కూడా అవకాశం కల్పించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. సీట్లు భర్తీ సమయంలో విద్యార్థుల అంగీకారాన్ని ఆధార్ అథెంటికేషన్‌తో రికార్డు చేయాలన్నారు.

పండగ వాతావరణంలో 'మెగా పీటీఎం'

▸ పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలి

▸ ఆగస్టు నాటికి 'మెగా డీఎస్సీ' నియామకాలు

▸ విద్యాశాఖ సమీక్షలో మంత్రి లోకేశ్ ఆదేశాలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్- టీచర్స్ సమావేశాలను పండగ వాతావరణంలో నిర్వహించాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన విద్యాశాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ పర్యావరణంపై అవగాహన కల్పించేలా పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. మొక్కలను పరిరక్షించేలా చూసి విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టులు అందించాలన్నారు. రాష్ట్రానికి మంజూరైన 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటుకు, భవిత సెంటర్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లోని మారుమూల పాఠశాలలకు మొబైల్ నెట్‌వర్క్ అందేలా చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. గిరిజన విద్యార్థులు బడులకు వెళ్లే దారులపై అధ్యయనం చేయాలని, అవసరమైన చోట్ల నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు నాటికి మెగా డీఎస్సీలో ఎంపికైన టీచర్లకు నియామక ఉత్తర్వులు అందించేలా చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు. హైస్కూల్ ప్లస్‌లలో అధ్యాపకులను నియమించాలని, షెడ్యూలు ప్రకారం అన్ని ప్రవేశ పరీక్షలు పూర్తిచేసి అడ్మిషన్లు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో కొత్త వర్సిటీలు నెలకొల్పేందుకు ముందుకొచ్చిన యాజమాన్యాలతో చర్చించాలని, వర్సిటీల ఏర్పాటుకు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎరువులు దొరకవనే అపోహ వద్దు: అగ్రి డైరెక్టర్

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలకు అవసరమైన ఎరువులు దొరకవనే అపోహలు వద్దని, కొరత ఉందనే దుష్ప్రచారాన్ని రైతులు నమ్మొద్దని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు కోరారు. ఎప్పటికప్పుడు సమీక్ష చేసి, అవసరం మేరకు ప్రైవేట్ డీలర్లు, సొసైటీలు, రైతుసేవా కేంద్రాల్లో ఎరువులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. శుక్రవారం మంగళగిరిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో కంపెనీల ప్రతినిధులు, డీలర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మార్క్‌ఫెడ్, సొసైటీలు, రైతుసేవా కేంద్రాలు, డీలర్ల వద్ద 8.73లక్షల టన్నుల ఎరువుల లభ్యత ఉండగా, యూరియా 3.12లక్షల టన్నులు ఉన్నాయని తెలిపారు. వచ్చే 3 నెలల్లో మరో 4.50లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. డీలర్లు కృత్రిమ కొరత సృష్టించినా, ఎమ్మార్పీ కన్నా అధికంగా అమ్మినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. పంటల సరళిని బట్టి ఆయా ప్రాంతాలకు ముందుగా ఎరువులు సరఫరా చేయాలని కంపెనీలను కోరారు.

మామిడి రైతుల కష్టాలపై సీఎం స్పందించాలి: సీపీఐ

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మామిడి రైతుల కష్టాలపై ముఖ్యమంత్రి స్పందించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ప్రస్తుతం కొనుగోళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీఎం.. ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

'ఏఎంఆర్'పై వైద్యులు దృష్టి సారించాలి

▸ మంత్రి సత్యకుమార్

▸ 20న గుంటూరులో ఏఎంఆర్‌పై రాష్ట్రస్థాయి సదస్సు

గుంటూరు మెడికల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తున్న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ సమస్యను అధిగమించడంలో వైద్యులు కీలక పాత్ర పోషించాలని, దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. ఏఎంఆర్‌పై వైద్యులకు శాస్త్రీయ అవగాహన కోసం నిర్వహిస్తున్న నిరంతర వైద్య విద్యా సదస్సు పోస్టర్‌ను మంత్రి శుక్రవారం విజయవాడలోని ఎన్టీఆర్ వర్సిటీలో ఆవిష్కరించారు. ఐఎంఏ రాష్ట్ర శాఖ, క్లినికల్ ఇన్ఫెక్షన్ డిసీజెస్ సొసైటీ (సీఐడీఎస్) గుంటూరు శాఖల సంయుక్తంగా జరిగిన ఈ సదస్సులో మంత్రి మాట్లాడుతూ ఏఎంఆర్‌పై తొలిసారిగా గుంటూరులో త్వరలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనుండటం అభినందనీయమన్నారు. ఏఎంఆర్‌పై శాస్త్రీయ అవగాహన కలిగించేందుకే ఈనెల 20న గుంటూరు వైద్య కళాశాలలో ఒకరోజు రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిశోర్ తెలిపారు. అనంతరం యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అధికారులతో కలిసి మంత్రి పోస్టరు విడుదల చేశారు. సీఐడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.కళ్యాణ్ చక్రవర్తి, ఏంఎసీ ఛైర్మన్ డాక్టర్ డి.శ్రీహరి రావు, డీఎంఈ డాక్టర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

'పారదర్శకత లేని బదిలీలతో ఉద్యోగుల ఆవేదన'

విజయవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామవార్డు సచివాలయాల్లో బదిలీలు సాగుతున్నతీరు పట్ల ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారని రాష్ట్ర గ్రామవార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా అన్నారు. బదిలీల ప్రక్రియ పూర్తి అన్యాయంగా, ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా జరిగిందని ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే బదిలీల ప్రక్రియ నిలుపుదల చేసి, తిరిగి బదిలీల షెడ్యూల్, సీనియారిటీ లిస్టు విడుదల చేయాలని కోరారు. ఇకనైనా అవకతవకలకు తావులేకుండా బదిలీలు నిర్వహించాలంటూ సచివాలయ శాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్, అడిషనల్ కమిషనర్ హెచ్ఆర్, మంత్రి కార్యాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.

దేవాలయాల జోలికొస్తే 11 సీట్లు కూడా రావు: బుచ్చిరాంప్రసాద్

అమరావతి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): దేవాలయాలనూ వైసీపీ కుటిల రాజకీయాలకు వాడుకుంటోందని, దేవాలయాల జోలికొస్తే 11 సీట్లు కూడా రావని రాష్ట్ర బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. శ్రీశైలం ప్రసాదంలో వైసీపీ వారే బొద్దింక పెట్టి గొడవ చేశారని, గతంలో టీటీడీ కంపార్ట్‌మెంట్‌లోనూ గొడవ చేసింది వైసీపీ కార్యకర్తేనని అన్నారు. వైసీపీ వారి రాక్షస మనస్తత్వాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

కాస్త 'జాగ్రత్త'గా మాట్లాడండి!

▸ దలైలామా వారసుడి ఎంపికపై రిజిజు వ్యాఖ్యలకు చైనా స్పందన

బీజింగ్, జూలై 4: టిబెట్ అత్యున్నత బౌద్ధ గురువు దలైలామా వారసుడి ఎంపిక విషయంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. టిబెట్ సంబంధిత అంశాలతో తమ దేశ అంతర్గత వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దని పేర్కొంది. మాటల్లో, చర్యల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. 14వ దలైలామా చైనా వ్యతిరేక స్వభావాన్ని భారత్ గుర్తించాలని, జిజాంగ్ (టిబెట్) సంబంధిత అంశాల్లో తమ వైఖరిని గౌరవించాలని పేర్కొంది. తదుపరి దలైలామాను ఎన్నుకొనే అధికారం సంబంధిత సంస్థ చేతుల్లోనే ఉందని, ఈ విషయంలో మరెవరూ జోక్యం చేసుకోలేరని రిజిజు చెప్పారు.

ప్రాణాలైనా ఇస్తాం.. భూములు మాత్రం ఇవ్వం!



తమ భూములు ఇచ్చేది లేదని అధికారులకు తెగేసి చెబుతున్న కరేడు రైతులు

- అధికారులకు స్పష్టం చేసిన కరేడు గ్రామస్థులు
- 'ఇండోసోల్' భూసేకరణకు ససేమిరా
- ప్రజల ఆందోళనతో గ్రామసభ వాయిదా

ఉలవపాడు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'మా ప్రాణాలైనా ఇస్తాం, కానీ సెంటు భూమి కూడా వదులుకోం' అంటూ రైతులు ముక్త కంఠంతో నినదించారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామ సచివాలయం-1 వద్ద శుక్రవారం గ్రామసభ జరిగింది. ఇండోసోల్ సోలార్ ప్రాజెక్టు భూసేకరణకు కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ ఈ సభలో పాల్గొన్నారు. సుమారు వంద మంది పోలీసులు ఉదయం నుంచే గ్రామంలో మోహరించారు. కరేడు పంచాయతీలోని 16 గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు గ్రామసభకు చేరుకున్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ పరిశ్రమలతో అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ కల్పన తదితర అంశాలను వివరించారు. ఇంతలో గ్రామస్థులు 'మా అనుమతులు లేకుండా మా భూములు తీసుకోవడానికి మీకు, ప్రభుత్వానికి హక్కు ఏముంది' అంటూ నిలదీశారు.



గ్రామసభకు తరలివచ్చిన గ్రామస్థులు, రైతులు

రియల్ ఎస్టేట్ దందా కోసమే

'ఇండోసోల్ కంపెనీకి 400 ఎకరాలు సరిపోతాయని అందరూ చెబుతుంటే ప్రభుత్వం మాత్రం 8,348 ఎకరాలు కావాలని విలువైన పచ్చటి భూములను లాక్కుంటోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రూ.కోట్ల పోగేసుకోవడానికే కదా' అంటూ కరేడు గ్రామస్థులు నిలదీశారు. పరిశ్రమల కోసం సేకరించిన భూముల పరిస్థితి, నష్టపోయిన గ్రామాల ప్రజల దుస్థితి కళ్ల ముందు కనిపిస్తోందని చెప్పారు. కరేడులోని రామకృష్ణాపురం, పొట్టేనుగుంట ఎస్టీ కాలనీ, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీల్లోని 300 ఇళ్లు తొలగిస్తారని చెబుతున్నారని తమ ఇళ్ల జోలికి వస్తే మూకుమ్మడిగా తగలబెట్టుకుంటామని మహిళలు హెచ్చరించారు.

అర్ధంతరంగా ముగిసిన సభ

నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పే పరిస్థితులు, ప్రభుత్వంపై వారి ఆగ్రహం కట్టడి చేయలేమని గ్రహించిన అధికారులు గ్రామసభను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు. ఒక దశలో సబ్ కలెక్టర్ ప్రభుత్వం కల్పించబోయే రాయితీలు, పరిహారం వివరించేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా గ్రామస్థులు, రైతులు ఆందోళనకు దిగారు. దీంతో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్, కందుకూరు సబ్ కలెక్టర్.. రైతులు తమ అభిప్రాయాలు తెలియచేస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ప్రకృతిని నాశనం చేసే అభివృద్ధి ఏంటో చెప్పాలి

'మా కరేడు తీర ప్రాంతంలో వేల ఎకరాల్లో వరి, వేరుశనగ, కాయగూరలు సాగవుతూ చుట్టు పక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. దీనిని ఇంకేవిధంగా అభివృద్ధి చేస్తారో చెప్పండి.' అంటూ మహిళలు అధికారులను నిలయదీయడంతో వారు నీళ్లు నమిలారు. ఎన్నో ప్రకృతి విపత్కర పరిస్థితులు, ఉపద్రవాలు ఎదురైనా వదులుకోని భూమిని ఇప్పుడు పరిశ్రమల పేరుతో దోపిడీ చేస్తామంటే ఊరుకుంటామా అంటూ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేధింపులకు పాల్పడితే జైల్ భరో చేస్తాం: బొత్స

పెదవేగి, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది. ఈ వేధింపులను ఆపకపోతే చలో జైల్ భరో నిర్వహిస్తాం. ఎంతమందిని అరెస్టు చేసి జైల్లో పెడతారో చూస్తాం. ఆ సమయంలో రాష్ట్రంలో ఉన్న జైళ్లు సరిపోవు' అని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నివాసం వద్ద శుక్రవారం జిల్లా స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'బాబు ష్యూరిటీతో ప్రజలు మోసపోవడం గ్యారంటీ. చంద్రబాబు అబద్ధాల కోరు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. జనసేన నేత 'సీజ్ ద షిప్' అన్నారు. కానీ ఆ షిప్ ఎక్కడ ఉందో ఇప్పటికీ తెలియడం లేదు' అని బొత్స ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వేధిస్తోందంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేసిన బొత్స జైల్ భరో అనబోయి జైల్ రోకో అనడంతో కార్యకర్తలు విస్తుబోయారు.

కాడెద్దులతో ఒకేరోజు 25 ఎకరాల్లో కంది విత్తనం!



నందికొట్కూరులో కాడెద్దులతో దున్నుతున్న రైతు

నందికొట్కూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాడెద్దులతో ఒకే రోజు ఏకంగా 25 ఎకరాల్లో కంది విత్తనం వేసి ఔరా అనిపించాడు నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన రైతు శ్రీనివాసులు. రెండు రోజుల క్రితం వర్షం కురవడంతో శ్రీనివాసులు తాను కౌలుకు తీసుకున్న పొలంలో కంది సాగుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు.. ఏకబిగిన మొత్తం 25 ఎకరాల్లో తన కాడెద్దులతో దున్నుతూ.. మరో ఇద్దరి సాయంతో కంది విత్తనం వేసి అందరినీ అబ్బురపరిచాడు.

కృత్రిమ మేధతో 'ఫార్మర్ చాట్' యాప్

- ఆవిష్కరించిన ఉద్యాన డైరెక్టర్ శ్రీనివాసులు

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): మైక్రోసాఫ్ట్ సహకారంతో డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ కృత్రిమ మేధతో పనిచేసే 'ఫార్మర్ చాట్' అనే యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలను అందిస్తుంది. ఆర్థికంగా మెరుగైన ప్రయోజనాల కల్పనకు సూచనలు చేస్తుంది. శుక్రవారం గుంటూరులోని ఉద్యాన శాఖ కమిషరేట్‌లో ఆ శాఖ డైరెక్టర్ కే శ్రీనివాసులు ఈ యాప్‌ను ఆవిష్కరించారు.

తోతాపురి రైతులను ఆదుకున్నది మేమే

- అవగాహన లేమితో వైసీపీ విష ప్రచారం: అచ్చెన్న

టెక్కలి, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి రైతులను ఆదుకున్నది రాష్ట్ర ప్రభుత్వమే. దీనిపై వైసీపీ ప్రబుద్ధులు కొందరు కనీస అవగాహన లేకుండా విష ప్రచారం చేస్తున్నారు' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఏటా చిత్తూరు జిల్లాలో తోతాపురి మామిడి 2.5 లక్షల టన్నులు పండేది. ఈ ఏడాది 6.5 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తూరు ప్రాంతంలో ఉన్న మామిడి రైతులతో పాటు మామిడి గుజ్జు తయారీ పరిశ్రమ యాజమాన్యాలతోనూ సమావేశమయ్యారు. మామిడి రైతాంగానికి అన్యాయం జరగకుండా చూడాలని, కిలో రూ.12 చొప్పున కొనుగోలు చేయాలని సూచించారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలోనూ మామిడి ధరలు పతనం కావడంతో వాళ్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. స్పందించిన కేంద్రం కిలోకి రూ.2 ఇస్తోంది. మొత్తంగా కిలో రూ.4కు కర్ణాటక ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఆ రాష్ట్ర జీవో పట్టుకుని చిత్తూరు వైసీపీ నాయకులు వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు' అని మంత్రి అచ్చెన్న వివరించారు.

పన్ను ఎగవేతదారులను కట్టడి చేయాలి

- జీఎస్టీపై ఆర్థిక మంత్రుల సమావేశంలో వర్చువల్‌గా పాల్గొన్న పయ్యావుల కేశవ్

అనంతపురం కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పన్ను ఎగవేతదారులను కట్టడి చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రాష్ట్రాలకు సంబంధించిన జీఎస్టీ సమాచారం పరస్పరం అందుబాటులో ఉంటే.. పన్ను ఎగవేతదారులను కట్టడి చేయడానికి వీలవుతుందని, ఏపీ తరఫున తాను ఇదే కోరుకుంటున్నానని పేర్కొన్నారు. దేశవ్యాప్త జీఎస్టీ సరళిని పరిశీలించేందుకు వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీ శుక్రవారం ఢిల్లీలో భేటీ అయింది. ఈ సమావేశానికి పయ్యావుల అనంతపురం కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. తమ రాష్ట్రంలో జీఎస్టీ వసూలు, పన్ను ఎగవేతదారులపై చర్యలు, తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

కోర్టు నిర్ణయం మేరకు చర్యలు

- విదేశాల్లో వైద్య విద్యనభ్యసించిన విద్యార్థుల ఆందోళనపై ఎంసీ స్పందన

విజయవాడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి ఇంటర్న్‌షిప్ విషయంలో ఆందోళన చేస్తున్న విద్యార్థుల సమస్యపై హైకోర్టు తీర్పును బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని మెడికల్ కౌన్సిల్ చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు వెల్లడించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో మీడియాతో శుక్రవారం మాట్లాడారు. 'ప్రస్తుతం ఆందోళన చేస్తున్న విద్యార్థులు విదేశాల్లో వైద్య విద్య చదువుకుని కొవిడ్ సమయంలో ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేశారు. ఇక్కడే ఉండి ఆన్‌లైన్‌లో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి రెండేళ్లు, చదువుకున్న దేశంలో ఇంటర్న్‌షిప్ చేసిన వారికి ఏడాది సమయం జాతీయ మెడికల్ కౌన్సిల్ ఇచ్చింది. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు పెండింగ్‌లో ఉంది. జాతీయ మెడికల్ కౌన్సిల్, హైకోర్టు ఇచ్చే తీర్పు మేరకు విద్యార్థుల సమస్యకు పరిష్కార మార్గాలను యోచిస్తాం' అని దగ్గుమాటి తెలిపారు.

పశువైద్యశాలల్లో ఉచితంగా ఏఆర్‌వీ వ్యాక్సిన్లు

- రేపు రాష్ట్రవ్యాప్తంగా జూనోసిస్ డే సదస్సులు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా సందర్భంగా ఈ నెల 6న జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు పశుసంవర్థక శాఖ డైరెక్టర్ దామోదర్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని పశు వైద్యశాలు, ఏరియా వెటర్నరీ హాస్పటల్స్, వెటర్నరీ పాలిక్లినిక్‌లు, వెటర్నరీ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్స్‌లో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) వేయనున్నట్లు చెప్పారు.

పోలవరం, బనకచర్లను అడ్డుకునేవారు సీమ ద్రోహులు

- జగన్ అండ్ కోకు దీనిపై మాట్లాడే హక్కు లేదు: కాలవ

రాయదుర్గం, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్వార్థ ప్రయోజనాల కోసం సీమ భవిష్యత్తును వైసీపీ నాయకులు నాశనం చేశారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్టు గురించి ప్రశ్నించే హక్కు ఆ పార్టీకి లేదన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో శుక్రవారం ఆయన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీమ సాగునీటి హక్కులను వివాదాస్పదం చేస్తూ, జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో జగన్మోహన్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భారీ ఎత్తున పెనాల్టీ వేయించుకున్నారని దుయ్యబట్టారు.

శ్రీవారి సేవలో జస్టిస్ అరవింద్ కుమార్



తిరుమల ఆలయం ముందు జస్టిస్ అరవింద్ కుమార్

తిరుమల, జూలై 4(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్ శుక్రవారం వేకువజామున అభిషేక సేవలో పాల్గొని తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డుప్రసాదాలు అందజేశారు. న్యాయమూర్తితో పాటు బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ ఉన్నారు.

బదిలీల్లో బంతాట..!

వాణిజ్య పన్నుల శాఖలో ఇష్టారాజ్యం.. సీఎం ఆదేశాలకూ వక్ర భాష్యం

- ఉద్యోగుల బదిలీలకు మార్కుల విధానం
- అస్మదీయులకు ఎక్కువ మార్కులు
- కావాల్సిన చోట పోస్టింగ్‌లకు రెడీ
- ఉన్నతాధికారుల తీరుపై తీవ్ర విమర్శలు
- కోర్టును ఆశ్రయించే దిశగా ఉద్యోగులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దండి. ఆదాయాన్ని పెంచుకునేందుకు కీలకమైన విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే అధికారులను నియమించండి. సరైన వ్యక్తులు సరైన చోట ఉంటేనే మెరుగైన ఫలితాలు సాధించగలుగుతాం. దీనిపై కసరత్తు చేయండి'.. ఇటీవల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన దిశానిర్దేశమిది. అయితే.. వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారుల తీరే వేరు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడంపై దృష్టి పెట్టకపోగా, మరింత అసంబద్ధ విధానాలను అమలు చేస్తున్నారు. 'ప్రతిభ' అన్న మాటనే పక్కన పెట్టేశారు. బదిలీలు, పోస్టింగ్‌ల ప్రక్రియలో పారదర్శకతకు తావు లేకుండా చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 'మార్కులు' విధానం ప్రవేశపెట్టి అస్మదీయులకు మేళ్లు చేయడానికి సిద్ధమవుతున్నారు. మొత్తానికి ముఖ్యమంత్రి ఆదేశాలకు సైతం వక్ర భాష్యం చెబుతున్నారు. ఉన్నతాధికారుల తీరుపై వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులే అంతర్గతంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

అసంబద్ధ మార్గదర్శకాలు

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ గత నెల 2వ తేదీతోనే ముగిసింది. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చిపెట్టే వాణిజ్య పన్నుల శాఖ పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. సొంత మార్గదర్శకాలతో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియను సజావుగా పూర్తి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. దాంతో తొలుత జూన్ 30లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తామంటూ మార్గదర్శకాలు జారీ చేసిన ఉన్నతాధికారులు.. తర్వాత శుక్రవారం వరకు గడువు పొడిగించారు. పనితీరు ఆధారంగా మార్కులు వేసి బదిలీలు చేస్తామంటున్నారు. అయితే మార్కులు వేసే విధానం శాస్త్రీయంగా లేదని, ఉద్యోగులందరికీ సమన్యాయం పాటించకుండా ఇష్టానుసారంగా బదిలీలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో ఒకేచోట 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారికి తప్పనిసరి బదిలీలు, మిగిలినవారికి అభ్యర్థనల మేరకు బదిలీలు నిర్వహిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖలో మాత్రం లోపభూయిష్ట విధానాలతో ప్రతి ఏటా దాదాపు అందరికీ బదిలీలు చేస్తున్నారని ఉద్యోగులు మండిపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంస్కరణల పేరిట 2022, 2023, 2024ల్లో నిర్వహించిన బదిలీలు వివాదాస్పదంగా మారాయి. ఈ ఏడాదైనా నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహిస్తారనుకుంటే.. అందుకు విరుద్ధంగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. 'పరిపాలనా సౌలభ్యం-ఉద్యోగుల శ్రేయస్సు'ను సమతుల్యం చేసుకుంటూ బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంటే.. వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు మాత్రం తమకు అనుకూలంగా ఉండేవారికి ఎక్కువ మార్కులు వేసి, కావలసిన చోట పోస్టింగ్‌లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. బదిలీల ప్రక్రియలో ఒంటెద్దు పోకడలు పోతున్న ఉన్నతాధికారుల తీరును తీవ్రంగా తప్పుబడుతూ ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ గవర్నమెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ చీఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. తమ అభ్యంతరాలను సీసీఎస్టీ దృష్టికి తీసుకువచ్చారు. అయినా ఉన్నతాధికారుల నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించేందుకు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వంలో వాణిజ్య పన్నుల శాఖ పునర్విభజన పేరుతో ఇష్టమొచ్చినట్టుగా సర్కిళ్లను, ఉద్యోగులను తగ్గించేసి, దొడ్డి దారిలో దొంగ వ్యాపారాలు చేసేవారికి రాచబాట పరిచిన ఉన్నతాధికారులే ఈ ప్రభుత్వంలో కూడా చక్రం తిప్పుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ అంశాలపై దృష్టి సారించి వాణిజ్య పన్నుల శాఖలో కొనసాగుతున్న తప్పుడు విధానాలను సరిదిద్ది, కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులకు న్యాయం చేయాలని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

చీఫ్ కమిషనర్‌పై పల్లాకు ఫిర్యాదు

బదిలీల విషయంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ అహ్మద్‌బాబు వ్యవహరిస్తున్నారని ఆ శాఖ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఏపీఎన్‌జీజీవో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు నేతృత్వంలో సుమారు 30 మందితో కూడిన ప్రతినిధి బృందం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసింది. బదిలీల ప్రక్రియలో కిందిస్థాయి అధికారులు, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఫిర్యాదు చేశారు. స్పందించిన పల్లా శ్రీనివాసరావు వెంటనే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంలో చీఫ్ కమిషనర్ తన మాట కూడా వినడం లేదని మంత్రి నిస్సహాయత వ్యక్తం చేసినట్టు తెలిసింది. దాంతో పల్లా శ్రీనివాసరావు వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ సెక్రటరీ అహ్మద్‌బాబుతోనే ఫోన్‌లో మాట్లాడి బదిలీల విషయంలో ఉద్యోగుల అభ్యంతరాలను ఆయనకు వివరించారు. ఒకే స్థానంలో ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులు, ఉద్యోగులను బదిలీ చేస్తున్నామని చెప్పినట్లు తెలిసింది.



స్మార్ట్ మీటర్లు వద్దంటూ మెడలో ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

పవర్ జోలికొస్తే... పవర్ పోతుంది

- అదానీకి, మోదీకి దాసోహమైన చంద్రబాబు, పవన్, జగన్ : సీపీఎం

విజయవాడ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాడు పవర్(విద్యుత్) జోలికి వచ్చి.. పవర్(అధికారం) కోల్పోయిన చంద్రబాబు ఇప్పటికైనా ఆ విషయాన్ని గుర్తుంచుకుని పవర్(విద్యుత్) జోలికి రాకుండా ఉంటే మంచిదని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. ఏపీసీపీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం కార్యకర్తలు స్మార్ట్‌మీటర్లు వద్దంటూ మెడలో ప్లకార్డులు ధరించి ఆందోళన చేశారు. బాబూరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే విద్యుత్ విషయంలో మాట తప్పి ప్రజలకు నమ్మక ద్రోహం చేసిందన్నారు. తొలి అడుగులోనే తప్పటడుగులు వేసి ప్రజలను ముంచిందన్నారు. విద్యుత్ బాదుడు ఉండదని హామీ ఇచ్చి రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల భారం వేయడం సరి కాదన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లు పగులగొట్టాలని పిలుపునిచ్చిన కూటమి నేతలే నేడు మీటర్లు బిగించాలని ఆదేశాలు ఇవ్వడం వెనకున్న అంతర్యమేంటో చెప్పాలని ప్రశ్నించారు. రూ.1,750 కోట్లు గత ప్రభుత్వానికి ముడుపులు ఇచ్చి అదానీతో చేసుకున్న ఏడు వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని కూటమి సర్కార్ కొనసాగిస్తూ ఆ పాపంలో వాటా పంచుకుంటోందని తీవ్ర ఆరోపణలు చేశారు.

వైసీపీ చెర నుంచి బి.తాండ్రపాడు చెరువుకు విముక్తి

- ఆక్రమణలు తొలగించాలని నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ తీర్పు

కర్నూలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైన కర్నూలు నగర శివారులోని బి.తాండ్రపాడు (గంగమ్మ) చెరువులో ఆక్రమణలను తొలగించాలని జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. కర్నూలు-చిత్తూరు ప్రధాన రహదారి పక్కనే బి.తాండ్రపాడు గ్రామంలో 53.86 ఎకరాల విస్తీర్ణంలో గంగమ్మ చెరువు ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు చెరువులో దాదాపు 12 ఎకరాలు ఆక్రమించారు. దీనిపై టీడీపీ యువనాయకుడు, మాజీ ఎంపీపీ డి.రాజవర్ధన్‌రెడ్డి 2021లో చెన్నైలోని జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. విచారణ సమయంలో ఆయన మరణించడంతో ఆయన తండ్రి కేడీసీసీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి కేసు కొనసాగించారు. సుదీర్ఘ పోరాటం ఫలించి గంగమ్మ చెరువులో ఆక్రమణలను తొలగించాలని శుక్రవారం ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిందని విష్ణువర్ధన్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. కాగా.. వైసీపీ హయాంలో ఆక్రమణకు గురైన గంగమ్మ చెరువును ప్రతిపక్ష నేత హోదాలో టీడీపీ అధినేత చంద్రబాబు పరిశీలించారు. వైసీపీ అండతో సాగించిన ఆక్రమణలపై ఆనాడు గళమెత్తారు.

కేఐహెచ్‌టీకి వైద్య పరికరాల తయారీ సంస్థల తనిఖీ అధికారం

- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు

విశాఖపట్నం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వైద్య పరికరాలు తయారుచేసే సంస్థల్ని తనిఖీ చేసే అధికారం (ఆడిటింగ్) విశాఖపట్నం మెడ్‌టెక్ జోన్‌లోని కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ టెక్నాలజీ (కేఐహెచ్‌టీ)కి అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రాష్ట్రాల్లో ఏ, బీ తరహా వైద్య పరికరాలు తయారుచేసే సంస్థలను ఆడిటింగ్ చేసే అధికారం పొందిన మొదటి సంస్థ ఇదే కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా 14 సంస్థలు ఉండగా అందులో ఇది కూడా ఒకటి.

పరిశ్రమల్లో భద్రతపై థర్డ్‌పార్టీ ఆడిట్ | అగ్నిమాపక శాఖ ఆదేశం

విజయవాడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా పరీక్షలు చేయించుకోవాలని అగ్నిమాపక శాఖ యాజమాన్యాలను ఆదేశించింది. దీనికి సంబంధించిన వివరాలను ఆ శాఖ డీజీ మాదిరెడ్డి ప్రతాప్ శుక్రవారం వెల్లడించారు. తెలంగాణలోని పాశమైలారంలో సిగాచి ఫార్మా కంపెనీలో ప్రమాదం నేపథ్యంలో ఈ ఆదేశాలు ఇచ్చామన్నారు. అగ్నిమాపక శాఖ వద్ద తగిన నిపుణులు లేకపోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు థర్డ్ పార్టీలను నియమించుకుని భద్రతా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అగ్నిమాపక శాఖకు సెల్ఫ్ అఫిడవిట్ ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతి పరిశ్రమలోనూ డస్ట్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, ప్రతి విభాగంలో సేఫ్టీ ఆడిట్ క్షుణ్ణంగా చేయాలని స్పష్టంచేశారు. భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యంతోపాటు సేఫ్టీ ఆడిట్ చేసిన థర్డ్ పార్టీని కూడా ప్రాసిక్యూషన్ చేస్తామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కుబేరుల బిల్లు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కలల బిల్లు ఉభయసభల ఆమోదాన్నీ సాధించింది. సెనేట్‌లో ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ కీలక ఓటుతో గట్టెక్కిన 'ఒన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్', ప్రతినిధుల సభలో నాలుగు అనుకూల ఓట్లు అదనంగా సాధించింది. బిల్లును వ్యతిరేకిస్తూ హాకీం జెఫ్రీస్ లాంటివారు గంటలకొద్దీ ప్రసంగాలు దంచినా, అనవసరపు జాప్యం తప్ప, అంతిమంగా ట్రంప్ కోరుకున్నదే జరిగింది. ఏదో వ్యతిరేకించాలి కదా అన్నట్టుగా డెమోక్రాట్లు వ్యవహరించారే తప్ప, ఈ బిల్లు ఎంత వివక్షాపూరితమైనదో, ప్రజావ్యతిరేకమైనదో తెలియచెప్పే ప్రయత్నం వారు చేయలేదనీ, నిరసనలు ర్యాలీలతో ప్రజాక్షేత్రంలో ఆ పనిచేసివుంటే రిపబ్లికన్లమీద మరింత ఒత్తిడి పెరిగేదని సామ్యవాదులు సణుగుతున్నారు. పైకి శత్రువుల్లాగా కనిపిస్తారు తప్ప ధనికులకు మేలు చేకూర్చే విషయంలో ఈ రెండుపార్టీల మధ్యా పెద్ద తేడా కనిపించదు.

అమెరికా భవిష్యత్తును తీవ్రంగా ప్రభావితం చేయబోతున్న ఈ బిల్లులోని మంచిచెడులు, పేద, మధ్యతరగతికి ఒనగూరే అపారనష్టం ఇత్యాదివి వెనక్కుపోయి, పార్టీల పరంగానే ఓటింగ్ జరగడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఓ ఇద్దరు తప్ప, బిల్లును గట్టిగా వ్యతిరేకిస్తారనుకున్న కొందరు రిపబ్లికన్లు ఆఖరునిముషంలో ట్రంప్‌కే జై కొట్టారు. బిల్లు సెనేట్ ఆమోదం పొందిన తరువాత కూడా ఆరోగ్యపథకాల్లో కోతలు మరీ హెచ్చుగా ఉన్నాయంటూ అభ్యంతరాలు పెడుతూవచ్చినవారు కూడా ట్రంప్ ప్రత్యక్ష హెచ్చరికలకు, ఆయన అభిమానుల ఆన్‌లైన్ బెదిరింపులకు దిగిరాకతప్పలేదని మీడియా అంటోంది. ఓటింగ్‌కు ముందు ప్రతినిధుల సభ స్పీకర్ తన ప్రసంగంలో కమ్యూనిస్టులను తిట్టిపోసి, భగవంతుడిపట్ల విశ్వాసాన్ని గుర్తుచేసి తనవంతు పాత్ర ప్రశస్తంగా పోషించారు. ఒకప్పటి ఆప్తమిత్రుడు, తన విజయసారథి ఎలాన్ మస్క్‌నే ఈ బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడితే దేశంనుంచి గెంటేస్తానన్న ట్రంప్ తన పార్టీవారినంతా ఏకతాటిమీద నడిపించగలిగారు.

వెయ్యిపేజీల ఈ బిగ్ బిల్లును ఎంతమంది ప్రజాసేవకులు పూర్తిగా చదివారో తెలియదు కానీ, అమెరికా చరిత్రలోనే అంతపెద్ద బిల్లుమీద సంతకం చేస్తున్నందుకు ట్రంప్‌మాత్రం తెగముచ్చటపడిపోతున్నారు. అమెరికా పుట్టి 250సంవత్సరాలయిన సందర్భంలోనే ఈ బ్యూటిఫుల్ బిల్లు ఆమోదం పొందడం శుభసూచకమని, ఇక దేశానికి తిరుగు ఉండదనీ, తన ఏలుబడిలో ఆర్థికంగా బలపడుతున్న అమెరికా ఇక రాకెట్ లాగా దూసుకుపోతుందని చెప్పుకొస్తున్నారు. తాను తిరిగి అధికారంలోకి రావడానికి భారీ విరాళాలతో తనకూ పార్టీకీ సహకరించిన తోటి కుబేరులను మూడు ట్రిలియన్ డాలర్ల పన్ను మినహాయింపులతో అతి భారీగా ఆదుకుంటున్నందుకు తెగమురిసిపోతున్నారు. అమెరికా సమాజంలో ఎగువ ఇరవైశాతంమీద తన ఈ ఖరీదైన ప్రేమకారణంగా దేశఖజానాకు వచ్చిపడిన లోటు పూడ్చడానికి అట్టడుగు ఇరవైశాతాన్ని శిక్షిస్తున్నాడాయన. వారికి అందాల్సిన వైద్యానికీ, ఆహారానికీ ట్రిలియన్ డాలర్ల కోతపెడుతున్నారు. ప్రవాసులు పంపే సొమ్ముమీద పన్ను విధించారు. ఒకపక్క స్వయంగా తానే యుద్ధాలు చేస్తూ, మరోపక్క నోబెల్‌శాంతి కోసం అర్రులు చాస్తున్న అమెరికా అధ్యక్షుడు ఈ బిల్లుద్వారా అదనంగా మూడువందల బిలియన్ డాలర్లు సమకూర్చుకొని, ఆయుధాలమీదా, అంతర్గత భద్రతను పరిరక్షించే పేరిట ఉద్యమాల అణచివేతమీదా ఖర్చు చేస్తారు. కూలిపనులు చేసుకోవడానికి వచ్చే వలస కార్మికులను అడ్డుకోవడానికీ, లోపలివారిని బయటకు గెంటేయడానికీ వాడతారు. ఈ 'ఏలియన్స్' ఏరివేతకు వీలుగా సమస్త వ్యవస్థలనూ ఆధునికీకరిస్తారు. కార్మికులకంటే, ఉద్యోగులకంటే కార్పొరేట్ సంస్థలు తక్కువ పన్ను చెల్లించే అమెరికాను చూడాలనుకుంటున్నారు ట్రంప్.

ఘనమైన అమెరికాను గతపాలకులు ముంచేశారని, విదేశాలతో సుంకాలయుద్ధాలనుంచి, స్వదేశంలో ఉద్యోగాల పీకివేతవరకూ తాను చేస్తున్నందంతా దేశాన్ని తిరిగి ఉన్నతంగా నిలబెట్టేందుకేనని ట్రంప్ చెప్పుకుంటారు. అమెరికా అప్పునీ, లోటునీ బూచిగా చూపి, ఖర్చు తగ్గించే పేరిట ఉపాధికీ, సంక్షేమానికీ ఎసరుపెడుతూ వచ్చారు. శుద్ధ దండుగ, వృథా అంటూ తనకు గిట్టని అనేక పథకాలు, కార్యక్రమాలు నిలిపివేసి, విదేశీసాయాలకు కోతవిధించాడు. ఎలాన్‌మస్క్‌ను అదేపని మీద నియమించి, అనంతరం తనకు అడ్డుతగులుతున్నందుకు ఆయననూ గెంటేశారు. సంక్షేమానికి కోత విధించి, ధనికులకు మేతవేసి, రక్షణరంగ బడ్జెట్‌ను ట్రిలియన్ డాలర్లకు పెంచి, దేశాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టేసే డర్టీ బిల్ ఇది.

'సంఘ్' సంకల్పం సాకారమయ్యేనా?

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మనోరథం నెరవేరలేదు. అయితే అది తన లక్ష్య సాధనలో వెనకడుగు వేయడం లేదు. ఒక హిందూ రాష్ట్ర (హిందూ రాజ్యం)ను నెలకొల్పాలనేది దాని ధ్యేయం. పవిత్ర రోమన్ సామ్రాజ్యం (క్రీ.శ.800–1800), ఇస్లామిక్ ఖలీఫా (క్రీ.శ. 632–1258) స్ఫూర్తితో హిందూ రాష్ట్ర భావన రూపుదిద్దుకున్నది. ఈ దేశ పాలన హిందూ ధర్మ గ్రంథాల ప్రకారం ఉండాలని ఆ భావన నిర్దేశిస్తుంది. వంద సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు భారత్‌ను హిందూ రాజ్యంగా పునః స్థాపించడం ఒక పరమ లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో సంఘ్ అప్పుడప్పుడూ వెనక్కు తగ్గినట్టు కనిపించినప్పటికీ దాని నిర్ణయం మారలేదు. హిందూ రాజ్య సంస్థాపనే దాని దృఢ సంకల్పం. సంకల్ప సాధనకు సరైన సమయం కోసం వేచి ఉన్నది. సంఘ్ హిందూ రాష్ట్ర భావనకు అనేక ఉప లక్ష్యాలు ఉన్నాయి. అవి: రాజ్యాంగ అధికరణ 370 రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణం, వారణాసి, మథుర మొదలైన పవిత్ర ప్రదేశాలపై హిందువులకు సంపూర్ణ హక్కు; బాబాసాహెబ్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి ప్రాతిపదికగా ఉండే రాజ్యాంగాన్ని తీసుకురావడం మొదలైనవి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆధునిక జాతి–రాజ్యం (నేషన్–స్టేట్)కు పునాది పౌరసత్వ భావన హిందూ జాతి లేదా రాజ్యంకు మూల స్తంభం హిందూ మతం. 'గురూజీ'గా సంస్మృతుడవుతున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ద్వితీయ సర్ సంఘ్‌చాలక్ (1940–73) ఎమ్ఎస్ గోల్వాల్కర్ తన పుస్తకం 'We, or Our Nationhood Defined'లో ఇలా రాశారు: 'హిందుస్థాన్‌లోని విదేశీ జాతులవారు అందరూ విధిగా హిందూ సంస్కృతిని అనుసరించాలి, హిందూ మతాన్ని గౌరవించాలి. హిందూ జాతి సంస్కృతిని మినహా మరే జాతి, సంస్కృతిని ఎట్టి పరిస్థితులలోను కీర్తించకూడదు. ప్రతి విదేశీ జాతి తన ప్రత్యేక అస్తిత్వాన్ని త్యజించి హిందూ జాతిలో సంలీనమవ్వాలి. హిందూ మతస్తులకు విధేయంగా ఉండి తీరాలి. దేనిపైన ఎలాంటి హక్కులు కోరకూడదు. విదేశీ జాతులవారు ఈ దేశంలో ప్రత్యేక అధికారాలు, సదుపాయాలకు అనర్హులు. పౌర హక్కులతో సహా ఏ విషయంలోనూ ప్రాధాన్యాన్ని ఆశించకూడదు, ఇవ్వడం జరగదు'.

సంఘీయులకు గోల్వాల్కర్ పరమ పూజనీయుడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆలోచనా స్రవంతికి ఆయనే గంగోత్రి. హిందూ రాష్ట్ర విషయమై ఆరెస్సెస్ తన భావాలు, దృక్పథాన్ని మార్చుకున్నదని అనేందుకు ఎటువంటి సాక్ష్యాధారాలు లేవు. 'జాతీయ పౌర పట్టిక' (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ – ఎన్ఆర్‌సీ), 'పౌరసత్వ (సవరణ) చట్టం' (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ ఆక్ట్ – సీఏఏ)ను సంఘ్ ఘంటాపథంగా సమర్థించింది, సంపూర్ణ మద్దతునిచ్చింది. 'చట్టవిరుద్ధ' వలసకారులను (ముఖ్యంగా బంగ్లాదేశీయులు, రోహింజ్యాలు) దేశం నుంచి బహిష్కరించేందుకు లేదా బలవంతంగా వారి వారి స్వదేశాలకు పంపించివేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఆరెస్సెస్ మద్దతునిస్తోంది (జాతీయ పౌర పట్టిక అమలును ప్రభుత్వం నిలిపివేసింది. ఆ చట్టం ఉద్దేశించని ఫలితాలకు – వేలాది హిందువులను పౌరులు కాని వారుగా గుర్తింపవలసిరావడం– కారణమవడంతో ఆ ప్రక్రియను ఆపివేసింది).

2019లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రెండో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెన్వెంటనే జమ్మూ–కశ్మీర్ రాష్ట్రానికి భారత రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేశారు. ఆ ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370ను ఉపసంహరించేందుకు అదే అధికరణలోని 370(1), (d), (3) సెక్షన్లను ఉపయోగించుకున్నారు. మృదువుగా చెప్పాలంటే ఇది చాలా విడ్డూరమైన విషయం, విపరీతమైన చర్య. దీని రాజ్యాంగబద్ధత సందేహాస్పదమైనది. రాజ్యాంగ సవరణకు అధికరణ 368 నిర్దేశించిన పద్ధతిని అనుసరించకుండా చేసిన సవరణ రాజ్యాంగ విరుద్ధమైనదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే అధికరణ 370(1), (d) కింద రాజ్యాంగ నిబంధనలు అన్నిటినీ జమ్మూ–కశ్మీర్‌కు వర్తింపచేసేందుకు రాష్ట్రపతి తన అధికారాలను ఉపయోగించడం అధికరణ 370 రద్దుతో సమానమని సుప్రీంకోర్టు సమర్థించింది. తద్వారా మోదీ ప్రభుత్వానికి ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడకుండా సర్వోన్నత న్యాయస్థానం నివారించగలిగింది. అయితే అనేక ముఖ్య ప్రశ్నలకు సుప్రీంకోర్టు తీర్పులో సమాధానాలు లేవు. దీంతో అధికరణ 370 రద్దుకు సంబంధించిన చట్టపరమైన సమస్యలో ఓడిపోయినప్పటికీ కశ్మీర్ విషయంలో ఏ ప్రభుత్వమూ తీసుకోలేకపోయిన సాహసోపేత నిర్ణయం తాము విజయవంతంగా తీసుకోగలిగామని మోదీ ప్రభుత్వం చెప్పుకోగలిగింది.

తన పదేళ్ల పాలన దేశాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి పరిచిందని, అమృత్ కాల్ (స్వర్ణయుగం)లోకి దేశం ప్రవేశించిందనే నిండు విశ్వాసంతో 2024 లోక్‌సభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీకి 400 స్థానాలను గెలుచుకోవడాన్ని ప్రధాని మోదీ లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఎట్టి పరిస్థితులలోను 400 స్థానాలను గెలుచుకుంటామని ఆయన స్పష్టంగా పదే పదే ప్రకటించారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి భాగస్వామ్య పార్టీలు మొక్కవోని దీక్షతో 'రాజ్యాంగాన్ని సంరక్షించాలి' అన్న నినాదంతో ఆ ఎన్నికల పోరులో మోదీ పార్టీని ఢీకొన్నాయి. 'ఇండియా' కూటమి నినాదం బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఓటు వేస్తున్న ఓటర్లను కూడా బాగా ప్రభావితం చేసింది. ఫలితంగా ఆ ఓటర్లు గణనీయమైన సంఖ్యలో 'ఇండియా' కూటమికి ఓటు వేశారు. దీంతో భారతీయ జనతా పార్టీకి లభించిన సీట్ల సంఖ్య 240కి పరిమితమయింది. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మెజారిటీని మోదీ సాధించలేకపోయారు. దీంతో రాజ్యాంగానికి తాము సంకల్పించిన రీతిలో సవరణలు చేసేందుకు మోదీ ప్రభుత్వానికి స్పష్టమైన అవరోధాలు నెలకొన్నాయి. మోదీ సర్కార్ ఇప్పటి వరకు ఆ అవరోధాలను అధిగమించలేకపోయింది.



> రాజ్యాంగ ప్రవేశికలోని 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలను తొలగించాలన్న హోసబలె డిమాండ్‌కు ఎలాంటి రాజ్యాంగ సూత్రం కాని, సామాజిక అవసరం కానీ ఆధారం కానేకాదు. మతతత్వశక్తులు రగిలించిన మంటలకు ఆజ్యం పోయడమే ఆ డిమాండ్ లక్ష్యం. తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యు), అన్నాడీఎంకే, మొదలైన రాజకీయ పక్షాలు ఆరెస్సెస్ / బీజేపీకి మద్దతు నివ్వడం తమ ప్రధాన ఆశయాలకు నమ్మక ద్రోహం చేయడమే అవుతుంది. తమకు తప్పక విజయం లభించే ఒక పెద్ద పోరాటానికి 'ఇండియా' సంసిద్ధమవ్వాలి.

ఈ ప్రతికూల పరిస్థితులు ఏవీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను నిరుత్సాహపరచలేదు. తన లక్ష్య సాధనకు అది తనదైన రీతిలో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగానే కుహనా ప్రజాస్వామిక భావన అయిన 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' (వన్ నేషన్–వన్ ఎలెక్షన్–ఓఎన్ఓఈ)ను అమలుపరిచేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందుకు ముందుగా నిర్ణయించిన ప్రకారం ఒక నివేదికను సంసిద్ధపరిచారు. దానిపై దేశ ప్రజల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునేందుకు ఒక సంయుక్త పార్లమెంటరీ సంఘం' (జేపీసీ) నేర్పాటు చేశారు. 'ఒకే దేశం –ఒకే ఎన్నిక'కు సంబంధించిన బిల్లులకు పార్లమెంటు ఆమోదం పొందగలిగే దాకా ఆ జేపీసీ దేశ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూనే ఉంటుంది.

హిందూరాష్ట్ర లక్ష్య సాధనకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ మరో అస్త్రాన్ని ప్రయోగించింది. రాజ్యాంగపీఠికలో ఎమర్జెన్సీ కాలంలో అదనంగా చేర్చిన 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలు రాజ్యాంగ విరుద్ధమైనవని, వాటిని రాజ్యాంగ ప్రవేశిక నుంచి తొలగించాలని సంఘ్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలె డిమాండ్ చేశారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఈ డిమాండ్‌ను తీవ్రంగా ఖండించాయి. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆ రెండు పదాలు 'నొప్పి సలుపుతున్న గాయాలు'గా వ్యాఖ్యానించడం ద్వారా హోసబలె డిమాండ్‌కు ఒక మద్దతు కల్పించారు. సంఘ్ ప్రధాన కార్యదర్శి డిమాండ్ తీవ్ర చర్చకు దారితీయగా రాజ్యాంగ పదవిలో ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ ఆ చర్చలో పాల్గొనడం పలువురిని విస్మయపరిచింది. అనేక అనుమానాలకు ఆస్కారమిచ్చింది.

రాజ్యాంగ మున్నుడిలో 'సెక్యులర్' అనే పదం ఉండడం చాలా అసంగత విషయంగా హిందూరాష్ట్ర మద్దతుదారులు భావిస్తున్నారు. అయితే అనేక భాషలతో, బహుమతాలతో, వైవిధ్య సంపన్న సంస్కృతులతో వర్ధిల్లుతున్న ఒక ప్రజాస్వామిక దేశం 'సెక్యులర్' సమాజం కాకుండా మరేమవుతుంది? ఫ్రెంచ్ పౌరులలో అత్యధికులు కేథలిక్ క్రైస్తవులు. అయినప్పటికీ వారు 'సెక్యులర్' ఆదర్శాలకు సంపూర్ణంగా నిబద్ధులు. సంఘ్‌కు ఆక్షేపణీయంగా ఉన్న మరో పదం 'సోషలిస్ట్'కు ఒక స్థిరమైన అర్థం లేదు. సంక్షేమ రాజ్య భావనను అభివర్ధించేందుకు ఆ పదాన్ని తరచు ఉపయోగిస్తుంటారు. భారత్ ఒక సంక్షేమ రాజ్యం అన్న సత్యాన్ని భారతీయ జనతా పార్టీ నిరాకరించలేదు. రాజ్యాంగ మున్నుడిలో 'సెక్యులర్', 'సోషలిస్ట్' అనే పదాలను అదనంగా చేర్చడం వల్ల రాజ్యాంగ మౌలిక నిర్మాణ ప్రాతిపదికను మార్చివేయలేదు. నిజానికి 'లౌకికవాదం' అనేది భారత రాజ్యాంగ మౌలిక లక్షణమని 1973లో సుప్రీంకోర్టు ఒక తీర్పులో స్పష్టం చేసింది 'సోషలిజం' ఆదర్శాలు ఆదేశిక సూత్రాల (అధికరణలు 36, 51)లో పరిపూర్ణంగా ప్రతిఫలించి ఉన్నాయని దేశ సర్వోన్నత న్యాయస్థానం 1980లో వెలువరించిన మరో తీర్పులో పేర్కొంది.

సంఘ్ ప్రధాన కార్యదర్శి హోసబలె డిమాండ్‌కు ఆధారమేమిటి? ఎలాంటి రాజ్యాంగ సూత్రంకాని, సామాజిక అవసరం కానీ కానేకాదు. మతతత్వశక్తులు రగిలించిన మంటలకు ఆజ్యం పోయడమే ఆ డిమాండ్ లక్ష్యం. తెలుగుదేశం పార్టీ, జనతాదళ్(యు), అన్నాడీఎంకే, ఎల్‌జేపీ, జనతాదళ్(ఎస్) మొదలైన రాజకీయ పక్షాలు ఆరెస్సెస్ / బీజేపీకి మద్దతునివ్వడం తమ ప్రధాన ఆశయాలకు నమ్మకద్రోహం చేయడమే అవుతుంది. 'ఇండియా' కూటమి పక్షాలు ఒక పెద్ద పోరాటానికి సంసిద్ధమవ్వాలి. ఆ పోరులో అవి తప్పక విజయం సాధిస్తాయి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

ఈదుమూడిలో వర్గీకరణ విజయోత్సవం

ఈ ఏడాది ఉభయ తెలుగు రాష్ట్రాలలో, దేశంలోనూ కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాలు జరిగాయి. ఈ ఏడాదికి వర్గీకరణ నామ సంవత్సరంగా ప్రాధాన్యం ఉంది. అంతేకాదు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, ఈదుమూడి గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) స్థాపితమై ఈ నెల ఏడో తేదీకి ముప్పై ఒక్క సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌లోని వివిధ గ్రూపులు, మాదిగ సంఘాలు, మాదిగ దండోరా ఉద్యమ సీనియర్ నాయకులు, కార్యకర్తలు జూలై ఏడున ఈదుమూడి గ్రామం వేదికగా జాతీయ స్థాయి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మహోత్సవాన్ని జరపాలని తలపెట్టారు. ఆ రోజు ఉదయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వర్గీకరణ ఉద్యమ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమాభిమానులు పెద్ద సంఖ్యలో ఈదుమూడి గ్రామానికి చేరుకోనున్నారు.



> వేలాది మాదిగ ఉద్యమ కార్యకర్తలు కనీ వినీ ఎరుగని స్థాయిలో దండోరా మహోద్యమాన్ని నిర్మించారు. దీనితో పౌర సమాజం మాదిగల న్యాయమైన ఉద్యమానికి సంఘీభావంగా నిలబడింది. సమాజంలోని ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, చివరికి అత్యున్నత న్యాయవ్యవస్థ కూడా మాదిగలకు న్యాయం చెయ్యాలని సంకల్పించాయి.

1994 జూలై ఏడో తేదీన ఎమ్మార్పీఎస్ ప్రారంభించిన నాడు, ఐదేళ్లలో రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ (వర్గీకరణ) సాధించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే, ప్రారంభించిన మూడేళ్లలోనే తన లక్ష్యాన్ని ఎమ్మార్పీఎస్ చేరుకున్నది. 1997 జూన్ ఆరో తేదీన హైదరాబాద్ అసెంబ్లీ దిగ్బంధనం సందర్భంగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 68, 69 జీవోలను విడుదల చేసింది. కాగా, జాతీయ ఎస్సీ కమిషన్‌ను సంప్రదించకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవోలు విడుదల చెయ్యడం... అధికరణం 338 ప్రకారం రాజ్యాంగ విరుద్ధమని, మాల కులస్తులలో వర్గీకరణ వ్యతిరేకులు కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ఈ జీవోలను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో నాటి చంద్రబాబు ప్రభుత్వం వర్గీకరణ పరిరక్షణ కొరకు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది.

అయితే, ఏక నాయకత్వం పేరుతో చెలామణిలోకి వచ్చిన మాదిగ నాయకుడు చేసిన డిమాండ్ మేరకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నది. ఆనాడు ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకునేలా ఏక నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఉండకపోతే– రాష్ట్రాలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరణ చేసి తీరాల్సిందేనని 2024 ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు విస్తృత రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన చరిత్రాత్మక తీర్పు... పాతికేళ్ల క్రితమే వచ్చి ఉండేది. దానివల్ల వర్గీకరణ సమస్య అప్పట్లోనే పరిష్కారమై ఉండేది. 'ఏక నాయకత్వం' ఏకపక్ష విధానాల వల్ల తదుపరి 25 ఏళ్లకు పైగా మాదిగ దండోరా ఉద్యమం సుదీర్ఘ సాగతీతకు లోనయ్యింది. కమ్యూనిటీకీ, అణగారిన కులాలు, జాతులకు ఈ లోగా అపార నష్టం జరిగిపోయింది.

అయినప్పటికీ, వేలాది మాదిగ ఉద్యమ కార్యకర్తలు, నాయకులు చదువులు, వృత్తులు, ఉద్యోగాలను, వారి ఆదాయ మార్గాలను, కుటుంబాలను వదిలిపెట్టి, ఎంతో పట్టుదలతో, దీక్షతో గ్రామాల్లోని ప్రతీ మాదిగ పల్లెకూ విద్య, ఉద్యోగ వర్గీకరణ హక్కుల సాధనా సందేశాన్ని తీసుకెళ్లారు. లక్షలాది మందిని కూడగట్టారు. కనీ వినీ ఎరుగని స్థాయిలో దండోరా మహోద్యమాన్ని నిర్మించారు. దీనితో పౌర సమాజం మాదిగల న్యాయమైన ఉద్యమానికి సంఘీభావంగా నిలబడింది. సమాజంలోని ప్రజాసంఘాలు, మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు చివరికి అత్యున్నత న్యాయవ్యవస్థ కూడా మాదిగలకు న్యాయం చెయ్యాలని సంకల్పించాయి. ఎట్టకేలకు సుదీర్ఘమైన ఉద్యమంతో, రాజ్యాంగ సంరక్షణల్లో తమ భాగస్వామ్య హక్కులను పొందే లక్ష్యాన్ని ఈ ఏడాది నెరవేర్చుకోగలిగారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సాధించుకున్న ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఆర్డినెన్సు, చట్టం, జీవోలు విద్య, ఉద్యోగ అవకాశాల ఆస్తి పంపక పత్రాలు. వీటి సాధన వెనుక, పది మంది కార్యకర్తల, నాయకుల ప్రాణత్యాగాలు ఉన్నాయి. వేలాది మంది కార్యకర్తలు, నాయకులు జైళ్ల పాలై, కేసుల పాలై, కుటుంబాలు ఛిద్రమై, ఆర్థికంగా దెబ్బతిని, అనారోగ్యాల పాలై, యవ్వనాలను త్యాగం చేసి, ఉద్యమించిన చరిత్ర ఉంది. ఎంతో సంతోషకరమైన, ఉద్వేగభరితమైన ఈ వర్గీకరణ విజయోత్సవ ఆత్మీయ కలయికకు రెండు రాష్ట్రాల నుంచి మాదిగ, మాదిగ అనుబంధ కులాల కార్యకర్తలు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో ఈదుమూడికి తరలి రావాలి. మాదిగ, మాదిగ అనుబంధ కులాల సమగ్ర అభివృద్ధికి, రాజ్యాధికార సాధన కోసం భవిష్యత్తులో జరిగే అన్ని కార్యక్రమాలలో సహకారంతో, సమన్వయంతో కలిసి ముందుకు సాగుదాం. ఈదుమూడిలో జూలై ఏడో తేదీన జరగనున్న 'ఎస్సీ వర్గీకరణ జాతీయ విజయోత్సవం' సందర్భంగా మాదిగ ఉద్యమానికి అండగా నిలిచిన, పౌర సమాజానికి, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు, రాజకీయ పార్టీలు, సుప్రీంకోర్టుకు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు.

● కృపాకర్ మాదిగ
వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి

'స్థానికత' కోసం మరొక్క అవకాశం కల్పించాలి

ఆంధ్ర–తెలంగాణ విభజన తర్వాత స్థానికత, ఉద్యోగాలు వంటి అనేక అంశాలకు సంబంధించి లక్షలాది విద్యార్థులు తెలంగాణ నుంచి ఏపీలోని తమ స్వస్థలాలకు తిరిగి వచ్చారు. 2014 జూన్ 2 నుంచి 2017 లోపు (మొదట ఆ గడువును ప్రభుత్వం 2017గా నిర్ణయించినా, తర్వాత 2024 వరకూ పొడిగించింది.) రాష్ట్రానికి తిరిగొచ్చిన విద్యార్థులను స్థానికులుగా పరిగణిస్తామని చెబుతూ, రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా ఏపీ ప్రభుత్వం జీవో నెం. 133ను తెచ్చింది. దీని ప్రకారం.. తిరిగొచ్చిన విద్యార్థులు ఏ జిల్లాలో స్థిరపడితే వారు ఆ జిల్లాలో స్థానికులుగా పరిగణించబడతారు.

2014 నుంచి 2024 వరకూ తెలంగాణ నుంచి ఏపీకి తిరిగి వచ్చినవారు విద్య, ఉద్యోగాలకు సంబంధించి 'స్థానికులు' అన్నది స్పష్టం. దీనిపై ప్రభుత్వం, అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ పదేళ్లలో అలా తిరిగొచ్చిన విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ వంటి అన్ని రకాల సర్టిఫికెట్లు జారీ చేశారు. అయితే ఆ విద్యార్థులు స్థానికులు అని తెలిపే 'లోకల్ స్టేటస్ సర్టిఫికెట్' మాత్రం కేవలం 1 జూన్, 2024లోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఇస్తామని జీవో గైడ్‌లైన్స్‌లో ఇచ్చారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఇంత ముఖ్యమైన విషయంపై అటు ప్రభుత్వం కానీ, ఇటు అధికారులు కానీ ఏ విధమైన ప్రచారమూ చేయలేదు.

ప్రస్తుతం డీఎస్సీ వంటి అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లకు సంబంధించి ఎంతో మంది విద్యార్థులు 'లోకల్ సర్టిఫికెట్' కోసం దరఖాస్తు చేసుకోగా, గడువు ముగిసిన కారణంగా ఆ సర్టిఫికెట్‌ను జారీ చేయలేమని మండల రెవిన్యూ అధికారులు సెలవిస్తున్నారు. ఇంతకాలం ఏ ఉద్యోగాలకూ దరఖాస్తు చేయనందునే 'లోకల్ స్టేటస్' సర్టిఫికెట్ తీసుకోలేదని, ఇప్పుడు ఆ సర్టిఫికెట్ జారీ చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుతం డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకున్నామని, లోకల్ సర్టిఫికెట్ లేకపోవడంతో తమకేం చేయాలో పాలుపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం గడువు తేదీపై ముందే అవగాహన కల్పించి ఉంటే తప్పక దరఖాస్తు చేసుకునే వారమని చెబుతున్నారు. ఈ సర్టిఫికెట్ లేకపోవడంతో తాము అటు తెలంగాణలోనూ, ఇటు ఆంధ్రాలోనూ లోకల్ కాకుండా పోయామని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో త్వరలో డీఎస్సీ నిర్వహించనున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి తమకు 'లోకల్ సర్టిఫికెట్' పొందేందుకు మరొక్క అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

– ఎస్‌కే జానీసైదా, గుంటూరు

సమస్యల సుడిలో సంపద సృష్టికర్తలు

ఇటీవల దూరదర్శన్ సందేశంలో ప్రధాని నరేంద్ర మోదీ తమ పదకొండేళ్ల పాలన శ్రామికుల సంక్షేమం చుట్టూ సాగిందని, ఉపాధి కల్పన, సాంఘిక సంక్షేమంలో గణనీయమైన వృద్ధి సాధించామని పేర్కొన్నారు. అదే సందర్భంలో కార్మికుల సాధికారత, సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కూడా తెలిపారు. కానీ వాస్తవమేమిటంటే మోదీ ప్రభుత్వ విధానాలు దీనికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయి.

వీరి విధానాల వల్ల పేదరికం ఎంతగా పెరిగిందంటే దేశంలో ఐదేళ్ల లోపు పిల్లలలో 36 శాతం మంది ఉండవలసిన దానికంటే తక్కువ బరువు ఉన్నారు. ఇది పౌష్టికాహార లోపానికి సూచిక. అలాగే 15–49 మధ్య వయసుగల మహిళలలో రక్తహీనత 2015–16లో 53 శాతం నుంచి 2019–20కి 57.2 శాతానికి పెరిగింది. ఇదే వయస్సు గర్భిణులలో రక్తహీనత 50.4 శాతం నుంచి 52.2 శాతానికి పెరిగింది. ఒక పరిశోధన ప్రకారం 2023–24లో గ్రామీణ భారతంలో 40 శాతం మంది రెండుపూటలా భోజనం కూడా తీసుకోలేకపోతున్నారు. ఈ గణాంకాలన్నీ దేశంలో పెరుగుతున్న పేదరికానికి చిహ్నాలు.

అదే సందర్భంలో దేశంలోని కార్పొరేట్ సంస్థల ఆదాయాలు మాత్రం ఎలాంటి హద్దూ లేకుండా పెరిగిపోతున్నాయి. సంపద కేంద్రీకృతమవుతోంది. ప్రభుత్వరంగ సంస్థలను, ప్రకృతి వనరులను మోదీ ప్రభుత్వం కారు చవకగా వీరికి ధారాదత్తం చేస్తోంది. ఫలితంగా దేశంలో శత కోటీశ్వరులు సంఖ్య 2014లో వంద నుంచి 2024 నాటికి రెండు వందలకు పెరిగింది. వంద మంది శత కోటీశ్వరుల ఆస్తి 85 లక్షల కోట్ల రూపాయలకు పైగా చేరింది. మోదీ ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు ఇది నిదర్శనం.

దేశంలో నేటి ఈ ఆర్థిక అసమానతలకు కారణం ప్రభుత్వ విధానాలే. ప్రభుత్వ పన్నుల విధానం క్రమేణా కార్పొరేట్ల నుంచి ప్రజలపై భారాలు వేసే దిశగా మారింది. మొత్తం రెవిన్యూ పన్ను ఆదాయంలో కార్పొరేట్ పన్ను వాటా 2014–15లో 34.5 శాతం ఉండగా, 2024–25 కల్లా అది 27.2 శాతానికి తగ్గిపోయింది. దీనికి తోడు ఈ పదకొండేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం 16.61 లక్షల కోట్ల రూపాయల కార్పొరేట్ సంస్థల బ్యాంకుల రుణాలను మాఫీ చేసింది.

ఇదే సమయంలో సంపద సృష్టికర్తలయిన శ్రామికుల కష్టాలు మరింతగా పెరిగాయి. సంఘటిత రంగంలో వేతన వృద్ధి ముందు ఐదేళ్లలో 10.1 శాతం ఉండగా, 2014–20 మధ్య ఆరు శాతానికి పడిపోయింది. ధరల పెరుగుదల వల్ల నిజ వేతనాలు పడిపోతున్నాయి. నికర జోడింపు విలువలో కార్మికుల వాటా 2020లో 18.9 శాతం నుంచి 2023 నాటికి 15.9 శాతానికి తగ్గిపోయింది. ఇదే కాలంలో కార్పొరేట్ల లాభాల వాటా 38.7 శాతం నుంచి 51.9 శాతానికి పెరిగింది.

కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 1.45 లక్షల కోట్ల రూపాయలను నష్టపోతోంది. దేశంలో ఎక్కడా కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనాల సవరణ కానీ, చెల్లింపు కానీ జరగడం లేదు. అందువల్ల ప్రధాని పేర్కొన్నట్లు ప్రభుత్వ విధానం కార్మికులకు కాకుండా, దానికి భిన్నంగా కార్పొరేట్లకు అనుకూలంగా మాత్రమే ఉంది. తమ విధానాలు ఇలా ఉండగా ప్రధాని వేరే విధంగా మాట్లాడడం సహేతుకం కాదు.

ప్రభుత్వం నిజంగా కార్మిక సంక్షేమానికి నిధులు రాబట్టాలంటే దానికి అనేక మార్గాలున్నాయి. ఒక మార్గం ప్రభుత్వ బ్యాంకులకు కార్పొరేట్ సంస్థలు బకాయిపడ్డ రుణాలను వసూలు చేయడం. ప్రభుత్వ బ్యాంకులు 4,10,758 కోట్ల రూపాయల బకాయి కోసం 16,420 నోటీసులు ఇచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఎగవేతదారులపై క్రిమినల్ కేసులు పెట్టి రుణాలు వసూలు చేయడానికి బదులు, ఆశ్చర్యకరంగా వాటిని ఒక్క కలం పోటుతో రద్దు చేసేసింది.



> కార్పొరేట్ పన్ను తగ్గింపు వల్ల కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 1.45 లక్షల కోట్ల రూపాయలను నష్టపోతోంది. దేశంలో ఎక్కడా కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనాల సవరణ కానీ, చెల్లింపు కానీ జరగడం లేదు. అందువల్ల ప్రధాని పేర్కొన్నట్లు ప్రభుత్వ విధానం కార్మికులకు కాకుండా, దానికి భిన్నంగా కార్పొరేట్లకు అనుకూలంగా మాత్రమే ఉంది.

కార్మికులపై ఈ ఆర్థిక భారాలు చాలవన్నట్లు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను హరించేలా మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను చేసింది. రోజుకు 8 పని గంటల స్థానంలో 12 గంటలు, అంతకంటే ఎక్కువ పని; సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కులు సహా అనేక అంశాలను సమూలంగా మార్చివేసింది. కార్మిక సంఘాల నుంచి వస్తున్న ప్రతిఘటనతో దేశవ్యాప్తంగా ఒకేసారి వీటి అమలుకు మోదీ ప్రభుత్వం సంశయిస్తున్నా, తమ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న వివిధ రాష్ట్రాలలో వీటి అమలు ఇప్పటికే ప్రారంభమయింది. వేతనాలు పెరగక పోవడం, పని గంటలు పెరగడం, హక్కులు కోల్పోవడం వంటి సుడిగుండంలో నేడు దేశంలోని శ్రామికులున్నారు.


మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అంటే ఈ పదకొండేళ్లలో 22 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించవలసి ఉంది. కానీ దీనికి భిన్నంగా ఉన్న ఉద్యోగాలే కోల్పోయే స్థితి ముఖ్యంగా నేడు దేశంలోని ప్రభుత్వ సంస్థల్లో నెలకొని ఉంది. కేంద్ర ప్రభుత్వ స్వంత నివేదికల ప్రకారమే ప్రభుత్వరంగ పరిశ్రమలలో ఉద్యోగుల సంఖ్య 2013లో 17.3 లక్షలు ఉండగా 2022 నాటికి ఈ సంఖ్య 14.6 లక్షలకు పడిపోయింది. అదే కాలంలో ఎటువంటి ఉద్యోగ భద్రత లేని కాంట్రాక్టు కార్మికుల సంఖ్య మాత్రం 19 శాతం నుంచి 42.5 శాతానికి పెరిగింది. ప్రభుత్వ బ్యాంకులలో 2014లో 8.5 లక్షల ఉద్యోగులు ఉండగా, 2023లో 7.5 లక్షల మందికి తగ్గిపోయారు.

ఈ విధానాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో ఉపాధి ప్రపంచంలోనే అతి తక్కువగా మన దేశంలోనే ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదిక ప్రకారం మన దేశంలో మొత్తం ఉద్యోగులలో ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు 3.8 శాతం ఉండగా, బ్రెజిల్‌లో 12.3 శాతం, అమెరికాలో 13.3 శాతం, అర్జెంటీనాలో 16.9 శాతం, బ్రిటన్‌లో 21.5 శాతం, చైనాలో 28 శాతం, రష్యాలో 40.6 శాతం, క్యూబాలో 77 శాతం ప్రభుత్వ సంస్థల ఉద్యోగులున్నారు. దీనివల్ల కార్మికుల ఆదాయాలు పడిపోవడమే కాకుండా, రిజర్వేషన్లు తగ్గి, సామాజిక న్యాయం కూడా దెబ్బతింటోంది. దేశం గరిష్ఠ స్థాయి నిరుద్యోగాన్ని ఎదుర్కొంటోంది. దీనివల్ల పుష్కలంగా ఉన్న యువ మానవ వనరులను సద్వినియోగం చేసుకునే స్థితి లేకపోవడం దేశ భవిష్యత్తుకు హానికరం. నాల్గవ పెద్ద ఆర్థిక వ్యవస్థ, విశ్వగురు అని ఎన్ని కితాబులు ఇచ్చుకున్నా, ఈ వాస్తవాలను కాదనలేం.

అందువల్ల మోదీ ప్రభుత్వ ఆర్భాట వాగ్దానాలు, అవాస్తవ ప్రకటనలే తప్ప, ఆచరణలో శ్రామికులు బ్రిటిష్ ఇండియాలో కూడా లేనంతగా ఆర్థిక అసమానతలు, భారాలను మోయాల్సి వస్తోంది. సంపద సృష్టికర్తలు సుఖంగా లేని ఏ సమాజమూ దీర్ఘకాలంలో సురక్షితంగా ఉండలేదు. దీనికి మన దేశం మినహాయింపేమీ కాదు. ఈ నేపథ్యంలోనే దేశంలోని రైతాంగ, వ్యవసాయ కార్మికవర్గ సమస్యలను కూడా ఎంతో బాధ్యతాయుతంగా జోడించి, జూలై 9న అఖిల భారత సమ్మెకు కార్మికవర్గం పూనుకుంది. ఇదో దేశభక్తియుత పోరాటం.

■ ఎ. అజశర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఆంధ్రజ్యోతి



గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 5 జూలై 2025



ఫణిదరం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

అమరావతి అభివృద్ధికి లక్ష ఎకరాలైన సరిపోవు

- ప్రభుత్వం వద్ద ఎంత ఎక్కువ భూమి ఉంటే అంత అభివృద్ధి సాధ్యం
- ల్యాండ్ పూలింగ్‌పై గ్రామసభల్లో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధికి లక్ష ఎకరాలైన సరిపోవని, ప్రభుత్వం వద్ద ఎంత ఎక్కువ భూమి ఉంటే అంత అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి శుక్రవారం తాడికొండ మండలం ఫణిదరం, దామరపల్లి, బండారుపల్లి గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సభల్లో రైతులు చెప్పే అభిప్రాయాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో ఉంచుతామన్నారు. 29 గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ చేసినప్పుడు ఇలానే గ్రామ సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్యాకేజ్ ఇచ్చామన్నారు. భూములు ఇచ్చిన రైతులకు సంవత్సరంలోనే ప్లాట్లు ఇస్తామన్నారు. ఈ సంవత్సరం నుంచే రైతులకు కౌలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఢిల్లీ, ముంబాయి వంటి నగరాలు కాలుష్యంతో నిండి జీవనానికి ఇబ్బందులు ఉన్నాయని ఆ పరిస్థితి అమరావతికి రాకూడదనే ఉద్దేశంతో గ్రీన్‌సిటీని నిర్మించడానికి వందలాది ఎకరాలు భూములు కావాలన్నారు. అమరావతి నగరం అభివృద్ధి చెందే కొద్దీ ప్రభుత్వానికి భూమి అవసరాలు పెరుగుతాయన్నారు. రాజధాని ప్రాంతంలో పరిశ్రమలు, విద్యా సంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల స్థాపనకు భూములు అవసరమవుతాయన్నారు. ఆయా సంస్థలకు భూములు కేటాయిస్తే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అవసరమైనప్పుడు నోటిఫై చేసి భూములు తీసుకుంటే రైతులు నష్టపోతారని, అలా జరగకుండా ఉండేందుకు ల్యాండ్ పూలింగ్‌కు ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. రెవెన్యూ సమస్యలు అన్నింటినీ పరిష్కరించిన తర్వాతే భూములను తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీవో సమతావాణి, టీడీపీ మండల అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, గుంటుపల్లి మధుసూధనరావు, సర్పంచ్‌లు కర్నాటి బాలకోటేశ్వరరావు, నల్లిబోయిన సరస్వతి, ముప్పాళ్ల మనోహర్ పాల్గొన్నారు.

3 జిల్లాలు.. లక్ష్యం

రూ. 550 కోట్లు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి ఈ ఏడాది కౌలు రైతులకు ఇవ్వాల్సిన వార్షిక రుణ పద్దును లీడ్‌బ్యాంక్ విడుదల చేసింది. ఈ ప్రకారం బాపట్ల జిల్లాలో రూ.200 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.170, పల్నాడు జిల్లాలో రూ.180 కోట్లను రుణాల రూపంలో అందించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో కొర్రీలు వేయడం తగదని, ఉదారంగా వ్యవహరించాలని వార్షిక రుణ పద్దు ప్రకటించే సమయంలోనే బ్యాంకర్లకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. వార్షిక పద్దు తెరపైకి రావడంతో బ్యాంకులు అందించే రుణాలపై ఆశలు పెట్టుకుని కౌలు రైతులు సేద్యానికి సన్నద్ధమవుతున్నారు. అయితే గతంలోలా బ్యాంకులు మాయ చేస్తాయా కనికరిస్తాయా చూడాలి.

కౌలు కనికరిస్తారా?

సీసీఆర్‌సీ జారీలో జాప్యం


కౌలు రైతుల గుర్తింపు కోసం ప్రభుత్వం జారీ చేసే సీసీఆర్‌సీ కార్డులకు సంబంధించి అధికారులు లక్ష్యాలు ఘనంగా ప్రకటిస్తున్నారు. తీరా మంజూరు దగ్గరకు వచ్చేసరికి చతికిలపడుతున్నారు. ఈ ఏడాది బాపట్ల జిల్లాలో లక్ష సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు అందించాలని వ్యవసాయ శాఖకు ప్రభుత్వం లక్ష్యం విధించింది. ఇప్పటికి 18,000 కార్డులను మాత్రమే పంపిణీ చేశారు. గుంటూరు జిల్లాలో 55 వేలు, పల్నాడు జిల్లాలో 68 వేల కార్డులు అందించాల్సి ఉండగా అంతులేని జాప్యం జరుగుతుంది.

- ఖరీఫ్ రుణ లక్ష్యాలు అధిగమిస్తారా
- బ్యాంకర్లపై ఆశతో సాగుకు కౌలు రైతులు
- నిర్దేశించిన గత రుణ లక్ష్యాలు చేరుకోని బ్యాంకులు
- వేలల్లో సీసీఆర్‌సీ కార్డులు.. రుణాలు అంతంతే
- బ్యాంకర్ల వార్షిక పద్దులో గత గణాంకాలన్నీ తీసికట్టు
- ఈ ఏడాదైనా కౌలు రైతులకు న్యాయం జరిగేనా

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వ్యవసాయ భూమి ఒకరిదైతే సాగు చేసేది కౌలురైతు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి సాగు చేసే కౌలు రైతుకు సహకారం ప్రకటనలకే పరిమితమవుతోంది. ప్రధానంగా రుణాల విషయంలో బ్యాంకుల నుంచి కౌలురైతులకు సహకారం అందడంలేదన్న విమర్శలున్నాయి. ఏటా ప్రభుత్వం ఘనంగా వార్షిక పద్దు ప్రకటిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో అది అమలు కావడం లేదు. ప్రభుత్వ ప్రకటన చూసి ఆశగా బ్యాంకులకు వెళ్లే కౌలు రైతులకు నిరాశే ఎదురవుతోంది. ఈ క్రమంలో ఈ ఏడాది బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు సంబంధించి వార్షికపద్దును ఇప్పటికే లీడ్ బ్యాంకు వర్గాలు విడుదల చేశాయి. రుణ లక్ష్యాల్లో 7 నుంచి పది శాతం వరకు కౌలు రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్‌లో అయినా న్యాయం జరుగుతుందని ఆశలు (మిగతా 8వ పేజీలో)





- సాగుకు సిద్ధం చేసిన పొలం

విప్లవ యోధుడు అల్లూరి

కలెక్టర్ నాగలక్ష్మి నివాళి



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన గొప్ప విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు అని కలెక్టర్ నాగలక్ష్మి కొనియాడారు. గురువారం స్థానిక నాజ్ సెంటర్ వద్ద అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది పోరాటం చేశారని, వీరిలో అల్లూరి సీతారామరాజు పాత్ర ప్రత్యేకమైనదన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని గిరిజన ప్రాంతాల్లో పాఠశాలను ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులకు మంచి విద్యను అందించేందుకు ముందుకు రావాలన్నారు. గిరిజన ప్రాంతాలు విద్య, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ మాట్లాడుతూ ఆదివాసీల ప్రాణ, మాన రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప మహనీయుడు అల్లూరి సీతారామరాజు అన్నారు. గిరిజన హక్కుల, వారి అభ్యున్నతి, పిల్లల చదువుల కోసం విదేశీ విద్య వంటి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి, స్టెప్ సీఈవో చంద్రముని, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి మురళి, జిల్లా టూరిజం అధికారి శ్రీరమ్య, తహసీల్దార్ సుభాని, కార్పొరేటర్లు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో డిస్‌ప్లే బోర్డులకు రూ. 5.04 కోట్లు

- టెండర్ల ప్రక్రియ ప్రారంభించిన రైల్వే శాఖ

నేడు జాతీయ లోక్ అదాలత్

కార్యాలయాలకు దారేదీ? 6

ఒకే ఆధార్‌పై 150 విద్యుత్ మీటర్లు

నాలుగేళ్లుగా పథకాలకు కుటుంబం దూరం.. 8

రైతుల్లేని బజార్లు

దళారుల రంగ ప్రవేశం

- ఖాళీగా దుకాణాల దర్శనం
- ఆదరణ కోల్పోతున్న రైతుబజార్లు
- కానరాని సంచార వాహన రైతు బజార్లు



- పొన్నూరు రైతు బజారులో ఖాళీగా ఉన్న షాపులు

పొన్నూరుటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పొలం నుంచి వినియోగదారులకు కూరగాయలు అందిస్తున్న.. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వినియోగదారులకు తక్కువ ధరకు రైతులే విక్రయించే ఉద్దేశంతో నెలకొల్పిన రైతుబజార్లు నానాటికీ ప్రాభవం కోల్పోతున్నాయి. ప్రస్తుతం పేరుకు రైతుబజార్లు ఉన్నా అక్కడ రైతులు కానరావడంలేదు. ఇక బహిరంగ (మిగతా 8వ పేజీలో)



సీఎం వీక్షణ సమావేశానికి అధికారులతో కలిసి పాల్గొన్న కలెక్టర్ జె.వెంకటమురళి

పీ-4లో రాష్ట్రంలో బాపట్ల ప్రథమం

కలెక్టర్ వెంకటమురళిని అభినందించిన సీఎం చంద్రబాబు

బాపట్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 62,388 బంగారు కుటుంబాలు ఉంటే 44,920 కుటుంబాలను 3,528 మార్గదర్శకులకు దత్తత ఇవ్వడంతో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా పీ-4 అమల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇప్పటికే 13 కుటుంబాలకు జిల్లా అధికారులు జీవనోపాధి కూడా కల్పించారు. ఈ మేరకు శుక్రవా రం కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీక్షణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ వెంకటమురళిని ముఖ్యమంత్రి ప్రత్యే కంగా అభినందించారు. పీ 4 అమలులో ప్రణాళిక, సమష్టిగా అధికారుల పనితీరు బాగుందని ప్రశంసించారు. బంగారు కుటుంబాలను 72 శాతం అనుసంధానించడం అభినందనీయమన్నారు. మిగిలిన 17వేల కుటుంబాలను మార్గదర్శిలకు దత్తత ఇవ్వాలని సూచిం చారు. రాష్ట్రంలోని అన్నిజిల్లాలు బాపట్ల జిల్లాను స్ఫూర్తిగా తీసుకోవాలని సీఎం సూచించారు. జిల్లాలో 44,920 కుటుంబాలను దత్తతు తీసుకోగా వారికి ఎన్జీవోలను అనుసంధానం చేసినట్లు కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమించి పీ-4 కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. తద్వారా ఆయా కుటుంబాల్లోని వారికి నైపుణ్యాలు, కెరియర్ గైడెన్స్ వంటి సేవలు అందిస్తున్నామన్నారు. సమావేశంలో సీపీవో షాలెంరాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఆర్డీవో పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

10 టన్నుల లారీలో 20 టన్నులు

- ఇసుక స్టాకు పాయింట్ల వద్ద కిరికిరి
- లోడింగ్‌కు బిల్లులకు కుదరని పొంతన

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): 10 టన్నుల సామర్థ్యం ఉన్న లారీలో 20 టన్నులు ఇసుకను లోడ్ చేస్తున్నారు. స్టాక్‌పాయింట్ల వద్ద జారీ చేస్తున్న బిల్లులకు లోడింగ్‌కు పొంతనే ఉండటంలేదు. వీటిని చూస్తుంటే ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఏదో కిరికిరి జరుగుతున్నట్లు అనుమానాలు వస్తున్నాయి. రెట్టింపు మోతాదులో ఇసుక లోడింగ్‌కు కొంతమంది లారీ యజమానులు/డ్రైవర్లు స్టాక్ పాయింట్ల సిబ్బందికి అమ్యామ్యాలు ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అదనంగా తీసుకొచ్చిన ఇసుకని టన్ను రూ.400లకు పైగా అమ్ముకొంటూ జేబులు నింపుకొంటున్నారు. దాడులు చేసి కేసులు పెడితే లారీ యజమానులు తమపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రవాణ శాఖ అధికారవర్గాలు చెబుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు అధికారికంగా గుండిమెడ, అమరావతి, లింగాయపాలెం, బోరుపాలెం, గాజుల్లంకలోని



క్వారీల నుంచి ఇసుకని తీసి స్టాక్‌పాయింట్లకు చేర్చి రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల వాగులు, వంకల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ట్రాక్టర్లలో ఇసుకని తరలిస్తున్నారు. ఇసుక సరఫరా కోసం ట్రాక్టర్లు, ఆరు టైర్లు, 10, 12, 14 టైర్ల ట్రక్కులు వినియోగిస్తున్నారు. ట్రాక్టర్‌లో 4.5 టన్నులు, ఆరు టైర్ల లారీలో 10, పది టైర్ల లారీలో 18, 12 టైర్ల లారీలో 20, 14 టైర్ల లారీలో 25 టన్నుల ఇసుకని నింపుకోవచ్చు. కాగా స్టాక్ పాయింట్ వద్ద ఒక బిల్లు తీసుకుని 24 గంటల వ్యవధిలో ఆ బిల్లుతోనే మూడు ట్రిప్పులు వేస్తున్నారు. ఇందుకు స్టాక్‌పాయింట్ల సిబ్బంది సహకారం లభిస్తున్నది. ఇసుక సరఫరాలో ఆటంకాలు ఉండకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో సంబంధిత శాఖల అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదే అదనుగా లారీ డ్రైవర్లు రెట్టింపు మోతాదులో ఇసుకని తరలిస్తున్నారు. ప్రస్తుతం లింగాయపాలెం-1లో 206443, లింగాయపాలెం-2లో 92032, బోరుపాలెంలో 52288, గుండిమెడలో 14134 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు మాత్రమే ఉన్నాయి. వర్షాలు కురిస్తే క్వారీలు వరదనీటిలో మునిగిపోతాయి. అప్పుడు ఇసుక కొరత తలెత్తి ధర పెరిగే అవకాశం ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు, వేదికపై కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు

ఎత్తిపోతలను పట్టించుకోరా?

నిర్వహణపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యేలు


- 201 పథకాలకు ఏపీఎస్ఐడీసీలో ఒక్క అధికారి
- కల్తీ విత్తనాలు, పురుగు మందులపై ప్రశ్నల వర్షం
- వాడివేడిగా సాగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

గుంటూరు సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వందల కోట్లతో నిర్మించిన ఎత్తిపోతల పథకాలు మూలనపడేశారు. గత ఐదేళ్లలో కనీస మరమ్మతులకు నోచుకోలేదు. పాలకుల నిర్లక్ష్యం వ్యవసాయ రంగానికి పెనుశాపంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 201 ఎత్తిపోతల పథకాలు ఉంటే ఏపీఎస్ఐడీసీలో పర్యవేక్షణ అధికారి ఒక్కరేనా.. అంటూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజ మెత్తారు. శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఎమ్మెల్యేలు ఎత్తిపోతల పథకాల నిర్వహణపై ధ్వజమెత్తారు. ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ అడిగిన ప్రశ్నకు మూడు జిల్లాల వ్యవసాయ అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లనమిలారు. నీటి సంఘాలు రాజకీయ నేతలకు ఆదాయ వనరులుగా మారాయని ఆరోపించారు. ఏపీఎస్ఐడీసీ అధికారులు మాట్లాడుతూ 201 ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే జెర్రివాగు, పేటసన్నెగండ్ల, అనుపు (మిగతా 8వ పేజీలో)

50 ఏళ్ల కల.. వరికెపూడిసెల : శ్రీకృష్ణ దేవ రాయలు

పల్నాడును సస్యశ్యామలం చేసే 50 ఏళ్ల కల వరికెపూడిసెల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. అటవీశాఖకు రూ.14.8 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేంద్రం నుంచి రూ.1800 కోట్లు విడుదల చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, శాసనసభ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, ధూళిపాళ్ల నరేంద్ర,నక్కా ఆనందబాబు, భాష్యం ప్రవీణ్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు మక్కెన మల్లికార్జునరావు, వడ్రాణం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీడీసీసీబీ మాజీ చైర్మన్ నల్లపాటి మృతి


నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు(ఫైల్)

నరసరావుపేట టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జీడీసీసీబీ మాజీ చైర్మన్ నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు(82) శుక్రవారం మృతి చెందారు. నరసరావుపేట మండలం జొన్నగడ్డకు చెందిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాదులో తుదిశ్వాస విడిశారు. భార్య ప్రమీల రెండున్నర సంవత్సరాల క్రితం గతించారు. నల్లపాటి శివరామ చంద్రశేఖరరావుకు రామచంద్రప్రసాదు, వంశీమోహన్ ఇద్దరు కుమారులు. రామచంద్ర ప్రసాదు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు. వంశీ మోహన్ అమెరికాలో ఉంటున్నారు. నల్లపాటి శివరామచంద్రశేఖరరావు తండ్రి నల్లపాటి వెంకటేశ్వర్లు చౌదరి శాసనమండలి సభ్యులుగా వ్యవహరించారు. ఆంధ్ర తొలి స్పీకర్ నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి ఆయన పెదనాన్న. టీడీపీ నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించిన నల్లపాటి నరసరావుపేట జెడ్పీటీసీ సభ్యులుగా అత్యధిక మెజారిటీతో గెలుపొంది, రికార్డు సృష్టించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా 2007లో పనిచేశారు. అంత్యక్రియలు శనివారం నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి మృతి

బాపట్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయలక్ష్మి థియేటర్ సమీపంలోని డ్రెయినేజీలో నాగల కృష్ణ (37) అనే వ్యక్తి పడి చనిపోయినట్లు పట్టణ సీఐ ఆర్.రాంబాబు శుక్రవారం తెలిపారు. మద్యం మత్తులో తూలి డ్రెయినేజీలో బోర్లగా పడటం వల్ల మృతి చెందాడని, మృతుడు నెల్లూరులోని చౌడూరిగారి తోట నివాసి అని వెల్లడించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్సై చంద్రావతి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

దేవదాయ ఆస్తుల రికార్డులు పక్కాగా ఉండాలి

● రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్


మాట్లాడుతున్న ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్

పెదకాకాని, జూలై 4(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖకు సంబంధించిన ఆస్తులకు రికార్డు పక్కాగా ఉండాలని ఆ శాఖ తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. శుక్రవారం పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని కల్యాణ మండపంలో గుంటూరు, పల్నాడు జిల్లాల దేవస్థాన కార్యనిర్వహణాధికారులతో దేవదాయ శాఖ భూములపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవస్థాన భూముల ప్రాపర్టీ రిజిస్టర్లు, రెవెన్యూ రికార్డులు వెబ్ ల్యాండ్ అడంగల్, 1బీలో నమోదు చేయించాలన్నారు. దేవస్థానాల సర్వీస్ ఇనామ్ భూముల ఈనామ్-బీ రిజిస్టర్, ఆర్‌వోఆర్ ప్రకారం ఉండాలన్నారు. భూ ఆక్రమణలపై ఆర్‌ఓఆర్ చట్టం ప్రకారం ఆర్జీవోలకు అప్పీలు చేయాలని సూచించారు. దేవస్థాన భూముల లీజు/లైసెన్స్ ఆమోద ఉత్తర్వులు, ఇప్పటి వరకు సెక్షన్ 83కింద జారీ చేసిన తొలగింపు నోటీసులు, సామాజిక ఆక్రమణల స్థితి తదితరాలు సమీక్షించారు. దేవస్థానం ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత ఈవోలదేనని చంద్రశేఖర్ ఆజాద్ స్పష్టం చేశారు. గుంటూరు జోన్ ఉప కమిషనర్ కామినేని జనసేశ్వర శ్రీనివాసరావు, పెదకాకాని శివాలయం ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్, గుంటూరు జిల్లా ఏసీ మాధవి, పల్నాడు డీఈవో అచ్చుత్, సహాయ కమిషనర్లు సుభద్ర రేఖ, రెండు జిల్లాల ఈవోలు, మేనేజర్లు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 521.90 అడుగులు ఉంది. ఇది 152.76 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 52,067 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారిగా డాక్టర్ మద్దినేని

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


డాక్టర్ మద్దినేని సుధాకర్

గుంటూరు (విద్య), జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్ఎస్ఎస్ అధికారిగా డాక్టర్ మద్దినేని సుధాకర్ నియమితులయ్యారు. గుంటూరులోని చౌడవరం ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో 30 ఏళ్లుగా మేథమెటిక్స్ విభాగంలో ఆయన అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. 23 సంవత్సరాల నుంచి కళాశాల ఎన్.ఎస్.ఎస్. జిల్లా అధికారిగా సేవలు అందిస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ ఎన్.ఎస్.ఎస్. అధికారిగా, జాతీయ స్థాయిలో ఇందిరా గాంధీ ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్‌గా భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అవార్డు అందుకున్నారు. డాక్టర్ మద్దినేని జేఎన్‌టీయూ కళాశాల, ఐఐటీ బాంబే, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 17.27 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్ట్ ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 3,600 క్యూసెక్కుల నీరు, లీకేజ్ ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	104, 112, 123
చికెన్ విత్ స్కిన్(కిలో)	200.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	210.00

కార్యాలయాలకు దారేదీ?



జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం ప్రాంగణంలో ఆక్రమణలు, దుకాణాల ముందు బైకుల పార్కింగ్..

● ప్రైవేట్ మార్కెట్‌లా జిల్లా అధికారుల కార్యాలయాలు
● కుచించుకుపోతున్న కలెక్టరేట్ ప్రాంగణం
● దుకాణాలు, బడ్డీకొట్లతో తప్పని ఇబ్బందులు

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డాక్యుమెంట్ రైటర్లు, నోటరీలు, ఈ-స్టాంపుల విక్రేతలు, జిరాక్స్ సెంటర్ల ఆక్రమణలతో డీఈవో, జిల్లా రిజిస్ట్రార్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కార్యాలయాలున్న ప్రాంగణం కుంచించుకుపోయింది. వీళ్ల వద్దకు వచ్చే టూవీలర్లు, కార్లతో అధికారులు, ఉద్యోగులు తమ వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఎవరికి వారు ఇష్టారాజ్యంగా బడ్డీ బంకులు, సంచార వాహనాలు ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ భవన్‌లో ఒక చిన్న షాపు అద్దెకు తీసుకుని, దానికి అనుబంధంగా ఎంతకావాలంటే అంత స్థలంలో షెడ్లు వేసి ఆక్రమించుకొంటున్నారు. జిల్లా ఉన్నతాధికారుల కళ్లెదుటే ఈ ఆక్రమణలు ఉన్నా ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదు.

ఒక ప్రహరీతో విభజన..

ఒకప్పుడు కలెక్టరేట్ ప్రాంగణం సువిశాలంగా ఉండేది. వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి కొదవ ఉండేది కాదు. అలాంటిది గతంలో ఇక్కడ పని చేసిన ఒక డీఆర్‌వో తన నివాసానికి అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని కలెక్టరేట్ ప్రాంగణాన్ని విభజించారు. దాంతో డీఈవో, రిజిస్ట్రార్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కార్యాలయాలు కలెక్టరేట్ ప్రాంగణం నుంచి ఒక ప్రహరీతో వేరు అయ్యాయి. ఆ తర్వాత రెవెన్యూ భవన్‌ని నిర్మించారు. ఇలా విభజన చేయడం వల్ల కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్‌వో, ఏవో ఇటువైపు చూసే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో స్థలం కనిపిస్తే చాలు రాత్రికి రాత్రి ఏదో ఒక బడ్డీ దుకాణాన్ని అక్కడ ఏర్పాటు చేసేస్తున్నారు. ప్రవేశ ద్వారం మొదలుకొని అనేక ఆక్రమణలు ఇక్కడ వెలిశాయి. కొందరైతే అదేదో వారి సొంత స్థలం అన్నట్టుగా శాశ్వత కట్టడాలు కూడా నిర్మించేసుకొన్నారు. ఎవరూ అభ్యంతరం పెట్టకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

హడావుడి చర్యలే..

ఏదైనా పని మీద, ఇన్‌స్పెక్షన్ కోసం ఈ మూడు కార్యాలయాలు ఉన్న ప్రాంగణానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వాహనాలు రావాలన్నా ఇబ్బందికరమే. ఏ ఒక్కరి అజమాయిషి లేకపోవడం వల్లే ఇలా ఆక్రమణలు వెలిశాయన్నది బహిరంగ రహస్యం. గతంలో ఒకటి, రెండు సార్లు ఆక్రమణలను జిల్లా యంత్రాంగం తొలగించినా, ఆ తర్వాత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోవడంతో మరిన్ని ఆక్రమణలు పుట్టుకొచ్చాయి. ఈ ప్రాంగణం చూస్తే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నట్లుగా కనిపించదు. అదేదో మార్కెట్ ఉందన్న భావన కలుగుతుంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ తగిన చర్యలు చేపట్టాలని వివిధ వర్గాలు కోరుతున్నాయి.

31,653 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 27,878 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 31,653 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 3,750 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9700	11200
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	13000
273	---	----	నెంబరు. 5	10000	13300
341	10000	13500	273	--	--
4884	----	----	341	10000	13400
సూపర్ 10	----	----	4884	10000	12200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	10000	13500
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	-----	---
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4500	7000

రైల్వేస్టేషన్లలో డిస్‌ప్లే బోర్డులకు రూ. 5.04 కోట్లు

● టెండర్ల ప్రక్రియ ప్రారంభించిన రైల్వే శాఖ

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్‌లలో వివిధ రకాల డిస్‌ప్లే బోర్డుల ఏర్పాటుకు రైల్వే శాఖ రూ.5.04 కోట్ల నిధులు మంజూరు చేసింది. డివిజన్ పరిధిలోని ఎనిమిది ప్రధాన రైల్వే స్టేషన్లలో కోచ్ ఇండికేటర్ బోర్డులు, ట్రైన్స్ ఎట్ ఏ గ్లాన్స్ తదితర బోర్డులను ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం టెండర్ల ప్రక్రియని ప్రారంభించింది. ఈ నెల 22వ తేదీ లోపు టెండర్లు ఖరారు చేసి, ఏడాది వ్యవధిలోనే వీటిని ఏర్పాటు చేస్తుంది. రేపల్లె, మాచర్ల, మిర్యాలగూడ, నంద్యాల, గిద్దలూరు, కంభం, కురిచేడు రైల్వేస్టేషన్లలో ఈ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు అవుతాయని రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. దీని వల్ల ఏ బోగి ఎక్కడికి వచ్చి ఆగుతుందనేది ప్లాట్‌ఫాం ఉన్న ఇండికేషన్ బోర్డులలో తెలిసిపోతుంది. అలానే రైలు రాకపోకల సమయం తెలిపే.. ఎల్ఈడీ బోర్డులను కూడా ఏర్పాటు చేస్తారు.

నడికుడి - శ్రీకాళహస్తి.. ఎఫ్ఎల్ఎస్ రీవ్యాలిడేషన్

నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలు మార్గంలో ఫైనల్ లొకేషన్ సర్వేని రీవాలిడేషన్ చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ నూతన రైలు మార్గంలో పామూరు - అట్లూరుపాడు సెక్షన్ మధ్యన 132 కిలోమీటర్ల దూరం ఉంది. కొన్ని కోర్టు కేసుల కారణంగా పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో దశాబ్దం క్రితమే జరిగిన ఎఫ్ఎల్ఎస్‌కు సంబంధించిన డేటాని తీసుకుని ఇప్పుడు యూఏవీ డ్రోన్ వీడియోగ్రఫీతో వాలిడేషన్ చేస్తారు. దీని వల్ల అప్పటికి, ఇప్పటికి గ్రౌండ్ లెవల్‌లో ఏమైనా మార్పులు జరిగాయా అన్నది, అప్పట్లో లేని నిర్మాణా లు ఈ పదేళ్లలో ఏమైనా జరిగి ఉంటే ఇట్టే తెలిసిపోతుంది. అలానే భూమి ఆక్రమణలు జరిగితే.. వెలుగులోకి వస్తాయి. ఇందుకోసం రూ.1.85 కోట్లను రైల్వే శాఖ వెచ్చించబోతోంది. ఈ ఎఫ్ఎల్ఎస్ రీవాలిడేషన్‌ని ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. ఈ రీవాలిడేషన్ పూర్తి అయితే రైల్వేకు నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలు మార్గం పూర్తి చేసేందుకు ఏ విధంగా ముందుకెళ్లాలనే దానిపై ఒక స్పష్టత వస్తుంది.

మంతెన ఆశ్రమంలో యువకుడి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, భూపతి మృతదేహం

తుళ్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెం గ్రామ పరిధిలో గల మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో గురువారం రాత్రి యువకుడు ఉరేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన భూపతి (23) ఆరు నెలల క్రితం ఇంటర్న్‌షిప్ కోసం ఆశ్రమానికి వచ్చాడు. ఇతనితోపాటు మరో 40 మంది కూడా వచ్చారు. ఆశ్రమంలోని రెండవ ఫ్లోర్‌లో ఉంటున్న భూపతి ఫ్యాన్‌కి టవల్‌తో ఉరేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ప్రేమించిన యువతికి తాను ఉరేసుకుంటున్నట్టు ఫోన్ చేసి భూపతి చెప్పాడు. మృతునితో పాటు వచ్చిన వారికి ఈ విషయాన్ని ఆ యువతి చెప్పింది. దీంతో వారు గదికి వెళ్లి చూడగా అప్పటికే ఉరేసుకొని మృతి చెందినట్టు తుళ్లూరు ఎస్ఐ కలగయ్య తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని మంగళగిరి ఎయిమ్స్ హాస్పటల్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు భూపతి మృతదేహాన్ని శుక్రవారం అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

గుంటూరు(లీగల్), జూలై 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కక్షిదారులు తమ వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకొని లబ్ధి పొందాలని పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, పార్టిషన్, ప్రో నోటు దావాలతో పాటు.. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం కొన్ని ఎక్సైజ్ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా, చెక్ బౌన్స్, భూ సేకరణకు సంబంధించి నష్టపరిహారం, ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కక్షిదారులు, పోలీస్, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ మార్గంలో పరిష్కారానికి సహకరించాలని కోరారు. ముఖ్యంగా సివిల్ కేసులలో అప్పీల్, చెక్కు బౌన్స్ కేసులు ఎక్కువగా రాజీ చేసే దిశగా కక్షిదారులకు ఆయన పిలుపునిచ్చారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


సుపరిపాలన కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

సుపరిపాలనతో ప్రతి ఇంటా సంతోషాలు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్
● 53వ డివిజన్‌లో 'సుపరిపాలనకు తొలి అడుగు'

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనతో ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరుస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. సుపరిపాలన-మన ఎమ్మెల్యే తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన గుంటూరులోని 53వ డివిజన్‌లో పర్యటించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. నీళ్లు సమయానికి వస్తున్నాయా? తల్లికి వందనం డబ్బులు పడ్డాయా? అంటూ పలకరించారు. ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నామని, దీంతో తూర్పు నియోజకవర్గంలో కాలనీల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తూర్పు నియోజకవర్గంలో ఏ ఒక్కరూ అనారోగ్య కారణంగా ఇబ్బందులు పడకూడదనే మహోన్నత లక్ష్యంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 200 మందికి రూ.2.50 కోట్ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందించామని వెల్లడించారు. అన్న క్యాంటీన్ల ఏర్పాటుతో నిరుపేదలకు కడుపు నింపుతున్నామన్నారు.

గుంటూరు తూర్పులో 17,500 బంగారు కుటుంబాలు

గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 17,500 బంగారు కుటుంబాలను గుర్తించామని వీరందరి జీవితాలను మార్చే విధంగా పీ- 4ను రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు వంగవీటి

వంగవీటి మోహన రంగా ప్రజా నాయకుడని, ఆయనసేవలను ఎప్పటికీ మరిచిపోలేమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వంగవీటి రంగా జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

నేషనల్ కాన్ఫరెన్స్‌కు హాజరైన మేయర్ రవీంద్ర


నేషనల్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఈనెల 3, 4 తేదీల్లో హర్యానా రాష్ట్రంలోని గురుగ్రాం నగరంలో జరుగుతున్న 'నేషనల్ లెవెల్ కాన్ఫరెన్స్ ఆఫ్ చైర్‌పర్సన్స్ ఆఫ్ అర్బన్ లోకల్ బాడీస్' సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ రవీంద్ర హర్యానా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ హర్వీందర్ కళ్యాణ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థలలో రాజ్యాంగ ప్రజాస్వామ్యం, జాతి నిర్మాణంలో పట్టణ స్థానిక సంస్థల పాత్ర అనే అంశాలపై రెండు రోజుల పాటు వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన మేయర్లు, డిప్యూటీ మేయర్లకు హర్యానా స్పీకర్ ఆధ్వర్యంలో అవగాహన కలిగించారని తెలిపారు.

ఉన్నత వ్యక్తిత్వానికి ప్రతీక మాధవపెద్ది

● వరల్డ్ ఎకనామిక్ ఫోరం అడ్వయిజర్ సత్యనారాయణ


మాట్లాడుతున్న సత్యనారాయణ

గుంటూరు(విద్య), జూలై 4 (ఆంధ్రజ్యోతి): హిందూ కళాశాల పాలక మండలి అధ్యక్షుడిగా, న్యాయవాదిగా, ఆధ్యాత్మిక తత్వవేత్తగా, కర్మ, జ్ఞాన, భక్తి యోగాలను ఆచరణాత్మకంగా ఆచరించి చూపిన గొప్ప మానవతా మూర్తి దివంగత మాధవపెద్ది రాధాకృష్ణమూర్తి అని ప్రపంచ ఆర్థిక సంస్థ సలహాదారు జి.సత్యనారాయణ అన్నారు. స్థానిక హిందూ కళాశాల రాధాకృష్ణ సమావేశ మందిరంలో కళాశాల పూర్వ అధ్యక్షుడు మాధవపెద్ది రాధాకృష్ణమూర్తి శత జయంతోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సభకు హిందూ కళాశాల, హైస్కూల్ అధ్యక్షుడు గట్టిప శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. ఐఏఎస్ జి.సత్యనారాయణ మాట్లాడుతూ సంపూర్ణ వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలిచి విలువలతో కూడిన జీవన శైలికి ప్రతిబింబంగా రాధాకృష్ణమూర్తి నిలుస్తారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 8 దశాబ్దాలు పైగా చరిత్ర కలిగిన హిందూ కళాశాల ఎన్నో కష్టాలను తట్టుకుని విలువలతో కూడిన ప్రమాణాలతో నడవటం కళాశాల కీర్తిని తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ కార్యదర్శి డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి చెరుకు రామకృష్ణమూర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, జూపూడి రంగరాజు, కౌన్సిల్ కార్యదర్శి కేవీఎస్ కుటుంబరావు, ఎండీబీలో ముత్యాలు, మీరా శేఖర్, రమణి ప్రసాద్, చైతన్య, అపర్ణ, కళాశాల విభాగాధిపతులు, ఆచార్యులు, కౌన్సిల్ సభ్యులు, మాధవపెద్ది కుటుంబ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులను అమలు చేయాలి

గుంటూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ కృష్ణారావు కోరారు. ఆర్టీసీలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి భాగంగా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఉద్యోగుల నిరసన ప్రదర్శన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని కోరారు. విద్యుత్ బస్సులను ఆర్టీసీనే కొనుగోలు చేసి నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని లేకుంటే ఐఆర్ ప్రకటించాలని కోరారు. యూనియన్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ డీవీ స్వామి, డిపో కార్యదర్శులు రత్నాకర్, దత్తు, ట్రెజరర్ ఖాజా సాహెబ్, ఓ. ధనలక్ష్మి, ప్రకాష్ తదితరులున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి : పింగళి వెంకయ్య

గుంటూరు(తూర్పు), జూలై 4(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉపన్యాసకుడిగా, జాతీయ జెండా రూపకల్ప శిల్పిగా పేరుగాంచిన గొప్ప వ్యక్తి పింగళి వెంకయ్య అని పలువురు కొనియాడారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం నటనాలయ అధ్యక్షుడు నీలం మందారావు ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమంలో కె.వి. రామారావు ఆహ్వానం పలుకగా, రంగస్థల ఆచార్యులు డాక్టర్ జి.యస్. ప్రసాదరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రముఖ దర్శకులు పి. శివప్రసాద్, సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, రచయిత సీఎస్ మూర్తి, నటులు కె. అనంతపద్మనాభ్, సీహెచ్ నాయుడు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సినీ దర్శకుడు ఎం.ఎస్. విద్యావేత్త పి.శశికుమార్ పాల్గొని పింగళి వెంకయ్య సేవలను కొనియాడారు. సభానంతరం డాక్టర్ పీ.వీ. కుమార్‌రెడ్డి రచించిన నెల్లూరు సుబ్బారెడ్డి దర్శకత్వంలో వంశవృక్షం నాటిక సందేశాత్మకంగా సాగింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కొత్తపేట, భగత్‌సింగ్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యశ్వంత్, డేవిడ్, అమర్నాథ్, కిరణ్, గణేష్, అజయ్, జ్యోతిక, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక కార్యాచరణ

● కమిషనర్ పులి శ్రీనివాసులు


ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈనెలాఖరు నాటికి ప్రజలు మెచ్చేలా పారిశుధ్యాన్ని అందించేందుకు నగర పరిధిలోని మూడు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, ప్రజారోగ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లతో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక సమావేశం జరిగింది.

కమిషనర్ మాట్లాడుతూ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 57 ఎలక్షన్ వార్డులని ఒక్కొక్క వార్డు ఒక్కొక్క శానిటరీ డివిజన్‌గా చేస్తూ అక్కడ కావాల్సిన కార్మికులు, పుష్ కాట్స్, ట్రాక్టర్లు, ఇతర వస్తువుల కేటాయింపు చేసి, మ్యాపింగ్ చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గాన్ని పర్యావరణహిత, పరిశుభ్ర నియోజకవర్గంగా తీర్చిదిద్దుకోవడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేస్తామన్నారు. డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓల (ఇన్‌చార్జి) సోమశేఖర్, ఎస్ఎస్‌లు ప్రసాద్, రాజేష్, కార్పొరేటర్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా నిర్మాణం చేసే డ్రెయిన్లు, రోడ్లు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం బృందావన్ గార్డెన్స్, పండరీపురం, విద్యా నగర్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు జరిగే సమయంలోనే ధర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజన్సీల ద్వారా నాణ్యత పరీక్షలు చేయించాలని డీఈఈలకు స్పష్టం చేశారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ ప్రసాద్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అన్న క్యాంటీన్లలో మౌలిక వసతులపై నోడల్ అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఐడీ హాస్పిటల్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని శుక్రవారం కమిషనర్ పరిశీలించి ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

అల్లూరి పోరాటం సదాస్మరణీయం

● కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే మాధవి, కార్పొరేటర్లు, అధికారులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 4 (ఆంధ్ర జ్యోతి): అల్లూరి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి సదా స్మరణీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్లా మాధవి అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం నేటి తరం తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషన ర్లు, విభాగాధిపతులు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి, వంగవీటి జయంతి వేడుకలు

గుంటూరు(తూర్పు), జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమరావతి రోడ్డు, సేవా సదన్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహన రంగా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు మిరియాల గోపి కుమార్, మిరియాల ప్రసాదరావు పాల్గొని వారి చిత్రపటాలకు పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అల్లూరి, వంగవీటి ఇద్దరూ ఒకే ఆశయం కోసమే పోరాడారని గుర్తు చేసుకున్నారు. పేదల హక్కుల సాధన కోసమే ఉద్యమించడమే వారికిచ్చే ఘన నివాళులని అన్నారు. కార్యక్రమంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, జనసేన నాయకులు ఉప్పు వెంకటరత్తయ్య, త్రిపుర కుమార్, కాపు జేఏసీ అధ్యక్షుడు అమ్మ శ్రీనివాస్ నాయుడు, గున్నం సాయిబాబు, తుపాకుల శంకర్, చింతమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మరణంలేని విప్లవ వీరుడు 'అల్లూరి'

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మరణం లేని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కీర్తించారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నాజ్ సెంటర్ లోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, అచ్యుత ఇందుశేఖర్, చంద్రయ్య, ఆర్‌వీ సింగరయ్య, సదాశివం, రాఘవరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

అల్లూరి త్యాగం అనిర్వచనీయం


అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ రమణమూర్తి

గుంటూరు, జూలై 4 (ఆంధ్ర జ్యోతి) : భారతావని స్వాతంత్ర్యం సాధిం చటానికి అల్లూరి చేసిన త్యాగం అనిర్వచనీయమని జిల్లా అదనపు ఎస్పీ రమణమూర్తి అన్నారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదనపు ఎస్పీలు రమణమూర్తి, హనుమంతు మాట్లాడుతూ స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని నమ్మిన అల్లూరి తన పోరాట పటిమతో బ్రిటిష్ సైన్యాన్ని వణికించారన్నారు. పోలీస్ కార్యాలయ ఏవో అద్దంకి వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ రమాదేవి, సుభాషిని, ఆర్‌ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, సురేష్ పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ వాసవి హోల్‌సేల్ క్లాత్ మర్చంట్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు(తూర్పు), జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ క్లాత్ మార్కెట్‌లో శుక్రవారం, శ్రీ వాసవి హోల్‌సేల్ క్లాత్ మర్చంట్ సొసైటి నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా సముద్రాల శ్రీనివాసరావు, కార్యదర్శిగా పోలిశెట్టి మురళీకృష్ణ, కోశాధికారిగా శింగంశెట్టి పిచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా చలువాది మురళీకృష్ణ, అద్దేపల్లి శ్రీనివాసరావు, సముద్రాల జనార్దన్‌రావు, కే.వెంకట కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా తూనుగుంట్ల గౌరీశంకర్, కొల్లిపర శివ వెంకట జనార్దన్‌రావు, గాదిరాజు హనుమ వెంకట సత్య వర్మలను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

దినసరి వేతనాల పెంపుదల

గుంటూరు(తూర్పు), జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న కార్మికుల దినసరి వేతనాల నిర్ణయించేందుకు కలెక్టరేట్‌లో డీఆర్వో ఖాజావలీ అధ్యక్షతన శుక్రవారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశ వివరాలను ఉప కార్మిక కమిషనర్ గాయత్రిదేవి వెల్లడించారు. అత్యంత నైపుణ్యం కలిగిన కార్మికులకు రూ.910, నైపుణ్యత ఉన్న వారికి రూ.860, పాక్షిక నైపుణ్యత ఉన్న వారికి రూ.800, నైపుణ్యత లేని వారికి రూ.680గా నిర్ణయించినట్టు ఆమె తెలిపారు.

కాంపౌండర్ టు కార్డియాలజిస్ట్!

● చిత్తూరులో ఐదేళ్లుగా నకిలీ డాక్టర్ విధులు

చిత్తూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరులో ఐదేళ్లుగా కార్డియాలజిస్ట్‌గా పని చేస్తున్న ఓ నకిలీ డాక్టర్ బాగోతం బయటపడింది. బాపట్ల జిల్లా చెరుకుపల్లికి చెందిన వీరాంజనేయులు పదేళ్ల క్రితం ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేశాడు. కొంతకాలమయ్యాక గుంటూరులోని కొన్ని ఆస్పత్రుల్లో కాంపౌండర్‌గా పని చేశాడు. ఆ తర్వాత డాక్టర్‌గా అవతారం ఎత్తి పలు పెళ్లిళ్లు చేసుకున్నాడు. ఆ విషయం బయటకు పొక్కి కేసులు నమోదు కావడంతో చిత్తూరుకు మకాం మార్చాడు. డాక్టర్ రమేష్‌బాబుగా పేరు మార్చుకుని నగరంలోని ఏకే అమ్మా ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్‌గా చేరిపోయాడు. ఏడేళ్ల క్రితం పెళ్లాడిన మహిళ అదనపు కట్నం కోసం వేధించడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఇతడిపై అనుమానం వచ్చి విచారించగా అసలు డాక్టరే కాదని, ఎంతోమంది మహిళలను పెళ్లిపేరుతో మోసం చేశాడని తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసులో రౌడీషీటర్ అరెస్టు

● ప్రేమ పెళ్లి చేసుకుని వేధింపులు

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పెళ్లి చేసుకున్న ఐదు నెలలకే వివాహిత ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన కేసులో నిందితుడైన రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన రౌడీషీటర్ పాలిపోగు శ్రీను (21)ను శుక్రవారం పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. శ్రీను అదే ఏరియాకు చెందిన కీర్తన యువతిని ప్రేమించి గత ఏడాది సెప్టెంబర్ 20న ఆమెను ఇంటిలో నుంచి ఎవరికీ చెప్పకుండా తీసుకెళ్లాడు. ఆ తరువాత పెద్దల సమక్షంలో ఈ ఏడాది జనవరి 23న కీర్తనను పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి బ్రాడీపేట 4/19వ లైనులో కాపురం పెట్టాడు. కాగా పెళ్లి అయినప్పటి నుంచి శ్రీను తన భార్య కీర్తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 23న సాయంత్రం కూడా శ్రీను తన భార్య కీర్తనను తిట్టి బయటకు వెళ్లాడు. ఆ తరువాత రాత్రి సుమారు 8 గంటల సమయంలో కీర్తన తను నివాసం ఉండే ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కీర్తన తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిందితుడైన రౌడీషీటర్ పాలిపోగు శ్రీనును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు శ్రీను మీద గతంలో అరండల్ పేట పోలీస్ స్టేషన్‌లో ఆరు కేసులు ఉన్నాయన్నారు. అంతేగాక అరండల్‌పేట స్టేషన్‌లో రౌడీషీటు కూడా ఉందన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని భాను ప్రసాద్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. భాను ప్రసాద్ కాలనీకి చెందిన పడగల వనిత, ప్రభాకర్ దంపతులకు కుమారుడు కుమార్తె సంతానం ఉన్నారు. గత నెల 20న రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా చెన్నైలో బంధువుల ఇంటిలో ఓ శుభకార్యానికి వనిత వెళ్ళింది. గురువారం మధ్యాహ్నం వనిత ఇంటి తలుపులు పగులకొట్టి ఉండడం ఎదురింటికి చెందిన అరుణ గమనించి ఫోన్ చేసి చెప్పింది. దీంతో వనిత శుక్రవారం ఇంటికి వచ్చి చూసుకోగా బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉంచిన ఐదు సెవరీల బంగారు ఆభరణాలు వెండి వస్తువులు లక్ష నగదు దొంగలు అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నగరం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు మీటర్ రీడింగ్ పేరుతో దోపిడీ

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వికాస్ నగర్ వృద్ధురాలి మెడలో గొలుసు తెంచుకెళ్ళారు. ఈ కేసు వివరాల్లోకి వెళితే... వికాస్ నగర్ 5/3లో సంద్ర చిట్టెమ్మ(75), ఆమె కూతురు నివాసం ఉంటారు. చిట్టెమ్మ భర్త మూర్తి గతంలో చనిపోయాడు. గురువారం చిట్టెమ్మ కూతురు తాను పనిచేస్తున్న కార్యాలయానికి వెళ్లారు. చిట్టెమ్మ ఒక్కతే ఇంటిలో ఉంది. గుర్తు తెలియని వ్యక్తి ఆమె ఇంటికి వచ్చి కరెంటు మీటర్ రీడింగ్ తీయాలి తలుపు తీయమని కోరాడు. అందుకు నిరాకరించి తర్వాత రావాలని చెప్పింది. దీంతో కనీసం మంచినీరైన ఇవ్వాలని అడగ్గా అందుకు కూడా చిట్టెమ్మ నిరాకరించింది. చివరకు కనీసం గ్లాసు ఇస్తే బోర్ వద్ద పట్టుకొని తాగుతానని చెప్పాడు. దీంతో తలుపు తీసిన చిట్టెమ్మ గ్లాస్ ఇచ్చేందుకు వెనక్కి తిరగ్గా నిందితుడు ఆమె గొంతు గట్టిగా పట్టుకొని, మెడలో ఉన్న బంగారపు గొలుసు తెంచుకొని తాను తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడిపై దాడి చేసిన నిందితులపై కేసు

ఓ యువకుడిపై దాడి చేసి కొట్టిన నిందితులపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసారు. కోబాల్ట్‌పేటకి చెందిన పసుపులేటి నిశాంత్ కుమార్ అనే యువకుడిని అబ్దుల్, మరికొంత మంది యువకులు కలిసి కొరిటెపాడుకు పిలిపించారు. తమకు సంబంధించిన అమ్మాయితో మాట్లాడవద్దు అని గొడవ పెట్టుకున్నారు. ఈనెల 3న కొరిటెపాడు సెంటర్‌కి పిలిచి గొడవ పడి కర్రలతో కొట్టారు. దీంతో శుక్రవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌పోర్టు కంపెనీపై చీటింగ్ కేసు

అరండల్‌పేటలో ఒక ట్రాన్స్‌పోర్టు కంపెనీని మోసం చేసిన మరో ట్రాన్స్‌పోర్టు కంపెనీపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రిన్ హౌల్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ట్రాన్స్‌పోర్టు కంపెనీ ఆరండల్‌పేట కె చెందిన మరో ట్రాన్స్‌పోర్టు కంపెనీకి చెందిన వాహనంలో రూ14 లక్షల సరుకు లోడ్ చేసి చెన్నై నుండి బెంగళూరుకు పంపారు. అయితే సదరు ట్రాన్స్‌పోర్టు కంపెనీ నగదు డిమాండ్ చేస్తూ సరుకు డెలివరీ చేయకుండా మోసం చేస్తున్నట్లు గ్రిన్ హౌల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్ పునీత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన వ్యక్తికి రిమాండ్

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎత్తు రోడ్డు వద్ద విధి నిర్వహణలో ఉన్న ఈస్ట్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దౌర్జన్యం చేసిన పంచపాల శ్రీకాంత్‌ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించింది. కానిస్టేబుల్ సిహెచ్ వెంకటేశ్వరరావు విధులు నిర్వహిస్తుండగా శ్రీకాంత్ తన మోటార్ సైకిల్‌పై వచ్చి వేరే వారితో గొడవ పడుతున్నాడు. సదరు కానిస్టేబుల్ గొడవ సద్దుమణిగే విధంగా ప్రయత్నించగా, నిందితడు శ్రీకాంత్ ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో గొడవపడి ఆయపై దౌర్జన్యం చేసి, తన విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు శ్రీకాంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారని పోలీసులు తెలిపారు.

నిరసన హక్కుపై ఆంక్షలను ఎత్తివేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, సంస్థల నిరసనలపై ఆంక్షలు విధిస్తూ చేసిన పోలీసు ప్రకటనను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, వై.నేతాజీ డిమాండ్ చేశారు. బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు నిర్వహించుకునేవారే వారం రోజుల ముందే అనుమతి తీసుకోవాలనే పోలీసుల నిర్ణయం అప్రజాస్వామికమని అన్నారు.


సుపరిపాలన కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

పేదరికం లేని సమాజమే ఎన్డీయే కూటమి లక్ష్యం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి
● ఏటీ అగ్రహారంలో 'సుపరిపాలనకు తొలి అడుగు'

గుంటూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పీ- 4 విధానం ద్వారా పేదరికం లేని సమాజాన్ని తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఏటీ అగ్రహారంలో శుక్రవారం ఆమె సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది కాలంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన కరపత్రాన్ని ఇంటింటికి తిరిగి ప్రజలకు అందజేసి, వారి నుంచి పాలన తీరుపై అభిప్రాయాలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ నేతలు ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించేవారు, కానీ ఎన్డీయే కూటమి ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్య గర్వంగా తిరుగుతున్నామని చెప్పారు. తమ పర్యటనలో పెన్షన్లపై విజ్ఞప్తులు ఎక్కువగా వస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం తొలగింపుల కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని, ప్రతి ఒక్కరికి పింఛన్ వచ్చేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు, సింహాద్రి కనకాచారి, మానుకొండ శివప్రసాద్, కోరంగి శ్రీనివాసరావు, పేరం అనిత, దూదేకుల షాహిద్ బాబు, ముత్తునేని రాజేష్, పోరెళ్ళ సాంబ శివరావు, మర్రి భరత్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడిన నాయకుడు వంగవీటి

సామాజిక న్యాయం కోసం పోరాడిన నాయకుడు వంగవీటి మోహన రంగా అని గుంటూరు ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఆర్ అగ్రహారం ఎత్తు రోడ్ సెంటర్‌లోని వంగవీటి రంగా విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వంగవీటి మోహన రంగా విగ్రహానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వంగవీటి రంగా బర్త్‌డే కేక్ ను ఎమ్మెల్యే కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉల్లి గోపాల్, మేళం సైదయ్య, కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, అడపా బాబు, అడపా శ్రీను, యిర్రి వాసు, శానం రమేష్, ముక్తం బాషా, చల్లా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

● ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకుడు వంగవీటి మోహనరంగా అని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. రంగా జయంతిని పురస్కరించుకొని పాత గుంటూరు ఆంజనేయస్వామి గుడి వద్దనున్న ఆయన విగ్రహానికి శుక్రవారం ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రంగా ప్రజల మనిషి, పేదల నాయకుడు అని కొనియాడారు. రంగా ఆశయాల సాధనకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. రంగా కేవలం ఒక సామాజికవర్గానికి చెందిన నేత మాత్రమే కాదని, బడుగు, బలహీన వర్గాల వెన్నంటి నిలిచి వారికి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి వేణు, యర్రగోపు నాగేశ్వరరావు, యడ్ల నాగమల్లేశ్వరావు, ఇర్రి సాయి, తోట అక్కి, కె.సుబ్బారావు, అల్లం బాజీ, రాగం సదాశివరావు, పొన్నెగంటి శ్రీను, మానస ప్రభు, చెన్నంశెట్టి చక్రపాణి, జెడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీఐడీసీ చైర్మన్ డేగల తదితరులు

ఉన్నతాధికారుల ఆదేశాలతోనే బదిలీ : డీఎం

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ ఎంఎల్ఎస్ పాయింటులో తాజాగా జరిగిన బదిలీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే జరిగిందని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ తులసి తెలిపారు. గత డీఎం ఇచ్చిన బదిలీ ఆదేశాలు అమలు చేయడం సాధ్యపడలేదని, కలెక్టరేట్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఉద్యోగిని, తిరిగి కలెక్టరేట్‌కు మరలా డిప్యూట్ చేశారని, అందువల్ల బదిలీ సాధ్యం కాలేదని చెప్పారు. ప్రధాన కార్యాలయం ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ అంతర్గత ఏర్పాటు చేసి తమ కార్యాలయంలోని ఉద్యోగిని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా నియమించామని తెలిపారు. ఈ కేటాయింపులన్నీ జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచామని వివరించారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

గుంటూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా బీజేపీ ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, ట్రాఫిక్ సీఐ సింగయ్యను కలసి విజ్ఞప్తి చేశారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా.. ఒకరు ప్రమాదానికి గురై.. కోమాలోకి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అతను వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిపారు. నిందితులపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్పీకి "తల్లి చరణాలపై వాలి" అనే పుస్తకాన్ని, సీఐకు వివేకానందుని "భారత దేశానికి నా హితవు" అనే పుస్తకాన్ని బహూకరించారు.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు

గుంటూరు సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ లో కారుణ్య నియామకాలు చేపట్టారు. ఇరువురుకి శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. జి. మౌనికను పెదనందిపాడు మండల పరిషత్‌లో, షేక్ మీరా మెహతాబ్‌ను పెదకూరపాడు మండల పరిషత్‌లో ఆఫీసు సబార్డినేట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈఓ వి.జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ, ఏఓలు శామ్యూల్ పాల్, రాజా రత్న బాబు పాల్గొన్నారు.

కౌలు.. కనికరిస్తారా?

(5వ పేజీ తరువాయి)

పెట్టుకున్న కౌలు రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. గతేడాది కూడా రుణాల విషయంలో తీవ్ర అన్యాయమే జరిగింది. గతేడాది బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలు ఆచరణలోకి వచ్చేసరికి తీసికట్టుగా ఉన్నాయి. బాపట్ల జిల్లాలో కేవలం రూ.48 కోట్లకు పరిమితమైతే, గుంటూరు జిల్లాలో రూ.32 కోట్లు, పల్నాడు జిల్లాలో రూ.40 కోట్ల వద్దే కౌలు రుణాలు ఆగిపోయాయి. పద్దు ప్రకటించే సమయంలో ప్రకటించిన రుణ గణాంకాల్లో 25 శాతం చేరుకోవడంలో కూడా బ్యాంకులు సఫలం కాకపోవడం కౌలు రైతులపై వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. బ్యాంకులు రుణాలు అందించడానికి సీసీఆర్‌సీ కార్డే ప్రామాణికమని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఆ కార్డుల జారీలో క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఒకవేళ కార్డు ఉన్నప్పటికీ బ్యాంకులు పట్టించుకోవడం లేదని కౌలురైతులు ఆరోపిస్తున్నారు. రేపోమాపో ప్రభుత్వం విడుదల చేసే అన్నదాత సుఖీభవ నిధుల విషయంలో కూడా కౌలు రైతుల ఊసే లేకపోవడం వారిని మరింత ఆందోళనకు గురి చేస్తోంది.

నెలవారీ సమీక్షలు చేస్తేనే..

రుణాల విషయంలో బ్యాంకర్లకు ఆదేశాలకే ప్రభుత్వం పరిమితమవుతుంది. వాటి పురోగతిని పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. రుణాల విషయంలో కౌలు రైతుల గంపెడాశలు పెట్టుకుని ఉన్నారు. గతేడాది సీసీఆర్‌సీ కార్డులను రికార్డు స్థాయిలో ప్రభుత్వం అందించింది. కానీ రుణాల విషయంలో మాత్రం వెనకడుగుగానే ఉంది. రకరకాల కొర్రీలతో రుణాల విషయంలో బ్యాంకులు కౌలు రైతులను కనికరించడంలేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదేశాలతో సరిపెట్టకుండా కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో నెలవారీ సమీక్షలు జరిపి బ్యాంకులను జవాబుదారీ చేస్తే తప్ప న్యాయం జరగదు.

సమన్వయం లేక ఇక్కట్లు...

సీసీఆర్‌సీ కార్డులు మొదలుకుని బ్యాంకులు అందించే రుణాల వరకు భూ యజమానులకు అవగాహన కల్పించి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వం పదేపదే వ్యవసాయశాఖకు సూచిస్తోంది. కానీ ఆచరణలో ఈ దిశగా ప్రయత్నాలు జరిగిన దాఖలాలు కనబడడం లేదు. సీసీఆర్‌సీ కార్డుల జారీలో రెవెన్యూ, వ్యవసాయశాఖ పరస్పరం నిందించుకుంటుంటే, రుణాల విషయంలో తమతో వ్యవసాయశాఖ సమన్వయం చేసుకోవడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. ఇలా ఒకరిమీద ఒకరు కుంటిసాకులు చెప్పుకుంటూ కౌలు రైతులకు మేలు చేయాలనే ప్రభుత్వ ఉద్దేశాలకు తూట్లు పొడుస్తున్నారు.

రైతుల్లేని బజార్లు

(5వ పేజీ తరువాయి)

మార్కెట్‌లో చోటుచేసుకునే పరిణామాలతో రైతుబజార్లకు రోజురోజుకు వినియోగదారుల నుంచి ఆదరణ తగ్గిపోతోంది. చిన్న రైతులకు అధిక ఆదాయం లభించేలా వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలు అందేలా 1999లో రైతు బజార్లను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే గత ప్రభుత్వాలు రైతుబజార్లను ప్రత్యేకంగా అభివృద్ధి చేశాయి. గత వైసీపీ పాలకులు రైతుబజార్లపై శీతకన్నేశారు. దీంతో ప్రస్తుతం రైతులు తగ్గి దళారులు, ప్రైవేటు వ్యాపారులు రంగ ప్రవేశంతో క్రమేణా రైతు బజార్లు ప్రాభవం తగ్గిపోయాయి. సిఫార్సులతో స్టాల్స్ దక్కించుకున్న ప్రైవేటు వ్యాపారులు ధరలు ఇష్టారాజ్యంగా పెంచి విక్రయిస్తున్నారు. మార్కెట్లలో జరిగే తూకాల్లో మోసాలు ఇక్కడ కూడా ఉంటున్నాయి. కూరగాయల నాణ్యత అంతంతే. దీంతో వినియోగదారులు రైతు బజార్ల వైపు చూడడం లేదు. వినియోగదారుల వద్దకే కూరగాయలు సరఫరా చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన సంచారవాహనాలు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎక్కడా కానరావడం లేదు. ఈ రైతు బజార్ల వాహనాలు మరమ్మతులు, నిర్వాహణ లోపంతో నిలిచిపోయినట్లు సమాచారం. తెనాలిలో 3, మరో మూడు మినీ రైతు బజార్లు, పొన్నూరులో ఒకటి, మంగళగిరి, చిలకలూరిపేట, సత్తెనపల్లిలో రైతు బజార్లు ఉండగా ఒక్కో రైతు బజార్లో రోజుకు 30 నుంచి 100 క్వింటాళ్ల వరకు విక్రయాలు జరుగుతున్నాయి. రైతు బజార్లలో సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి.

అద్దెల భారంతో వెనుకంజ

గతంలో రైతుబజార్లలో నామమాత్రపు ధరలకు స్టాల్స్ కేటాయించేవారు. వైసీపీ హయాంలో డిమాండ్‌ను బట్టి ఒక్కో స్టాల్‌కు రూ.5 వేలకు పైబడి నెలవారీ అద్దె విధించారు. దీంతో రైతులు అంతంత అద్దెలు చెల్లించలేక వెనుకంజ వేశారు. ఈ కారణంగానే పొన్నూరులో 22 స్టాల్స్ ఉండగా 6 మాత్రమే నిర్వహణలో ఉన్నాయి. ఇదే పరిస్థితి అన్ని రైతుబజార్లలోనూ నెలకొంది. అద్దెలు చెల్లించలేక అధిక శాతం మంది రోడ్డు మార్జిన్లు, కూడళ్లలో కూరగాయలు విక్రయిస్తున్నారు. రైతుబజార్లలో ధరలు పెరగడానికి అద్దె పెంపు కూడా ఒక కారణమని తెలుస్తోంది.

సస్యరక్షణతో మేలైన మిరప నారు

నరసరావుపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం ఉప్పలపాడులో మిరప నారు పెంపకంపై ఉద్యానశాఖ అధికారులు రైతులకు మెళకువలు తెలియజేశారు. గ్రామంలోని షెడ్ నట్‌లో మిరప నారు పెంపకాన్ని వారు పరిశీలించారు. నారు పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. గుంటూరు లాం ఫాం మిరప శాస్త్రవేత్త డాక్టర్ సి.వెంకటరమణ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఐ.వెంకట్రావు యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.



మిరప నారును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎత్తైన మడులలో నారును పెంచుకోవాలి. ఎకరాకు సరిపడే నారు కోసం ఒక మీటరు వెడల్పు, 40 మీటర్ల పొడవు, 15 సెం.మీ ఎత్తు, చుట్టూ 30 సెం.మీ వెడల్పు గల కాల్వలు ఏర్పాటు చేసుకొని నారుమళ్లను సిద్ధం చేసుకోవాలి. సెంటు నారుమడికి సూటి రకాల విత్తనం 650 గ్రాములు లేదా హైబ్రిడ్ రకాలు అయితే 100 గ్రాముల విత్తనం వాడినట్లయితే ఎకరాకు సరిపడే నారు వస్తుంది. సెంటు నారుమడికి విత్తే ముందు 1.5 కిలోల భాస్వరం, కిలో వేప పిండి వేసుకోవాలి.

విత్తన శుద్ధి..

మిరపలో విత్తన శుద్ధి చాలా కీలకం. మిరపలో వైరస్ తెగులు నివారణకు 150 గ్రాముల ట్రై సోడియం ఆర్థోఫాస్ఫేట్‌ను లీటరు మంచి నీటిలో కరిగించాలి. దీనిలో విత్తనం 20 నిమిషాలు నానబెట్టి, అనంతరం కడిగి విత్తనాన్ని నీడలో ఆరనివ్వాలి. ఆ తర్వాత ఇదే విత్తనానికి రసం పీల్చే పురుగ నివారణకు (నల్లి తప్ప) ఇమిడాక్లోప్రిడ్ 8 గ్రాములు కిలో విత్తనానికి పట్టించాలి. తెగుళ్ల నివారణకు ఇదే విత్తనానికి 3 గ్రాముల మ్యాంకోజెబ్, చివరగా ట్రైకోడెర్మా విరిడి అనే శిలీంద్రం పొడిని 5-10 గ్రాములు కిలో విత్తనానికి పట్టించి నారుమడిని విత్తుకోవాలి.

సస్యరక్షణ చర్యలు

మొలక వచ్చిన వారం తర్వాత నారుకుళ్లు రాకుండా మెటలాక్సిల్ 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి లేదా రిడోమిల్ ఎంజడ్ 2 గ్రా 1 లీటర్ నీటికి కలుపుకొని వారం రోజుల వ్యవధిలో 3 సార్లు నారుమడిపై పిచికారి చేయాలి. రసం పీల్చు పురుగు లేదా ఆకుముడత తెగులు నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మీ.లీ. లేదా డైఫెన్ తురాన్ 1.5 గ్రాములు లీటర్ లో కలుపుకొని పిచికారి చేసుకోవాలి.

విత్తు సమయం..

ఖరీఫ్ పంటకు జులై - ఆగస్టు, రబీ పంటకు అక్టోబర్ - నవంబర్ విత్తనాలను విత్తుకోవచ్చు. సాధారణ రకాలకు 40 - 45 రోజుల వయస్సు గల నారు, హైబ్రీడ్ రకాలకు ఇప్పటి నుంచి 30-35 రోజుల వయస్సు గల నారు నాటడానికి అనువుగా ఉంటుంది.

నర్సరీ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నర్సరీ చట్టం- 2010 గురించి నర్సరీ యాజమానులకు జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు అవగాహన కల్పించారు. నర్సరీ చట్టం ప్రకారంగా జిల్లాలోని ప్రతి ఒక్క నర్సరీ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను, అదేవిధంగా ఉద్యాన అధికారుల వివరాలను వెల్లడించారు. ఎవరైనా నర్సరీ చట్టం అతిక్రమిస్తే.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఖరీఫ్ 2025-26 మిరప పంటకు ఇన్సూరెన్స్ కోసం ఎకరానికి రూ.360 ప్రీమియం చెల్లిస్తే రూ.90 వేల వరకు కవరేజ్ వరిస్తుంది. ఈ పథకానికి ఈ నెల 31 చివరి రోజు. మిరప పంట వేసే ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాల్సిందిగా జిల్లా ఉద్యానశాఖ అధికారి కోరారు.

ఒకే ఆధార్‌పై 150 విద్యుత్ మీటర్లు

- నాలుగేళ్లుగా ప్రభుత్వ పథకాలకు దూరం
- తొలగించాలని కోరినా.. పట్టించుకోని అధికారులు



ఫరీద్ సాయిబు, భార్య హుసేన్ బీ



అనుసంధానమైన మీటర్ల నంబర్లు

వినుకొండటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఆమె ఒక నిరు పేదరాలు. కూలీనాలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తల్లి ద్వారా సంక్రమించిన కొద్దిపాటి స్థలంలో చిన్న రేకుల షెడ్‌లో తల దాచుకుంటున్నారు. ఉన్న ఒక్క ఇంటికి 150 విద్యుత్ మీటర్లు ఉన్నాయని ఆ శాఖ అధికారులు నోటీసులు ఇవ్వడంతో కుటుంబ సభ్యులు కంగుతిన్నారు. వివరాలను పరిశీలిస్తే.. పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని హనమాన్ నగర్‌కు చెందిన షేక్ ఇట్లా పురం హుసేన్‌బీ తన తల్లి ద్వారా సంక్రమించిన స్థలంలో రేకులు వేసుకుని కాలం గడుపుతున్నారు. ఆ ఇంటికి 21011 నంబరుతో విద్యుత్ మీటర్ ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం హుసేన్‌బీ భర్త షేక్ ఇట్లాపురం ఫరీద్ సాయిబు పేరుతో ఉన్న ఆధార్ 218166 598432 నంబరుపై 150 విద్యుత్ మీటర్లు నమోదై ఉండడంతో వారు అవాక్కయ్యారు. వారికి ఇద్దరు సంతానం. మొదటి కుమార్తెకు అమ్మ ఒడి పథకం కోసం అధికారులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగిన ఫలితం లేక పోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. గత నాలుగు సంవత్సరాలుగా కరెంటు మీటర్లు గల ఇళ్లు చూపాలని, లేనిపక్షంలో తన ఆధార్ కార్డుపై నమోదైన 150 మీటర్లు తొలగించాలని పలుమార్లు అర్జీలు పెట్టుకున్నారు. అయినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదని ఆ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు తమ కుటుంబ సభ్యులకు లేని ఆ విద్యుత్ మీటర్ల వల్ల జరిగిన పొరపాటును సరిదిద్ది తమకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని వేడుకుంటున్నారు.

ఎత్తిపోతలను పట్టించుకోరా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బ్రహ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, నరేంద్ర కుమార్, ఎమ్మెల్సీలు ఆలపాటి, చంద్రగిరి, మర్రి రాజశేఖర్, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు

(5వ పేజీ తరువాయి)

పథకాలు మూలన పడినా పట్టించుకోక పోవడం దారుణమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి 20 గ్రామాలు ఖాళీ చేయిస్తారంటున్నారని బొల్లాపల్లి జడ్పీటీసీ రామావత్‌బీమీబాయి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగర్ కోసం భూములు త్యాగం చేశామని ఆవేదన చెందారు.

గ్రామాల్లోకి వచ్చిన కల్తీ విత్తనాలు

ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే గ్రామాల్లోకి కల్తీ విత్తనాలు వచ్చాయని రొంపిచర్ల జడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతురావుయాదవ్ తెలిపారు. కల్తీ విత్తనాలు, పురుగు మందుల కేసులకు సంబంధించి ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పడం లేదని ఎమ్మెల్సీ ఏసురత్నం ఆక్షేపించారు. నకిలీ విత్తనాలు, పురుగు మందుల కంపెనీల ఎండీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లాం ఫాంలోని శాస్త్రవేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి తెగుళ్ల సమస్యలకు పరిష్కారం చూపించడానికి వ్యవసాయ శాఖకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ ప్రశ్నించారు.

కౌలు రైతులకు కార్డులేవి..

కృష్ణా డెల్టాలో 80 శాతం మంది కౌలు రైతులు ఉండగా 46 వేల మంది మాత్రమే ఉన్నట్లు చెప్తున్న అధికారులు కేవలం 2600 మందికి మాత్రమే ఇప్పటి వరకు సీసీఆర్ కార్డులు ఇచ్చారని ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇలా అయితే కౌలు రైతుల ప్రయోజనాలు ఎలా కాపాడతారని ప్రశ్నించారు. కార్డుల ఈ-కేవైసీ నత్తనడకన సాగుతుందని పలువురు ధ్వజమెత్తారు. గుండెపోటు ఇంజక్షన్లు మాచర్లలో కూడా అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి కోరారు. నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు లేవని జడ్పీటీ సీ ఓబుల్‌రెడ్డి ఆరోపించారు. గారపాడులో రెండున్నర ఎకరాల చెరువు ఆక్రమించి ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేస్తున్నారని పెదకూరపాడు జడ్పీటీసీ స్వర్ణకుమారి ఆరోపించారు. అమరావతిలో రూ.8 కోట్ల జడ్పీ స్థలం ఆక్రమణకు గురైందని కో-ఆప్షన్ మెంబర్ షేక్ సర్దార్ హష్మీ తెలిపారు.


చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలిసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37,945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
DIL RAJU PRODUCTION
BLOCKBUSTER PROMISE
NITHIIN
తమ్ముడు
SRIRAM VENU
RAJU SHIRISH
K V GUHAN B.AJANEESH LOKNATH SH.PRAWIN PUDI G M SEKHAR


KRIA FILM CORP
DHAMMA PRODUCTIONS
POWER STAR FOR VIKRANTH IPS
TRAILER LAUNCH BY SHRI PAWAN KALYAN GARU
ON JULY 5TH
RK SAGAR AS VIKRANTH IPS
THE 100
RELEASE ON 11TH JULY 2025 IN THEATERS


SMT. VEENADHARI
BABY NEHA SRI PRESENTS
SOULFUL ENTERTAINER
SOLO BOY
PRODUCED BY SEVENHILLS SATISH DIRECTED BY P.NAVEEN KUMAR
IN CINEMAS NOW


SUPER DUPER HIT
తప్పక చూడండి !
జురాసిక్ వరల్డ్
IN CINEMAS NOW SHOWING
RELEASING IN ENGLISH, HINDI, TAMIL AND TELUGU IN 3D


UNANIMOUS MEGA BLOCKBUSTER
RUNNING SUCCESSFULLY
3RD WEEK
SEKHAR KAMMULA'S
కుబేర

బిజినెస్

గుంటూరు ● శనివారం 5 జూలై 2025

2 ఏళ్లలో రూ. 36,671 కోట్ల అక్రమార్జన

- డెరివేటివ్ ట్రేడింగ్‌లో అమెరికా సంస్థ జేన్ స్ట్రీట్ మాయాజాలం
- సెక్యూరిటీ మార్కెట్ నుంచి కంపెనీని నిషేధించిన సెబీ
- రూ.4,843 కోట్ల అక్రమ లాభాలు తిరిగి చెల్లించాలని ఆదేశం



4 కంపెనీల ద్వారా భారత్‌లో ట్రేడింగ్ కార్యకలాపాలు

అంతర్జాతీయ ట్రేడింగ్ కంపెనీ అయిన జేన్ స్ట్రీట్ గ్రూప్ ఎల్ఎల్‌సీ 2000 సంవత్సరంలో ఏర్పాటైంది. అల్గో ట్రేడింగ్, హై ఫ్రీక్వెన్సీ ట్రేడింగ్ సామర్థ్యాలను కలిగి ఉన్న ఈ గ్రూప్‌నకు చెందిన అమెరికా, యూరప్, ఆసియాలోని ఐదు కార్యాలయాల్లో 2,600 మందికి పైగా పనిచేస్తున్నారు. 45 దేశాల్లో ట్రేడింగ్ కార్యకలాపాలు నెరుపుతోంది గ్రూప్. గ్రూప్‌నకు చెందిన 4 కంపెనీలు భారత మార్కెట్లో ట్రేడింగ్ కార్యకలాపాలు జరుపుతున్నాయి. అందులో జేఎస్ఐ ఇన్వెస్ట్‌మెంట్స్ ముంబై కేంద్రంగా 2020 డిసెంబరులో ఏర్పాటైంది. జేఎస్ఐ ఇన్వెస్ట్‌మెంట్స్ అనుబంధ విభాగమైన జేఎస్ఐ2 ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా ముంబై కేంద్రంగా 2024 సెప్టెంబరులో ప్రారంభమైంది. జేన్ స్ట్రీట్ సింగపూర్, జేన్ స్ట్రీట్ ఏషియా సింగపూర్, హాంకాంగ్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. మన మార్కెట్లో సెబీ నమోదిత విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)గా ట్రేడింగ్ సాగిస్తున్నాయి.

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మరో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన జేన్ స్ట్రీట్ గ్రూప్ మన మార్కెట్ వ్యవస్థను తెలివిగా బురిడీ కొట్టించి వేల కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించిందని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గుర్తించింది. అందుకు గాను, జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధించిన సెబీ.. రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను తిరిగి చెల్లించాలని ఆదేశించింది. ఇప్పటివరకు మార్కెట్ సంస్థ నుంచి సెబీ జప్తు చేసుకోనున్న అతిపెద్ద మొత్తమిదే.

రెండు వ్యూహాలతో మోసం

అధిక లావాదేవీలు జరిగే బ్యాంక్ నిఫ్టీ, నిఫ్టీ సూచీల స్థాయిలను కృత్రిమంగా పెంచడం లేదా తగ్గించడం ద్వారా జేన్ స్ట్రీట్ గ్రూప్ ఈ భారీ మోసానికి పాల్పడిందని సెబీ గుర్తించింది. ప్రధానంగా ఈ రెండు సూచీ ఆప్షన్స్ ట్రేడింగ్ ద్వారా రూ.36,671 కోట్లు పోగేసింది. 2023 జనవరి నుంచి 2025 మార్చి మధ్య కాలంలో డెరివేటివ్ కాంట్రాక్టులకు సంబంధించి 21 ఎక్స్‌పైరీ (గడువు) తేదీల్లో ఈ గ్రూప్ తన చేతి వాటాన్ని ప్రదర్శించిందని నియంత్రణ మండలి దర్యాప్తులో వెల్లడైంది. ఆ గడువు తేదీల్లో సూచీల గమనాన్ని ప్రభావితం చేసి ఆప్షన్స్ మార్కెట్లో పొజిషన్ల ద్వారా భారీగా గడించేందుకు ఈ గ్రూప్ కంపెనీలు క్యాష్, ఫ్యూచర్స్ మార్కెట్లో భారీ ఎత్తున లావాదేవీలు నెరిపాయంటోంది. ఇందుకోసం జేన్ స్ట్రీట్ రెండు వ్యూహాలను ఎంచుకుంది. 1. ఇంట్రాడే ఇండెక్స్ మ్యానిపులేషన్ స్ట్రాటజీ. 2. మార్కింగ్ ది క్లోజింగ్ స్ట్రాటజీ.

ఇంట్రాడే ఇండెక్స్ మ్యానిపులేషన్ స్ట్రాటజీ

ఉదయం సెషన్‌లో బ్యాంక్ నిఫ్టీ సూచీ నమోదిత షేర్లు, వాటి ఫ్యూచర్స్‌లో పెద్దఎత్తున కొనుగోళ్లు జరపడం ద్వారా కృత్రిమంగా వాటి ధరలతోపాటు వాటికి గిరాకీ పెంచడం. ఉదయం కొనుగోలు చేసిన షేర్లు, ఫ్యూచర్స్‌లో మధ్యాహ్నం సెషన్ నుంచి ఉన్నపళంగా అమ్మకాలకు పాల్పడటం ద్వారా వాటి ధరలను ఒక్కసారిగా తగ్గించడం చేసింది. తద్వారా జేన్ స్ట్రీట్ అప్పటికే తీసుకున్న ఇండెక్స్ ఆప్షన్స్ పొజిషన్ల ద్వారా భారీగా లాభం గడించింది.

మార్కింగ్ ది క్లోజింగ్ స్ట్రాటజీ

డెరివేటివ్ కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ తేదీ నాడు చివరి రెండు గంటల ట్రేడింగ్‌లో పెద్దఎత్తున కొనుగోలు లేదా విక్రయం ద్వారా సూచీల గమనాన్ని ఒక్కసారిగా మార్చడం ద్వారా జేన్ స్ట్రీట్ షార్ట్ కాల్ లేదా లాంగ్ పుట్ పొజిషన్ల ద్వారా లబ్ధి పొందినట్లు సెబీ గుర్తించింది.

ఇండెక్స్ ఆప్షన్స్‌లో రూ.44,358 కోట్ల లాభం

పై రెండు వ్యూహాలను అనుసరించి జేన్ స్ట్రీట్.. ఇండెక్స్ ఆప్షన్ ట్రేడింగ్ ద్వారా రెండేళ్లకు పైగా కాలంలో రూ.44,358 కోట్లు ఆర్జించింది. ఇంత భారీ స్థాయిలో గడించేందుకు స్టాక్స్ ఫ్యూచర్స్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ.191 కోట్లు, క్యాష్ మార్కెట్లో రూ.288 కోట్లు నష్టపోవాల్సి వచ్చింది. అంటే, నికరంగా రూ.36,671 కోట్లు గడించింది.

కొనసాగుతున్న సెబీ దర్యాప్తు

జేన్ స్ట్రీట్‌పై దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సెబీకి ఇప్పటివరకు 18 గడువు రోజుల్లో బ్యాంక్ నిఫ్టీ, 3 గడువు రోజుల్లో నిఫ్టీ సూచీలో గ్రూప్ కంపెనీలు అనైతిక ట్రేడింగ్ కార్యకలాపాలకు పాల్పడినట్లు ఆధారాలు లభించాయి. ఇతర గడువు రోజుల్లో, ఇతర సూచీల్లో, ఇతర ఎక్స్ఛేంజ్‌ల్లోనూ జేన్ స్ట్రీట్ అనైతిక ట్రేడింగ్‌కు పాల్పడిందా అన్న కోణంలోనూ సెబీ దర్యాప్తు సాగించనుందన్నారు. ఇప్పటివరకు గుర్తించిన రెండింటితోపాటు ఇంకేమైనా ట్రేడింగ్ వ్యూహాలను అనుసరించిందా అని కూడా నియంత్రణ మండలి విచారించనుందన్నారు.

సెబీ చేపట్టిన చర్యలివి..

శుక్రవారం జారీ చేసిన తాత్కాలిక ఉత్తర్వుల ప్రకారం.. జేన్‌స్ట్రీట్ గ్రూప్‌నకు చెందిన జేఎస్ఐ (జేన్ స్ట్రీట్ ఇండియా) ఇన్వెస్ట్‌మెంట్స్, జేఎస్ఐ2 ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ సింగపూర్ పీటీఈ లిమిటెడ్, జేన్ స్ట్రీట్ ఏషియా ట్రేడింగ్ సంస్థలను సెక్యూరిటీస్ మార్కెట్ లావాదేవీల నుంచి తదుపరి ఆదేశాలిచ్చే వరకు నిషేధం విధించింది. అలాగే, ఈ కంపెనీలపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ నిషేధ కాలంలో జేన్ స్ట్రీట్ కంపెనీలు మన మార్కెట్లో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా షేర్ల కొనుగోలు, విక్రయాలు లేదా ఇతర కార్యకలాపాలకు నెరిపేందుకు వీలుండదు.

- డెరివేటివ్ ట్రేడింగ్‌లో వ్యవస్థాగత అక్రమాలకు పాల్పడటం ద్వారా ఆర్జించిన రూ.4,843.57 కోట్ల అయాచిత లాభాలను తిరిగి చెల్లించాలని ఆదేశం. జేన్ స్ట్రీట్ ఈ మొత్తాన్ని సెబీ ఎస్క్రో ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. అప్పటివరకు కంపెనీలు భారత్‌లోని తమ ఆస్తులను విక్రయించేందుకు కూడా వీల్లేకుండా సెబీ ఆంక్షలు విధించింది.
- జేన్ స్ట్రీట్ కంపెనీల బ్యాంక్ ఖాతాలు, డీమ్యాట్ అకౌంట్లు, కస్టోడియల్ అకౌంట్లను సెబీ స్తంభింపజేసింది. అంటే, సెబీ అనుమతి లేకుండా ఈ ఖాతాల్లోంచి సొమ్ము ఉపసంహరణకు వీలుండదు.
- భవిష్యత్‌లో జేన్ స్ట్రీట్ కంపెనీల కార్యకలాపాలను నిశితంగా గమనించాలని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లను నియంత్రణ మండలి నిర్దేశించింది.

ఇలా బయటపడింది..

మిలీనియం మేనేజ్‌మెంట్‌తో జేన్ స్ట్రీట్ వివాదంపై 2024 ఏప్రిల్‌లో మీడియాలో కథనాలు వచ్చాయి. అనైతిక ట్రేడింగ్ వ్యూహం ద్వారా జేన్ స్ట్రీట్ భారత డెరివేటివ్ మార్కెట్ నుంచి 100 కోట్ల డాలర్లు ఆర్జించిందని మిలీనియం మేనేజ్‌మెంట్ ఆరోపించింది. ఆ కథనం ఆధారంగానే సెబీ జేన్‌స్ట్రీట్ గ్రూప్‌పై దర్యాప్తు ప్రారంభించింది.

ఒక్కరోజే రూ.735 కోట్ల లాభం

గత ఏడాది జనవరి 17న జేన్ స్ట్రీట్ ఇంట్రాడేలో సూచీ గతిని ఒక్కసారిగా మార్చడం ద్వారా ఏకంగా రూ.750 కోట్ల లాభం ఆర్జించిందట. దలాల్‌స్ట్రీట్‌లో ఈ గ్రూప్‌నకు ఇదే అతిపెద్ద ఒక్కరోజు లాభమని సెబీ దర్యాప్తులో తేలింది.

ఫినిక్స్ ట్రైటాన్‌లో అర్థ గ్లోబల్ రూ.700 కోట్ల పెట్టుబడులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని ఫినిక్స్ ట్రైటాన్ కమర్షియల్ రియల్టీ ప్రాజెక్ట్‌లో రూ.700 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు అర్థ గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్ వెల్లడించింది. ఫినిక్స్ ఈ నిధులను ప్రాజెక్ట్ పూర్తి చేయటానికి వినియోగించనుంది. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ కేంద్రంగా పని చేస్తున్న రూ.5,000 కోట్ల కేటగిరీ 3 ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్) అయిన అర్థ గ్లోబల్ దేశంలో పెట్టిన తొలి పెట్టుబడి ఇది. హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 3.15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న 28 లక్షల చదరపు అడుగుల ఈ ప్రాజెక్టుకు నాలుగేళ్ల కాలపరిమితి గల నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) రూపంలో ఈ నిధులు అందించింది. నేరుగా ప్రాజెక్టు అమ్మకాలతో అనుసంధానమైన వేరియబుల్ రిటర్న్ నమూనాలో ఈ పెట్టుబడి ఉంటుంది. దీనివల్ల డెవలపర్‌పై నగదుపరమైన ఒత్తిడులుండవు. ఇన్వెస్టర్లకు కూడా ఆకర్షణీయమైన రాబడి లభిస్తుందని అర్థ భారత్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ సచిన్ సావ్రికర్ అన్నారు.

వచ్చే రెండేళ్లలో రూ.75 కోట్ల పెట్టుబడులు

పీవీఆర్ ఐనాక్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే రెండేళ్లలో తెలంగాణలో రూ.75 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పీవీఆర్ ఐనాక్స్ ప్రకటించింది. శుక్రవారం నాడిక్కడ హఫీజ్‌పేట్‌లో సరికొత్త 4 స్ర్కీన్స్ మల్టీప్లెక్స్ థియేటర్‌ను ప్రారంభించిన సందర్భంగా కంపెనీ సీఓఓ రోహన్ సాబ్లే మాట్లాడుతూ.. కార్యకలాపాల విస్తరణలో భాగంగా రానున్న రెండేళ్లలో ప్రతిపాదిత పెట్టుబడులతో మరో ఐదు మల్టీప్లెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ మల్టీప్లెక్స్‌తో 20 కొత్త స్ర్కీన్స్ అందుబాటులోకి రానున్నాయన్నారు. అంతేకాకుండా కొత్తగా 400 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దీంతో తెలంగాణలో మొత్తం ఉద్యోగాల సంఖ్య 1,700కు చేరుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం దక్షిణాది రీజియన్‌లో పీవీఆర్ ఐనాక్స్ 565 స్ర్కీన్స్‌ను నిర్వహిస్తుండగా అందులో 106 స్ర్కీన్స్ హైదరాబాద్‌లోనే ఉన్నాయన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	97
వరంగల్	95	గుంటూరు	102
కరీంనగర్	95	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	97
కర్నూలు	95	నెల్లూరు	102
విశాఖపట్నం	83	అనంతపురం	102
గోదావరి	97		

ఒడుదుడుకుల్లోనూ లాభాలొచ్చాయ్..

193 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, చివర్లో బ్యాంకింగ్ సహా ఇతర బ్లూచిప్ షేర్లలో కొనుగోళ్లతో లాభాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 193.42 పాయింట్ల వృద్ధితో 83,432.89 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 83,477.86 వద్ద గరిష్ఠాన్ని, 83,015.83 వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసిన సూచీ.. రోజంతా 462 పాయింట్ల శ్రేణిలో ఊగిసలాడింది. నిఫ్టీ విషయానికొస్తే, 55.70 పాయింట్ల లాభంతో 25,461 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 రాణించగా.. బజాజ్ ఫైనాన్స్ 1.60 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

బ్రోకరేజీ షేర్లు డౌన్

జేన్ స్ట్రీట్ వివాదం నేపథ్యంలో స్టాక్ బ్రోకింగ్, ఎక్స్ఛేంజ్‌లు, డిపాజిటరీ సంస్థల షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రోకరేజీ సేవల కంపెనీల్లో నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ స్టాక్ 11.26 శాతం క్షీణించగా.. ఏంజిల్ వన్ 5.94 శాతం నష్టపోయింది. స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈ షేరు సైతం 6.42 శాతం పతనమైంది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సీడీఎస్ఎల్) స్టాక్ 2.29 శాతం నష్టపోయింది.

సరుకు రవాణాలో అదానీ కృష్ణపట్నం పోర్ట్ రికార్డు

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ జూన్‌లో అత్యధికంగా 5.85 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో వాల్యూమ్‌ను నమోదు చేయడం ద్వారా కొత్త మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా ఆ పోర్టు సీఈవో జగదీష్ పటేల్ మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి అవిశ్రాంత కృషి, సమన్వయంతోపాటు అచంచలమైన అంకిత భావానికి నిదర్శనమన్నారు. దీన్ని సాధ్యం చేసినందుకు తమ ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు, కస్టమర్లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ స్థాయి పనితీరుతో అదానీ కృష్ణపట్నం పోర్ట్ భారత తూర్పు తీరంలో ప్రముఖ లాజిస్టిక్స్, కార్గో హబ్‌గా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుందన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	570
వరంగల్	562	గోదావరి	535
చిత్తూరు	633	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ. 78	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,730 ▼	90,500 ▼	1,20,000 ▼
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,09,000 ▼
విశాఖపట్నం	99,990 ▲	90,500 ▼	1,20,000 ▼
రాజమండ్రి	98,730 ▼	90,500 ▼	1,10,700 ▼
ప్రొద్దుటూరు	97,400 ▼	89,610 ▼	1,08,300 ▲
ముంబై	97,021 ▼	88 ,871 ▼	1,07,580 ▼

స్పోర్ట్స్

ఈసారి కీస్ వంతు..

వింబుల్డన్

- మూడో రౌండ్‌లో అవుట్
- ఒసాకా కూడా..
- అల్కారజ్ ముందంజ

లండన్: వింబుల్డన్ ఆరంభంనుంచి రోజుకో సీడెడ్‌కు చుక్కెదురవుతోంది. ఐదో రోజు..ఆరో సీడ్ మాడిసన్ కీస్ ఇంటిబాట పట్టింది. ఆమెతోపాటు నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ నవోమి ఒసాకాకు కూడా మూడో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. అలాగే పురుషుల నాలుగో సీడ్ జాక్ డ్రేపర్‌కూ ఓటమి తప్పలేదు. రెండో సీడ్ అల్కారజ్, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో లారా సీగ్మండ్ 6-3, 6-3తో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కీస్‌కు షాకిచ్చింది. మరో మ్యాచ్‌లో పల్యుచెన్కోవా 3-6, 6-4, 6-4తో ఒసాకాను చిత్తు చేసి నాలుగో రౌండ్‌కు చేరింది. 13వ సీడ్ అనిసిమోవా 6-3, 5-7, 6-3తో దల్మా గాల్ఫిపై మూడో రౌండ్‌లో నెగ్గింది. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్ 6-1, 3-6, 6-3, 6-4తో స్ట్రఫ్‌పై, 5వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 6-4, 6-3, 6-7 (7), 6-1తో 26వ సీడ్ డవిడోవిచ్‌పై, 14వ సీడ్ రుబ్లేవ్ 7-5, 6-2, 6-3తో మన్నారినోపై గెలుపొందారు. ఇక గురువారం అర్ధరాత్రి జరిగిన రెండో రౌండ్‌లో టైటిల్ ఫేవరెట్ సినర్ 6-1, 6-1, 6-3తో ఊకిక్‌ని వరుస సెట్లలో ఓడించాడు. మరో మ్యాచ్‌లో వెటరన్ మారిన్ సిలిచ్ 6-4, 6-3, 1-6, 6-4తో నాలుగో సీడ్ డ్రేపర్‌ను తిరుగుముఖం పట్టించాడు. 10వ సీడ్ బెన్ షెల్టన్ 6-2, 7-5, 6-4తో హిజికటాపై నెగ్గి మూడో రౌండ్‌కు చేరాడు.

మూడో రౌండ్‌లో భాంబ్రీ జోడీ: యుకీ భాంబ్రీ/జియాంగ్ జిన్‌యు (చైనా) ద్వయం మిక్స్‌డ్ డబుల్స్ మూడో రౌండ్‌కు చేరింది. రెండో రౌండ్‌లో భాంబ్రీ/జియాంగ్ జంట 6-3, 1-6, 7-6 (6)తో నికోల్/క్రిస్టియన్ అమెరికా జోడీపై నెగ్గి ముందంజ వేసింది.



లారా సీగ్మండ్

భవాని డబుల్ ధమాకా



ఒలోమాక్ (చెక్ రిపబ్లిక్): ప్రపంచ పారా అథ్లెటిక్స్ మహిళల గ్రాండ్ ప్రీలో ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెట్ వి.భవాని రెండు స్వర్ణాలు కొల్లగొట్టి సంచలనం సృష్టించింది. చెక్ రిపబ్లిక్‌లోని ఒలోమౌక్‌లో జరుగుతున్న ఈ పోటీల్లో భవాని 100, 200 మీటర్ల స్ప్రింట్‌లో పసిడి పతకాలు సాధించింది. టీ46 విభాగంలో 100 మీ., రేసును 13.70 సెకన్లలో, 200 మీ., రేసును 29.07 సెకన్లలో ముగించి ప్రథమ స్థానం దక్కించుకుంది. భవాని స్వస్థలం నెల్లూరు.

విండీస్ 185/7

సెయింట్ జార్జ్: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో వెస్టిండీస్ రెండో రోజైన శుక్రవారం టీ విరామానికి 7 వికెట్లకు 185 పరుగులు చేసింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు కరీబియన్ జట్టు మరో 101 పరుగుల వెనుకంజలో ఉంది. బ్రెండన్ కింగ్ 75 రన్స్ చేశాడు. క్రీజులో షమర్ జోసెఫ్ (6), అల్జారీ జోసెఫ్ (9) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో హాజెల్‌వుడ్, కమిన్స్, లియోన్ తలో రెండు వికెట్లు సాధించారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో కంగారూ జట్టు 286కు ఆలౌటైంది. అలెక్స్ క్యారీ 63, వెబ్‌స్టర్ 60 పరుగులు చేశారు. అల్జారీ జోసెఫ్‌కు 4 వికెట్లు లభించాయి.

జావెలిన్ విప్లవానికి నాంది..

నీరజ్ చోప్రా
బెంగళూరులో నేడు క్లాసిక్ ఈవెంట్



సా. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

బెంగళూరు: తన పేరిట శనివారం ఇక్కడ జరుగనున్న క్లాసిక్ ఈవెంట్ దేశంలో జావెలిన్ త్రో విప్లవానికి నాంది పలకగలదన్న ఆశాభావాన్ని నీరజ్ వ్యక్తంచేశాడు. ఇక్కడి కంఠీరవ స్టేడియంలో ఈ పోటీ జరగనుంది. భవిష్యత్ భారత జావెలిన్ త్రోయర్లలో ఈ టోర్నీ స్ఫూర్తి నింపుతుందని నమ్ముతున్నాడు. నీరజ్‌తోపాటు మరో ఇద్దరు ఒలింపిక్ పతక విజేతలు థామస్ రోలెర్, జూలియస్ ఎగో పోటీ బరిలో దిగుతున్నారు. భారత్ నుంచి చోప్రాతోపాటు రోహిత్ యాదవ్, సాహిల్ సిల్వాల్, జస్వీర్ సింగ్ తలపడుతున్నారు. మొత్తం 12 మంది త్రోయర్లు ఈ ఈవెంట్ బరిలో నిలిచారు.

అగ్రస్థానంలో గుకేష్

జాగ్రెబ్ (క్రొయేషియా): గ్రాండ్ చెస్ టూర్ ర్యాపిడ్ విభాగంలో గుకేష్ హవా కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన 7, 8 రౌండ్లను గుకేష్ డ్రా చేసుకొని 12 పాయింట్లతో టాప్‌లో కొన సాగుతున్నాడు. జీఎంలు అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో ఆడి న ఏడో రౌండ్‌ను, సరిక్ ఇవాన్ (క్రొయేషియా)తో జరిగిన ఎనిమిదో రౌండ్‌ను గుకేష్ డ్రా చేసుకున్నాడు.

బంగ్లాదేశ్‌లో భారత పర్యటన లేనట్టే!

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో భారత క్రికెట్ జట్టు పర్యటన రద్దు కానుంది. ఆ దేశంలో ఏడాది కాలంగా కొనసాగుతున్న రాజకీయ అనిశ్చితి నేపథ్యంలో టీమిండియా పర్యటన దాదాపు లేనట్టేనని బీసీసీఐ అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు. ఆగస్టు 17 నుంచి 31 వరకు జరగాల్సిన ఈ పర్యటనలో భారత్-బంగ్లాదేశ్ మూడు టీ20లు, మూడు వన్డేల్లో తలపడాల్సి ఉంది. అయితే బంగ్లాదేశ్‌లో ఆడే మ్యాచ్‌ల ద్వారా లభించే పాయింట్లు వన్డే ప్రపంచ కప్‌నకు అర్హత సాధించేందుకు కీలకం కావడంతో .భారత పర్యటన పూర్తిగా రద్దు కావడంలేదు. వచ్చే ఏడాది ఈ టూర్ జరిగే అవకాశముందని ఆయన వివరించారు.

ఇంగ్లండ్ పోరాడినా.. భారత్‌దే ఆధిక్యం

స్మిత్, బ్రూక్ భారీ శతకాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 407

భారత్ రెండో ఇన్నింగ్స్ 64/1

గిల్ తలకు బలంగా..

మూడో రోజు తొలి సెషన్‌లో కెప్టెన్ గిల్ తలకు బంతి బలంగా తాకడం ఆందోళన కలిగించింది. జడేజా ఓవర్‌లో హ్యారీ బ్రూక్ ఆడిన బంతి తొలి స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న గిల్ వైపు వెళ్లింది. దీన్ని అందుకోవడంలో తను కాస్త ఆలస్యంగా స్పందించగా ఆ బంతి అతడి తలకు తాకి పైకి లేచింది. వెంటనే నొప్పితో విలవిల్లాడిన గిల్‌ను ముందుగా కీపర్ పంత్ వచ్చి పరిశీలించాడు. ఆ తర్వాత ఫిజియో వచ్చి చికిత్స అందించడంతో గిల్ తిరిగి ఫీల్డింగ్ కొనసాగించడం ఊరటనిచ్చింది.

148 ఏళ్ల టెస్టు చరిత్రలోనే అత్యంత చెత్త బౌలింగ్ (618 బంతుల్లో 5.14 ఎకానమీ)ను నమోదు చేసిన పేసర్ ప్రసిద్ధ్.

1 భారత్ తరఫున వేగంగా (40 ఇన్నింగ్స్) 2 వేల టెస్టు పరుగులు సాధించి ద్రవిడ్, సెహ్వాగ్‌ల సరసన చేరిన జైస్వాల్.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఆరుగురు డకౌట్లు కావడం ఇదే తొలిసారి.

టెస్టుల్లో 300+ భాగస్వామ్యం నమోదైనా తక్కువ స్కోరు (407)కే ఆలౌటైన జట్టుగా ఇంగ్లండ్

బెన్ స్టోక్స్ ఆడిన 113 టెస్టుల్లో తొలి బంతికే వెనుదిరగడం ఇదే తొలిసారి. సిరాజ్ ఈ వికెట్ తీశాడు.

3 టెస్టుల్లో వంద పరుగుల్లోపే ఐదు వికెట్లు కోల్పోయినా ఓ జట్టు (ఇంగ్లండ్) ఆరో వికెట్‌కు 300+ పరుగులు (ఇంగ్లండ్) జత చేర్చడం ఇది మూడో సారి మాత్రమే.



సిరాజ్‌కు ఆరు వికెట్లు

సిరాజ్ (6/70)

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టును టీమిండియా శాసించే దిశగా సాగుతోంది. ప్రస్తుతం గిల్ సేన 244 పరుగుల స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. శనివారం ఆటలో వేగంగా ఆడి భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచితే మ్యాచ్ ఫలితాన్ని ఆశించవచ్చు. అయితే మూడో రోజు శుక్రవారం రెండు సెషన్లపాటు ఇంగ్లండ్ జట్టే ఆధిపత్యం చూపింది. ఓ దశలో 84/5తో ఇబ్బందుల్లో పడిన ఇంగ్లండ్‌ను జేమీ స్మిత్ (184 నాటౌట్), హ్యారీ బ్రూక్ (158) అసాధారణ ఇన్నింగ్స్‌తో గట్టెక్కించే ప్రయత్నం చేశారు. ఆరో వికెట్‌కు ఈ జోడీ 303 పరుగులను జత చేయడం విశేషం. అయితే చివరి సెషన్‌లో పేసర్లు సిరాజ్ (6/70), ఆకాశ్ (4/88) దెబ్బతీయడంతో ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 407 పరుగులకు ఆలౌటైంది. అనంతరం 180 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ ఆట ముగిసే సమయానికి 13 ఓవర్లలో వికెట్ నష్టానికి 64 పరుగులతో ఆడుతోంది. జైస్వాల్ (28) వేగంగా ఆడగా, క్రీజులో రాహుల్ (28 బ్యాటింగ్), కరుణ్ (7 బ్యాటింగ్) ఉన్నారు.

స్మిత్ మెరుపు శతకం: 77/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ ఆరంభంలోనే మరో రెండు వికెట్లు కోల్పోయింది. పేసర్ సిరాజ్ వరుస బంతుల్లో రూట్ (22), కెప్టెన్ స్టోక్స్ (0)లను అవుట్ చేయడంతో ఆతిథ్య జట్టు 84/5 స్కోరుతో దయనీయ స్థితిలో నిలిచింది. కానీ జేమీ స్మిత్ ఎదురుదాడిని భారత బౌలర్లు ఊహించలేదు. వన్డే తరహాలో అతడు బ్యాట్ ఝుళిపించడంతో పరుగుల వరద పారింది. అయితే పేసర్ ప్రసిద్ధ్ షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బందిపెట్టాలని చూశాడు. కానీ స్మిత్ ధాటికి అతడి వ్యూహం పని చేయలేదు. పైగా అతడి ఓవర్‌లోనే 4,6,4,4,4తో 23 పరుగులు రాబట్టాడు. అటు స్పిన్నర్లు జడేజా, సుందర్‌లను సైతం స్మిత్ వదలకుండా బౌండరీలతో జోరును చూపాడు. ఈ బాదుడుకు లంచ్ బ్రేక్‌కు కాస్త ముందుగానే 80 బంతుల్లోనే కెరీర్‌లో రెండో శతకం కూడా పూర్తి చేశాడు. అటు చక్కటి సహకారం అందించిన బ్రూక్ 91 పరుగులు సాధించగా, తొలి సెషన్‌లో ఇంగ్లండ్ 27 ఓవర్లలో ఏకంగా 172 పరుగులు రాబట్టింది.



బ్రూక్ (158)



స్మిత్ (184 నాటౌట్)

వికెట్ లేకుండానే..: రెండో సెషన్‌లోనూ స్మిత్-బ్రూక్ జోడీని విడదీసేందుకు భారత బౌలర్లు చెమటోడ్చినా ఫలితం లేకపోయింది. ఇక తొలి టెస్టులో 99 పరుగుల వద్ద వెనుదిరిగిన హ్యారీ బ్రూక్ ఈసారి ఎలాంటి పొరపాటూ చేయలేదు. తన తొమ్మిదో శతకాన్ని పూర్తి చేశాడు. మరోవైపు నితీశ్ ఓవర్‌లో స్మిత్ క్లిష్టమైన క్యాచ్‌ను పంత్ డైవ్ చేసి పట్టాలనుకున్నా బంతి అందలేదు. ఈ సెషన్‌లో భారత్‌కు దక్కిన అవకాశం ఇదొక్కటే. ఇద్దరూ చెత్త బంతుల కోసం ఓపిగ్గా ఎదురుచూసి బౌండరీలు రాబట్టారు. చివరకు 355/5 స్కోరుతో ఇంగ్లండ్ టీ బ్రేక్‌కు వెళ్లగా.. అప్పటికి స్మిత్-బ్రూక్ జోడీ ఆరో వికెట్‌కు అజేయంగా 271 పరుగులు అందించింది. మొత్తంగా ఈ సెషన్‌లో జట్టు 28 ఓవర్లలో 106 పరుగులు సాధించింది.

కొత్త బంతితో..: వికెట్ల కోసం ఎదురుచూస్తున్న భారత్‌కు చివరి సెషన్ అవకాశం కల్పించింది. కొత్త బంతితో పేసర్లు ఆకాశ్, సిరాజ్ చెలరేగడంతో ఎదురుచూపులు ఫలించాయి. ముందుగా బ్రూక్‌ను ఆకాశ్ బౌల్డ్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 303 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే వోక్స్ (5)ను ఆకాశ్.. కార్స్ (0)ను సిరాజ్ వరుస ఓవర్లలో అవుట్ చేశారు. ఓవైపు స్మిత్ క్రీజులో నిలిచినా మరో ఎండ్‌లో మిగిలిన ఇద్దరినీ సిరాజ్ అవుట్ చేసి 6 వికెట్లతో అదుర్స్ అనిపించాడు.

1 తొలి సెషన్‌లోనే శతకం చేసిన ఇంగ్లండ్ బ్యాటర్‌గా జేమీ స్మిత్. అలాగే భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్టుల్లో ఫాస్టెస్ట్ (80 బంతుల్లో) శతకం బాదిన బ్యాటర్‌గానూ నిలిచాడు. ఈక్రమంలో తను కపిల్ దేవ్ (86 బంతుల్లో)ను అధిగమించాడు. ఇక టెస్టుల్లో అత్యధిక స్కోరు (184 నాటౌట్) సాధించిన ఇంగ్లండ్ కీపర్‌గా స్టీవార్ట్ (173)ను అధిగమించాడు. అలాగే ఈ జట్టు తరఫున ఏడు అంతకంటే దిగువ బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎక్కువ పరుగులు సాధించిన బ్యాటర్‌గా రంజిత్ సింగ్ (1897లో 175 పరుగులు) రికార్డును బ్రేక్ చేశాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) కరుణ్ (బి) సిరాజ్ 19; డకెట్ (సి) గిల్ (బి) ఆకాశ్ 0; పోప్ (సి) రాహుల్ (బి) ఆకాశ్ 0; రూట్ (సి) పంత్ (బి) సిరాజ్ 22; బ్రూక్ (బి) ఆకాశ్ 158; స్టోక్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 0; స్మిత్ (నాటౌట్) 184; వోక్స్ (సి) కరుణ్ (బి) ఆకాశ్ 5; కార్స్ (ఎల్బీ) సిరాజ్ 0; టంగ్ (ఎల్బీ) సిరాజ్ 0; బషీర్ (బి) సిరాజ్ 0; **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 89.3 ఓవర్లలో 407 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-13, 2-13, 3-25, 4-84, 5-84, 6-387, 7-395, 8-396, 9-407, 10-407; **బౌలింగ్:** ఆకాశ్ 20-2-88-4; సిరాజ్ 19.3-3-70-6; ప్రసిద్ధ్ 13-1-72-0; నితీశ్ కుమార్ 6-0-29-0; జడేజా 17-2-70-0; సుందర్ 14-0-73-0.

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) టంగ్ 28; రాహుల్ (బ్యాటింగ్) 28; కరుణ్ (బ్యాటింగ్) 7; **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 13 ఓవర్లలో 64/1. వికెట్ పతనం:** 1-51; **బౌలింగ్:** వోక్స్ 5-0-28-0; కార్స్ 5-1-23-0; టంగ్ 3-1-12-1.



నైపుణ్యాభివృద్ధి, ఇంటర్ విద్యపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న లోకేశ్

ప్రజల్లోకి మిషన్ మోడ్‌తో నైపుణ్యం పోర్టల్

- యువత, పరిశ్రమలను అనుసంధానిచేలా అభివృద్ధి
- ఆగస్టు 7 నుంచి అక్షర ఆంధ్ర: మంత్రి లోకేశ్
- ఐటీఐల అభివృద్ధికి కేంద్రం నుంచి 600 కోట్లు

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన లక్ష్యం. లక్ష్య సాధనకు యువతను, పరిశ్రమలను అనుసంధానించాలి. ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న నైపుణ్యం పోర్టల్ అందుకు వేదికవ్వాలి. పోర్టల్‌ను సెప్టెంబరులో ప్రారంభించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలి' అని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉండవల్లి నివాసంలో నైపుణ్యాభివృద్ధి, ఇంటర్ విద్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ఉద్యోగ, ఉపాధి కల్పన లక్ష్యంగా రూపొందిస్తున్న నైపుణ్యం పోర్టల్‌ను మిషన్ మోడ్‌లో ప్రజల్లోకి తీసుకెళ్తాం. ఇందుకోసం 90 రోజుల కార్యక్రమం చేపడతాం. పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే రెజ్యూమ్ సిద్ధం కావాలి. పోర్టల్ ద్వారా స్కిల్ అసెస్‌మెంట్, కంపెనీల్లో ఉద్యోగావకాశాలను యువతకు తెలియజేయాలి. ఆ తర్వాత నైపుణ్య శిక్షణ ఇచ్చి ఆ ఉద్యోగాలు పొందేలా చూడాలి. ప్రతి మూడు నెలలకోసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలి.' అని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు మాట్లాడుతూ, ఇటీవల మంత్రి లోకేశ్ ఢిల్లీ పర్యటన అనంతరం ఐటీఐల అభివృద్ధికి కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కింద రూ.600 కోట్లు వచ్చాయని తెలిపారు. విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనను సులభతరం చేసేలా ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరపాలని మంత్రి సూచించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 5,00,965 మంది అడ్మిషన్లు తీసుకున్నారని అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ... 'టెన్త్ పూర్తి చేసుకున్న విద్యార్థులంతా ఇంటర్ లేదా ఒకేషనల్ కోర్సుల్లో తప్పనిసరిగా చేరేలా చూడాలి. ప్రతి విద్యార్థీ ఎక్కడ చేరారో ట్రాక్ చేయాలి' అని ఆదేశించారు. నిరక్షరాస్యుల కోసం ఆగస్టు 7న అక్షర ఆంధ్ర(ప్రాజెక్ట్ అఆ) కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశాల్లో దివ్యాంగ విద్యార్థులకు ప్రతి సంవత్సరం ఇబ్బంది తలెత్తకుండా మినహాయింపు సబ్జెక్టుకు సగటు మార్కులు వేయాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు.

ప్రభుత్వ భూముల రక్షణలో సవాళ్లు

- అధిగమించేందుకు అవసరమైన మద్దతు ఇవ్వండి
- సీఎంకు ఏపీ సివిల్ సర్వీసెస్ అసోసియేషన్ వినతి

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విలువైన ప్రభుత్వ భూముల రక్షణలో రెవెన్యూ శాఖకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయని ఏపీ సివిల్ సర్వీసెస్(ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులకు అవసరమైన చట్టపరమైన, ఆర్థిక, సంస్థాగత మద్దతు అందించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వేశ్వరనాయుడు, తాతా మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల రక్షణలో సవాళ్లు నెలకొన్నాయని, ఇవి కేవలం పాలనా సమస్యలే కాకుండా.. చట్ట, ఆర్థిక, సంస్థాగతపరంగా ఉన్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టితో పాటు తగిన నిబంధనలు అవసరమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఆధునిక రహదారులు

డెన్మార్క్ అస్ఫాల్ట్ టెక్నాలజీతో రోడ్లు
నంద్యాల జిల్లాలో ప్రయోగాత్మకంగా ..

నంద్యాల, జూలై 4(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందిన దేశాల్లోని రహదారులకు దీటుగా మన రాష్ట్ర రహదారులను తీర్చదిద్దుతామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆ దిశగా సీఎం చంద్రబాబు సరికొత్త టెక్నాలజీ కోసం సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. డానిష్ అస్ఫాల్ట్ రీ-ఇన్ఫోర్సింగ్ టెక్నాలజీతో రూపొందించే ఆధునిక రోడ్ల నిర్మాణం రాష్ట్రంలోనే తొలిసారిగా శుక్రవారం ఆయన ప్రారంభించారు. నంద్యాల జిల్లా సంజామల మండలంలోని ముదిగేడు-సంజామల రోడ్డు నిర్మాణ పనుల్లో డెన్మార్క్-టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఈ పనుల ప్రారంభ కార్యక్రమానికి మంత్రితో పాటు డెన్మార్క్ సంస్థ ప్రతినిధులు మైఖేల్, డేవిల్, జోస్ సెబాస్టియన్ హాజరయ్యారు. నూతన టెక్నాలజీతో నిర్మిస్తున్న రహదారిని మంత్రి పరిశీలించి.. మీడియాతో మాట్లాడారు. ఈ అధునాతన టెక్నాలజీని బ్రిటన్‌లోని హీత్రూ ఎయిర్‌పోర్టు, జర్మనీలోని ఏ7 మోటార్ వే వంటి ప్రాజెక్టుల్లో విజయవంతంగా ఉపయోగించారన్నారు. ఈ టెక్నాలజీ రోడ్లకు కిలోమీటరుకు రూ.28 లక్షలు ఖర్చు అవుతుందని, పదేళ్లకు పైగా రహదారి దెబ్బతినే అవకాశమే ఉండదని చెప్పారు. ఈ ప్రయోగం విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఇదేతరహా రోడ్లను నిర్మిస్తామన్నారు. ప్రకృతి వైపరీత్యాలను సైతం ఈ తరహా రహదారులు తట్టుకుని దీర్ఘకాలం మన్నికగా ఉంటాయన్నారు. అస్సాం, గుజరాత్ వంటి ప్రాంతాల్లో నిరంతరం వర్షాలు పడుతున్నా ఈ టెక్నాలజీతో వేసిన రోడ్లు చెక్కుచెదరలేదన్నారు.

అస్ఫాల్ట్ రోడ్ల నిర్మాణం ఇలా..

తారు రోడ్లకు ఆధునిక రూపం అస్ఫాల్ట్ టెక్నాలజీ రోడ్లు. అస్ఫాల్ట్(ఓ రకమైన పెట్రోలియం ఉత్పత్తి) మిశ్రమాన్ని పలు రకాలుగా తయారు చేస్తారు. సాధారణంగా స్టోన్ క్రష్, గ్రావెల్, ఇసుక వంటి వాటితో అస్ఫాల్ట్ బైండర్‌ను కలుపుతారు. నాణ్యత మరింత పెరగడానికి అరమిడ్, పాలియోలెఫిన్ వంటి కొన్ని ఫైబర్లలను ఆ మిశ్రమానికి జోడిస్తారు. ఈ రోడ్డు నిర్మాణం చేసే ప్రాంతంలో గట్టిగా ఉండేలా బేస్‌ను రూపొందిస్తారు. దానిపై నిర్దిష్ట వేడిగా ఉన్న అస్ఫాల్ట్ మిశ్రమాన్ని పోసి రోలర్లతో చదును చేస్తారు. దీంతో అది గట్టి పడుతుంది. ఇది సాధారణ తారు రోడ్డు కన్నా చదునుగా ఉంటుంది.



కొత్త రహదారిని పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, డెన్మార్క్ ప్రతినిధులు

ఫ్రీ హోల్డ్‌కు రైట్ రైట్!

(మొదటి పేజీ తరువాయి)

వైఖరి తీసుకోలేదని సీఎం ప్రశ్నించారు. వీలైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ శాఖపై సమీక్ష చేశారు. అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ ఎలా చేయాలన్న విషయంలో స్పష్టత ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం-1977 చట్టసవరణ మేరకు అర్హత గల భూములను ఫ్రీ హోల్డ్ చేసే విషయంలో సత్వరమే నిర్ణయం తీసుకోవాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. పక్కా నిబంధనల ప్రకారం ఉన్న భూములను ఫ్రీహోల్డ్ చేయాలని సీఎం స్పష్టం చేశారు. 22ఏలోని ఇనాం, చుక్కలు, షరతు పట్టా భూములకూ వర్తించనుంది. జగన్ ప్రభుత్వంలో 2024 మే నాటికి 13.59 లక్షల ఎకరాల భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. అందులో 5.74 లక్షల ఎకరాలను చట్టవిరుద్ధంగా, అక్రమంగా నిషేధిత జాబితా నుంచి తొలగించారని రెవెన్యూ శాఖ గుర్తించింది. చట్టప్రకారం, నిబంధనల మేరకు ఫ్రీహోల్డ్ అయిన భూములు 7.16లక్షల ఎకరాలు ఉన్నాయి. ఇందు లో నిజమైన అసైనీలే పొజిషన్‌లో ఉన్నవాటిని పక్కా రికార్డులను పరిశీలించి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తారు. ఇకపై అసైన్డ్ చట్టసవరణ ప్రకారం 20 ఏళ్ల కాలపరిమితి దాటిన భూములు, అసైనీలే పొజిషన్‌లో ఉన్నవాటిని ఏటా ఫ్రీ హోల్డ్ అయ్యేలా నిర్ణయాలు తీసుకోనున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఈ అంశాలపై మరోసారి చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి సిఫారసులతో కూడిన నివేదిక ఇవ్వనుంది. ఇదంతా జరగడానికి అక్టోబరు దాకా పట్టొచ్చని మంత్రి అనగాని చెప్పారు. అయితే ముఖ్యమంత్రి మాత్రం వీలైనంత త్వరగా ప్రజలకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.



రెవెన్యూ సమీక్షలో సీఎం చంద్రబాబు

సమీక్షలో కీలక నిర్ణయాలు

- ప్రస్తుతం భూముల రీ సర్వే 2.0 కొనసాగుతోంది. 2027 డిసెంబరు నాటికి రీ సర్వేను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.
- ఆగస్టు 15 నుంచే రైతులకు కొత్త పాసుపుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.
- రాష్ట్ర, జిల్లా స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అతిథులు, పెద్దలు వచ్చినప్పుడు గౌరవార్థం కోసం రెవెన్యూ శాఖ నుంచి తహసీల్దార్, ఆర్డీఓ, ఇతర అధికారులు ప్రొటోకాల్ డ్యూటీలకు వెళ్తున్నారు. ఇకపై రెవెన్యూ అధికారులు ఆ పని చేయాల్సిన పనిలేదని సీఎం చెప్పారు. ప్రభుత్వ అతిథులు ఏ శాఖకు సంబంధించిన వారు వస్తే సంబంధిత విభాగం అధికారులే ప్రొటోకాల్ డ్యూటీ చేసేలా ఏర్పాట్లు చేయాలని, ఇందుకు విధివిధానాలు జారీ చేయాలని ఆదేశించారు.
- గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల రేషనలైజేషన్ జరుగుతోంది. ప్రస్తుతం రీ సర్వే 2.0 కొనసాగుతున్నందున వీఆర్ఓ, విలేజ్ సర్వేయర్లను కదిలించవద్దన్న రెవెన్యూ శాఖ వినతికి సీఎం సానుకూలంగా స్పందించారు.
- సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న రోవర్ల బిల్లులు చెల్లించేందుకు నిధులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు.
- వారసత్వ ధ్రువీకరణ పత్రాలు జారీని సులభతరం చేస్తూ రెవెన్యూ శాఖ తీసుకున్న ఫీజుల విధానానికి సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.
- పేదలు, జర్నలిస్టు గృహ నిర్మాణంపై ఉన్న చట్టపరమైన వివాదాలు, సమస్యలను అక్టోబరు నాటికి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

'నాలా'పై సీఎం అసంతృప్తి

ఏపీ వ్యవసాయ భూమి బదలాయింపు చట్టం (నాలా)పై రెవెన్యూశాఖ ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. నాలా చట్టం ఉపసంహరణపై ఇప్పటిదాకా ఎందుకు ఫైలు పంపించ లేదని సీఎం ప్రశ్నించినట్లు తెలిసింది. అధికారులు దీనికేదో కారణాలు చెప్పినట్లు సమాచారం.

ఏఐతో సమస్యల పరిష్కారం: అనగాని

కృత్రిమ మేధతో భూ సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సీఎం సమీక్ష అనంతరం ఆయన రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్ఏ జయలక్ష్మి, అదనపు సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏఐ టెక్నాలజీతో భూ వివాదాలు కూడా పరిష్కరిస్తామని చెప్పారు. బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో మోసపూరిత రిజిస్ట్రేషన్లు, ఎంట్రీలను అడ్డుకుంటామన్నారు. ఆగస్టు 15న రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందిస్తామన్నారు. రెవెన్యూ శాఖ కులధ్రువీకరణ పత్రాలను ఓపెన్ డొమెయిన్‌లో పెట్టాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై చర్చ

కలెక్టర్ల సమావేశం తర్వాత జరిగిన సమీక్ష కావడంతో పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ప్రధానంగా అసైన్డ్ భూముల ఫ్రీ హోల్డ్‌పై చర్చ జరిగింది. 'ముందు మీరు చెప్పేది చెప్పండి.. ఆ తర్వాత అంశాల వారీగా నేను మాట్లాడుతాను' అని చంద్రబాబు చెప్పారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'రెవెన్యూ రచ్చ' వార్త క్లిప్పింగ్‌ను సీఎంకు చూపించారు. జగన్ ప్రభుత్వంలో అసైన్డ్ భూముల అక్రమాలను రెవెన్యూ శాఖ గుర్తించి ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్లు ఆపేస్తే.. 'ఆంధ్రజ్యోతి' పెద్ద వార్త రాసిందని, ఫ్రీ హోల్డ్ కొనసాగించాలని పేర్కొందని సీఎంకు నివేదించారు. 'గతంలో వైసీపీ వాళ్లకు మేలు చేశారు. ఇప్పుడు వాళ్లకు మేలు చేయాలన్నట్లుగా వార్త రాశారు' అని మంత్రి ప్రస్తావించినట్లు తెలిసింది. మంత్రి వాదనను ముఖ్యమంత్రి చంద్రబాబు తోసిపుచ్చారు. "వార్తలో ఏముందో నేనూ చూశా. ఫ్రీ హోల్డ్‌ను ఇంకెంతకాలం ఆపుతారు? రికార్డులన్నీ కరెక్టుగా ఉన్నవి, అర్హులైన వారి భూములను ఫ్రీ హోల్డ్ చేస్తే తప్పేమిటి? వైసీపీ వాళ్లకు లబ్ధి చేకూరుతుందని అంటున్నారు? పార్టీల పేరు చెప్పి అర్హుల అవకాశాలను అడ్డుకోవడం సరైనదా? ఈ పేరిట ప్రజలను ఇంకెంతకాలం ఇబ్బంది పెడుతారు? ఈ సమస్యను పరిష్కరించాలని ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మీరెందుకు ఇప్పటిదాకా ఓ నిర్ణయం తీసుకోలేకపోయారు? ఈ అంశంపై మీకు స్పష్టత ఉందా? అన్నీ కరెక్టుగా ఉన్న భూములకు స్వేచ్ఛ కల్పిస్తే తప్పేమిటి?" అని సీఎం వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కాగా రెవెన్యూ మంత్రి 'ఆంధ్రజ్యోతి' వార్తలకు దురుద్దేశ్యాలు ఆపాదించడం ద్వారా ఫ్రీ హోల్డ్‌పై ఇప్పటివరకు ఇటు రెవెన్యూ శాఖ, అటు తన నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకోకపోవడం సరైనదేనని ముఖ్యమంత్రి ముందు వాదించే ప్రయత్నం చేశారు. సీఎం అందుకు భిన్నంగా స్పందించారు. అన్నీ కరెక్టుగా ఉన్నవాటిని ఫ్రీ హోల్డ్ చేయకుండా ఎందుకు ఆపాలి? ఇంకెంత కాలం ప్రజలు ఇబ్బంది పడాలి? అని గట్టిగా ప్రశ్నించడంతో మంత్రి మారుమాట్లాడలేదని తెలిసింది.



అల్లూరికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు





పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులోని అల్లూరి ధ్యాన కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పాల్గొన్న క్షత్రియ నాయకులు

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి

- జయంతి సందర్భంగా నివాళులర్పించిన బాబు, పవన్
- మోగల్లులో అల్లూరి ధ్యాన కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్

అమరావతి, పాలకోడేరు, గుంటూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు జాతి పౌరుషానికి ప్రతీకగా నిలిచిన అల్లూరి పోరాట స్ఫూర్తిని, అణగారిన వర్గాలకు అండగా నిలిచే తత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అల్లూరి జయంతి సందర్భంగా ఆయన ఘన నివాళులర్పించారు. అలాగే, టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వర్లరామయ్య, పర్చూరి అశోక్‌బాబు తదితరులు అల్లూరికి నివాళులర్పించారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అసెంబ్లీ భవనంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేర ప్రసన్న కుమార్ అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, స్పెషల్ కమిషనర్ ఆర్జా శ్రీకాంత్ ఘన నివాళులర్పించారు.

మోగల్లులు ధ్యాన కేంద్రం

పశ్చిమగోదావరి జిల్లా మోగల్లు గ్రామంలో అల్లూరి నడయాడిన ప్రాంతంలో నిర్మించిన అల్లూరి ధ్యాన కేంద్రాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హైదరాబాద్ నుంచి శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. అందే సమయంలో ధ్యాన కేంద్రం వద్ద.. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తనయుడు భరత్, క్షత్రియ సేవా సమితి నాయకులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, మన్యం వీరుడు అల్లూరికి నివాళులర్పించారు.

మీకు మేమున్నాం..!

- జెవిశెట్టి సోదరుల కుటుంబాలకు చంద్రబాబు భరోసా
- చెరో 25 లక్షలు ఆర్థిక సాయం... పిల్లలకు ఉద్యోగాలు

మాచర్ల టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రత్యర్థుల చేతుల్లో హతులైన టీడీపీ నేతల కుటుంబాలకు సీఎం చంద్రబాబు మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన టీడీపీ నాయకుల జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు అన్నదమ్ములు. వారిరువురూ ప్రత్యర్థుల చేతిలో హతులైన సంగతి విదితమే. శుక్రవారం ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డితో కలసి జెవిశెట్టి సోదరుల కుటుంబ సభ్యులు సీఎంను కలిశారు. జెవిశెట్టి సోదరులు పార్టీకి అందించిన సేవలను, కుటుంబ ఆర్థిక స్థితిని వివరించారు. స్పందించిన చంద్రబాబు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబాలకు చెరో రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. పిల్లలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.



సీఎంను కలిసిన జెవిశెట్టి సోదరుల కుటుంబ సభ్యులు

మీరెలా వస్తారో చూస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నాయకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో లేనప్పుడు, రెండు చోట్ల ఓడిపోయినప్పుడే పోరాటం చేశానని, ఇక్కడ ఉన్న మీతోపాటు నాకూ గుండెల్లో దమ్ము, రక్తంలో వేడి ఉందన్నారు. రౌడీయిజం చేసే వాళ్ల మెడకాయలు కోస్తామని బెదిరిస్తే తామేమైన చొక్కాలు విప్పుకొని ఉన్నామా? అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి కూటమిగా ఉన్నామని, ప్రజలు తమపై నమ్మకంతో రికార్డు మెజారిటీ ఇచ్చారని తెలిపారు.

కూటమి... పిడికిలి!

అన్నివేళ్ల కలిసి ఉన్నట్టు కూటమి అంటే పిడికిలి లాంటిదని పవన్ కల్యాణ్ తెలిపారు. వైసీపీ తాటాకు చప్పుళ్లకు తాము భయపడేది లేదన్నారు. వ్యక్తిగతంగా తమకు ఏ ఒక్కరిపైనా ద్వేషం లేదని చెబుతూ సగటు మనిషిని మనిషిగా చూడకుండా నరుకుతాం అంటూ భయభ్రాంతులకు గురిచేస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. "వైసీపీ నాయకులు మాట్లాడితే.. మళ్లీ మేమొస్తే.. మేమొస్తే.. అని అంటున్నారు. అసలు మళ్లీ 2029లో మీరెలా అధికారంలోకి వస్తారో మేమూ చూస్తాం." అని పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. వైసీపీని అధికారంలో రాకుండా చేసేందుకే టీడీపీ, బీజేపీ, జనసేన మరో 15 ఏళ్లు కలిసే ఉంటాయని, వైసీపీ ఆటలు సాగనిచ్చేది లేదని స్పష్టం చేశారు. "మాట్లాడితే.. వైసీపీ వారేదో అద్భుతమైన పాలన చేసినట్టు ప్రజల ముందు వాపోతున్నారు కదా? నిజంగా ప్రజలకు మేలు చేసి ఉంటే 11 సీట్లకు ఎందుకు పరిమితమయ్యారు." అని ప్రశ్నించారు. జల్ జీవన్ మిషన్ కింద గత ఐదేళ్లలో కేంద్రం రూ.26 వేల కోట్ల నిధులు మంజూరు చేస్తే వాటికి రాష్ట్రప్రభుత్వం 50 శాతం వాటా కూడా ఇవ్వకుండా వదిలేశారని దుయ్యబట్టారు. ఐదేళ్లలో కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే ఖర్చుచేశారని, అది కూడా ప్రణాళిక లేని పనులతో కేవలం పైపులైన్లు వేసి చేతులు దులుపుకొన్నారని తెలిపారు.



జల్ జీవన్ మిషన్ పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డీఎస్‌బీవీ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తదితరులు

నేనే పర్యవేక్షిస్తా!

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబుతో కలిసి కేంద్రంతో సంప్రదింపులు జరిపితే తొలి విడతగా రూ.1,290 కోట్లు మంజూరు చేశారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆ నిధులతోనే ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ పనులు కేవలం 18 నెలల్లో పూర్తిచేసేలా తానే స్వయంగా పర్యవేక్షిస్తానని వివరించారు. వైసీపీ నాయకులు ఐదేళ్లు నిధులు దోచుకుని ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలుసుకున్నాక శిలాఫలకాలు వేస్తే చూస్తూ ఉండటానికి ప్రజలు అమాయకులు కారని అన్నారు. "దోచుకున్న డబ్బులతో ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చుచేస్తారు. కానీ, వెలిగొండ వంటి ప్రాజెక్టును పూర్తిచేయాలనే ఆలోచన మాత్రం వారిలో ఉండదు. కానీ, కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనతో సీఎం చంద్రబాబు సారథ్యంలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసేందుకు కృతనిశ్చయంతో ఉంది. పూర్తిచేసేది కూటమి ప్రభుత్వమే." అని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమానికి ముందు జిల్లాలోని 578 ఆవాసాలకు రూ.1,290 కోట్లతో తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని పవన్‌కల్యాణ్ ఆవిష్కరించారు.

కూటమిలో కలిసి ఉండండి

జనసేన నాయకుడు బాలినేని శ్రీనివాసరెడ్డి తనకు ఆత్మీయుడని పవన్ కల్యాణ్ తెలిపారు. ఆయన వైసీపీలో ఉన్నా వ్యక్తిగతంగా ఆయనతో తనకు గొడవలు లేవన్నారు. గత ప్రభుత్వంలో కూడా కొన్ని సందర్భాల్లో బాలినేని తనకు అండగా నిలిచారని తెలిపారు. సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి అని, రాజకీయాలు ఎలా చేయాలో తెలిసిన వ్యక్తి అని పేర్కొన్నారు. అందుకే ఆయనను జనసేనలోకి ఆహ్వానించానని, కుటుంబంలోకి కొత్త వ్యక్తి వస్తే కొన్ని సమస్యలు వస్తాయని సరిదిద్దుకోవాలని సూచించారు. కూటమిలో అందరూ కలిసి ఉండాలన్నారు.



తనయులతో మంగళగిరికి పవన్

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో తన పెద్ద కుమారుడు అకీరా నందన్, చిన్న కుమారుడు మార్క్ శంకర్‌తో కలిసి మంగళగిరిలోని తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద హెలికాప్టర్ దిగి ముగ్గురూ లోపలికి వెళ్తుండగా తీసిన ఫొటో ఒకటి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సింగపూర్ స్కూలులో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన మార్క్ శంకర్ ఇటీవలే కోలుకున్నాడు. దీంతో పవన్.. వీలునుబట్టి మార్క్ శంకర్‌తో ఎక్కువ సమయం గడుపుతున్నారు. ఇప్పుడు ముగ్గురూ ఒకే ఫొటోలో కనిపించడం అభిమానులకు కనుల పండువగా మారింది. కాగా, మంగళగిరి వచ్చిన తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. అధికారులు, పార్టీ ప్రతినిధులతో ముఖ్యమైన విషయాలపై చర్చించారు.

కీరవాణికి పవన్ జన్మదిన శుభాకాంక్షలు

సినీ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓ ప్రకటనలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'మీరు మరిన్ని సంవత్సరాలు అద్భుతమైన సంగీతాన్ని అందించాలి. భగవంతుడు మీకు సంపూర్ణ ఆయురారోగ్యాలు అందించాలి' అని ఆకాంక్షించారు.

ఆత్మకూరులో రోడ్డెక్కిన తమ్ముళ్లు

- ఎంపీ శబరిని అడ్డుకున్న బుడ్డా వర్గం
- ఎమ్మెల్యే లేకుండా పర్యటన చేయడంపై ఆగ్రహం
- శబరి కారు అడ్డగింత.. ఏరాసుపై రాళ్లదాడి
- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఘటన

నంద్యాల, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి లేకుండా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పర్యటనకు సిద్ధమవడాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీలోని ఒక వర్గం ఆమె వాహనాన్ని అడ్డుకుంది. మరో టీడీపీ నేత, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డిపై రాళ్లు విసిరింది. నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గంలోని ఆత్మకూరు మండల కేంద్రంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం సాక్షిగా ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన దివ్యాంగుల పరికరాల పంపిణీ రిజిస్ట్రేషన్ కార్యక్రమం కోసం ఎంపీ బైరెడ్డి శబరి ఉదయం తొమ్మిది గంటలకు ఆత్మకూరుకు చేరుకున్నారు. అల్పాహారం నిమిత్తం పిలవగా, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఇంటికి వెళ్లారు. షెడ్యూల్ కార్యక్రమానికి మరో గంట సమయం ఉండటంతో అక్కడినుంచి బయటకు వచ్చి స్థానిక వార్డులో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని చేపట్టేందుకు యత్నించారు. ఇంతలో.. అక్కడకు దాదాపు 70 మంది టీడీపీ కార్యకర్తలు చేరుకున్నారు. ఎమ్మెల్యే బుడ్డా వెంట లేకుండా ఎలా పర్యటన చేస్తారంటూ ఎంపీ శబరిని వారు అడ్డుకున్నారు. ఆమె వెంట ఉన్న అనుచరగణం వారిని నిలువరించే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో పక్కనే ఇంటి ఆవరణలో ఉన్న ఏరాసు ప్రతాపరెడ్డిపై బుడ్డా వర్గం రాళ్ల దాడి చేసింది. ఈ దాడిలో ఏరాసు చేతికి స్వల్ప గాయాలయ్యాయి. ఆయన ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇలా మూడు గంటలపాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ పోలీస్ సిబ్బందితో అక్కడకు చేరుకుని ఇద్దరి కీ సర్దిచెప్పారు. అయితే, తాను దివ్యాంగుల కార్యక్రమంతోపాటు సుపరిపాలనలో తొలి అడుగు .కార్యక్ర మం కోసం ఆత్మకూరుకు వస్తున్నట్టు ఎమ్మెల్యే బుడ్డా కు శబరి ముందే సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించారని, తాను కూడా వస్తానని చెప్పారని సమాచారం. అయితే ఏం జరిగిందో ఏమోగానీ ఎమ్మెల్యే రాలేదు. కాగా, ఆత్మకూరు ఘటన విషయం ఎంపీ శబరి, ఏరాసు ప్రతాపరెడ్డి అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.



నంద్యాల జిల్లా ఆత్మకూరులో ఎంపీ బైరెడ్డి శబరి వాహనాన్ని అడ్డుకున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి వర్గీయులు

బనకచర్లపై వాప్కోస్ కసరత్తు

▸ ఢిల్లీ నుంచి అమరావతి వచ్చిన శంభు ఆజాద్ బృందం


శంభునాథ్ ఆజాద్

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి గోదావరి వరద జలాల అందుబాటుపై కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ 'వాప్కోస్' అధ్యయనం ప్రారంభించింది. అమరావతికి శుక్రవారం వాప్కోస్ ఉన్నతాధికారి శంభునాథ్ ఆజాద్ నేతృత్వంలోని అధికార బృందం వచ్చింది. ఈయన సదరు సంస్థలో జలవనరుల అభివృద్ధి కేంద్రం ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈవో)గా ఉన్నారు. వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావుతో ఈ బృందం సమావేశమైంది. ఇప్పటికే.. వాప్కోస్ వద్ద ఉన్న నీటి లెక్కలు.. సముద్రంలో కలుస్తున్న వరద జలాల గణాంకాలను ప్రాథమికంగా వివరించింది. ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్) పరిశీలన సమయంలోనే కేంద్ర పర్యావరణ, అటవీ శాఖకు చెందిన నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) అభ్యంతరాలు చెప్పడం, కేంద్ర జల సంఘం పలు నీటి ప్రాజెక్టులు, వరదల గణాంకాలు అడిగిన సంగతి తెలిసిందే. వీటిని అధ్యయనం చేసి సమగ్ర సమాధానాలను సిద్ధం చేసే పనిలో శంభునాథ్ బృందం నిమగ్నమైంది. ఇది సోమవారంకల్లా పూర్తవుతుంది.

క్వొరీలు సహజమే..

సాగునీటి ప్రాజెక్టుల పీఎఫ్ఆర్‌లు, సమగ్ర ప్రాజెక్టు నివేదికల(డీపీఆర్)ను జల సంఘానికి, కేంద్ర పర్యావరణశాఖ ఆమోదానికి పంపినప్పుడు క్వొరీలు వేయడం, సందేహాలు లేవనెత్తడం సహజమేనని జల వనరుల శాఖ అంటోంది. 'బనకచర్ల పథకానికి సముద్రంలో కలిసే వృధా జలాలను వాడుకోవాలని నిర్ణయించినందున అభ్యంతరాలుండవని భావించాం. కానీ ప్రాథమిక దశలోనే కేంద్రం నుంచి అభ్యంతరాలు రావడం కొంత ఇబ్బందికరంగా మారింది. రాష్ట్రంలో ఏ కొత్త నీటి ప్రాజెక్టును కట్టాలనుకున్నా.. వెంటనే తెలంగాణ నుంచి అభ్యంతరాలు రావడం సర్వసాధారణమైంది. పోలవరం ప్రాజెక్టుపైనా అభ్యంతరాలు చెబుతోంది. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే 2005లో కేంద్ర జల సంఘానికి సమర్పించినప్పుడు తెలంగాణ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీని ఫలితంగా 2009 దాకా ఆమోదం లభించలేదు. ఇప్పుడు బనకచర్లకు ఎదురవుతున్న అవాంతరాలనూ అధిగమించి.. త్వరలోనే వాస్తవ నివేదికలను.. కేంద్ర సంస్థలు అడిగిన సమాచారాన్ని సమర్పించి.. ఆమోదం పొందుతాం' అని జలవనరుల శాఖ అధికారులు ధీమా వ్యక్తంచేశారు. సోమవారంనాటికి వాప్కోస్ సమాధానాలు సిద్ధం చేయగానే.. వాటిని జలసంఘానికి, ఈఏసీకి నివేదిస్తామని.. అనంతరం అధికారుల బృందం ఢిల్లీ వెళ్లి సంబంధిత అధికారులతో సమావేశమై వివరణ ఇస్తుందని తెలిపారు.

ప్రభావం చూపని ద్రోణి

▸ తగ్గిన వర్షాలు.. పెరిగిన ఉష్ణోగ్రత

▸ నాలుగైదు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం

విశాఖపట్నం, జూలై 4(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని నుంచి జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ మీదుగా గుజరాత్ వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. అయితే ఆవర్తనం, ద్రోణి.. ఆంధ్రప్రదేశ్‌పై పెద్దగా ప్రభావం చూపడం లేదు. కానీ అరేబియా సముద్రం నుంచి వచ్చే తేమగాలులతో రాయలసీమ, కోస్తాల్లోని కొన్ని చోట్ల శుక్రవారం వర్షాలు కురిశాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగాయి. తిరుపతిలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. వచ్చే నాలుగైదు రోజుల్లో పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్‌కు ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. అప్పటివరకూ రాష్ట్రంలో వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.

వరద జలాలతో గోదావరి పరవళ్లు

పోలవరం స్పిల్‌వే నుంచి 1,68,729 క్యూసెక్కులు విడుదల

తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు కళకళ


తుంగభద్ర డ్యాం నుంచి 21 గేట్లెత్తి దిగువకు నీటి విడుదల


ఏలూరు జిల్లా పట్టిసీమ శివక్షేత్రం వద్ద గోదావరి పరవళ్లు

పోలవరం, కర్నూలు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉపనదుల నుంచి పెద్ద ఎత్తున వరద జలాలు వచ్చి చేరుతుండడంతో పోలవరం వద్ద గోదావరి పరవళ్లు తొకుతోంది. గోదావరి నీటిమట్టం గడచిన మూడు రోజుల్లో అనూహ్యంగా పెరిగింది. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి అదనంగా వస్తున్న 1,68,729 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారని శుక్రవారం జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.760 మీటర్లు, దిగువన 18.330 మీటర్లు, కాఫర్ డ్యామ్‌కు ఎగువన 27.900 మీటర్లు, దిగువన 17.080 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.120 మీటర్లు నీటిమట్టం నమోదైంది. 902 హిల్ ప్రాంతం నుంచి స్పిల్ చానల్ మీదుగా దిగువ కాఫర్ డ్యామ్‌కు వేసిన రోడ్డు మార్గం పూర్తిగా నీటమునగడంతో మట్టి, రాతి తరలింపు లారీలు స్పిల్వే మీదుగా ప్రయాణిస్తున్నాయి. కాగా, పట్టిసీమ నుంచి 708 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశామని ఈఈ యేసుబాబు తెలిపారు.

62,610 క్యూసెక్కులు విడుదల

మహారాష్ట్ర,కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం, తుంగభద్ర జలాశయాలు కళకళలాడుతున్నాయి. తుంగభద్ర డ్యామ్‌లో శుక్రవారం సాయంత్రం 6గంటలకు 75,612 టీఎంసీలు చేరాయి. 74,555 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. 21 గేట్లు రెండున్నర అడుగులు ఎత్తి 59,002 క్యూసెక్కులను, విద్యుత్‌ఉత్పత్తి ద్వారా 3,610 క్యూసెక్కులు కలిపి..మొత్తం 62,612 క్యూసెక్కులు వదిలారు. శ్రీశైలం జలాశయానికి సాయంత్రం 7గంటలకు 1,09,777క్యూసెక్కులమేర వరదవచ్చి చేరింది. డ్యామ్ గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 876.30 అడుగుల లెవల్‌లో 169.86 టీఎంసీల నిల్వ ఉంది.

బంగారు కుటుంబాలకు.. సంక్షేమంలో కోత ఉండదు

▸ వారికి పథకాలు యథాతథం: చంద్రబాబు


▸ పేద, ధనిక అంతరాలు తగ్గించేందుకే పీ-4 విధానం

▸ ఫౌండేషన్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ

▸ పీ-4 లోగో ఆవిష్కరణ

▸ ఈ విధానం అమల్లో బాపట్ల నంబర్ వన్

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలకు ఎంపికైన వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోతా ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపట్టిన పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్(పీ-4) విధానంలో భాగంగా.. ప్రతి నియోజకవర్గంలోనూ 6-10 వేల పేద కుటుంబాలు.. బంగారు కుటుంబాలకు ఎంపికయ్యే అవకాశాలున్నాయన్నారు. స్థానికంగా ఏయే అసెంబ్లీ స్థానాల్లో పరిశ్రమలు ఉంటే.. వాటి యాజమాన్యాలు అక్కడి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధానం అమలు చేస్తామని తెలిపారు. పరిశ్రమలు లేని నియోజకవర్గాలు, ధనవంతులు పెద్దగా ఉండని ఏజెన్సీ ఏరియాల్లోని బంగారు కుటుంబాలకు మార్గదర్శకులను అన్వేషించే అంశంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని చెప్పారు. స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ తొలి సర్వసభ్య సమావేశం శుక్రవారం సీఎం అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు ఇందులో పాల్గొన్నారు. పీ-4 పథకం సమర్థ అమలుకు 2 కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎం ఈ సందర్భంగా ఆదేశించారు. అలాగే జిల్లా, నియోజకవర్గ స్థాయిలో పీ-4 చాప్టర్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీల్లో



స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ వైస్‌చైర్మన్, ఇన్‌చార్జి మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. పీ-4 స్ఫూర్తిని చాటేలా రూపొందించిన 6 రకాల లోగోలను అధికారులు సీఎం ముందుంచారు. అందరి అభిప్రాయం తీసుకున్న తర్వాత ఒక లోగోను ఆయన ఈ సమావేశంలో ఖరారు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పేదల బతుకుల్లో వెలుగును నింపే పీ-4 స్ఫూర్తిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సీఎం పిలుపిచ్చారు. పేదలు, ధనికుల మధ్య అంతరాలు తగ్గించేందుకే ఈ విధానం అమలుచేస్తున్నామన్నారు. గతంలో జన్మభూమి అని పిలుపిస్తే మంచి స్పందన వచ్చిందని.. ఇప్పుడు పీ-4కూ మంచి స్పందన వస్తోందని చెప్పారు. 'ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను, లక్ష మంది మార్గదర్శులను గుర్తించే లక్ష్యంతో పనిచేయాలి. బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చే మార్గదర్శుల పాత్రపై మరింత స్పష్టతకు రావాలి. బంగారు కుటుంబాలు అన్ని అంశాల్లో సాధికారత సాధించేలా వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా మార్గదర్శులు దిశానిర్దేశం చేస్తూ ఉండాలి. వివిధ నియోజకవర్గాల పరిధిలో ఉండే ఎన్ఆర్ఐలు, వివిధ పరిశ్రమలు, ధనవంతులు ఎవరున్నారో గమనించండి. వివిధ రూపాల్లో పేదలకు సేవలు అందించేవారిని గుర్తించండి. వారిని పీ-4 వేదికపైకి తీసుకురావాలి' అని ప్రజాప్రతినిధులకు, అధికారులకు సూచించారు.

2029కి పేదరిక నిర్మూలన..

కేవలం సంక్షేమం అందిస్తే పేదరికం పోదని, 75 ఏళ్లుగా సంక్షేమంపై ఎంతో ఖర్చు చేస్తున్నా పేదరిక నిర్మూలన మాత్రం జరుగడం లేదని సీఎం అన్నారు. 'పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే లక్ష్యంగా పనిచేయాలి. పీ-4 విధానం ద్వారా రాష్ట్రంలో 2029 నాటికి పేదరికాన్ని రూపుమాపాలి. సమాజంలో ఆర్థికంగా స్థిరపడిన టాప్-10 శాతం మందిని.. అట్టడుగున పేదరికంలో ఉన్న 20 శాతం మందితో అనుసంధానం చేసే కార్యక్రమమిది. సమాజంలోని వనరులను ఉపయోగించి పైకి ఎదిగిన వారు ఇప్పుడు సమాజానికి ఎంతోకొంత తిరిగిచ్చేందుకు సిద్ధపడుతున్నారు. బిల్‌గేట్స్ ఫౌండేషన్, వేదాంత, జీఎమ్మార్ వంటి సంస్థలే దీనికి ఉదాహరణ. పీ-4 ద్వారా లబ్ధి పొందిన వారి కుటుంబాల గాధలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మార్గదర్శులకు సముచిత రీతిలో గౌరవమివ్వాలి' అని కోరారు.

పీ-4 అమల్లో బాపట్ల టాప్..

పీ-4 అమల్లో బాపట్ల జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని సీఎం తెలిపారు. దీనికి కృషిచేసిన ఆ జిల్లా ప్రజాప్రతినిధులను, కలెక్టర్‌ను అభినందించారు. ఈ విధానం ద్వారా ముఖ్యమంత్రి అద్భుత కార్యక్రమాన్ని చేపడుతున్నారని, దీనికి తమ వంతు సహకారం అందిస్తామని పలువురు ఎమ్మెల్యేలు చెప్పారు. దీని అమలుపై తమకున్న సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.

ఈడీ విచారణకు హాజరైన అల్లు అరవింద్

▸ రామకృష్ణ టెలిట్రానిక్స్ కేసులో విచారించిన దర్యాప్తు సంస్థ



హైదరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రామకృష్ణ ఎలక్ట్రానిక్స్, రామకృష్ణ టెలిట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆర్‌టీపీఎల్) సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(గతంలో ఆంధ్రా బ్యాంకు)ను రూ.101.48 కోట్లకు మోసం చేసిన కేసులో సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారించింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో విచారణ చేపట్టిన ఈడీ.. పలు లావాదేవీల విషయంలో అరవింద్‌ను ప్రశ్నించింది. అల్లు అరవింద్ బుధవారం ఈడీ విచారణకు హాజరవ్వగా అధికారులను ఆయన్ను మూడు గంటలకు పైగా విచారణ చేశారు. ఈ సంగతి ఆలస్యంగా వెలుగు చూసింది. దర్యాప్తు సంస్థల కథనం ప్రకారం.. ఆర్‌టీపీఎల్ డైరెక్టర్లు వేముల రవి కుమార్, వేముల రాఘవేంద్ర.. ఆర్‌టీపీఎల్ పేరిట శాంసంగ్, సోనీ మొబైల్స్ వ్యాపారం చేస్తుంటారు. హైదరాబాద్‌లోని ఎస్ మార్ట్ వీరి సంస్థే. అయితే, ఆర్‌టీపీఎల్ డైరెక్టర్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ఓసీసీ(ఓపెన్ క్యాష్ క్రెడిట్) కింద రూ.101.48 కోట్లు రుణం తీసుకుని ఆ నగదును దారి మళ్లించారు. ఆర్‌టీపీఎల్ లావాదేవీల్లో మనీలాండరింగ్ కోణం కనిపించడంతో ఈడీ రంగంలోకి దిగింది. ఆర్‌టీపీఎల్ బ్యాంకు ఖాతాల్లో అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన ఈడీ ఈ క్రమంలోనే అల్లు అరవింద్‌ను ప్రశ్నించింది. కాగా, 2017లో తాను కొనుగోలు చేసిన ఓ ఆస్తికి సంబంధించిన విషయంలో ఈడీ అధికారులు తనని ప్రశ్నించారంటూ అల్లు అరవింద్ శుక్రవారం ఓ ప్రకటన చేశారు. అంతకుమించి ఇందులో పెద్ద విషయమేమీ లేదని పేర్కొన్నారు. తనకు ఆస్తి అమ్మిన వ్యక్తిపై ఈడీ విచారణ కొనసాగుతుందని, అతని ఖాతాపుస్తకాల్లో తనతో జరిగిన లావాదేవీ ఉండటంతో ఈడీ అధికారులు ఆ వివరాలు అడిగారని వివరించారు. ఈడీ కోరిన వివరాలను అందజేశానని తెలిపారు. ఈ అంశాన్ని మీడియా పెద్దగా చూపిస్తుందని అరవింద్ పేర్కొన్నారు.

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య




హైదరాబాద్‌లో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, చిత్రంలో టీ సీఎం రేవంత్‌రెడ్డి, కేవీపీ తదితరులు

▸ యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం

▸ హైదరాబాద్‌లో ఘనంగా రోశయ్య 92వ జయంతి

▸ విగ్రహాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

హైదరాబాద్, జూలై 4(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని తెలంగాణలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్టుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, రోశయ్య కుటుంబ సభ్యుడు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అలాగే హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు.

న్యాయమూర్తిపై ట్రోల్స్.. న్యాయ వ్యవస్థపై దాడే!

▸ జస్టిస్ శ్రీనివాసరెడ్డిపై విమర్శలను ఖండించిన న్యాయవాదుల సంఘం

అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని ట్రోల్ చేయడాన్ని హైకోర్టు న్యాయవాదుల సంఘం ఖండించింది. ఓ కేసులో ఉత్తర్వులు వెలువరించిన అనంతరం ఆయనను లక్ష్యంగా చేసుకుని సామజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేయడంపట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు వ్యక్తిగతంగా న్యాయమూర్తి ప్రతిష్ఠను దెబ్బతీయడమే కాకుండా న్యాయవ్యవస్థ పునాదులను, న్యాయపాలనను కదిలిస్తాయని పేర్కొంది. న్యాయమూర్తులు భయం, పక్షపాతం లేకుండా తమ రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని భావిస్తామని, అలాంటి వారిని అపఖ్యాతి పాల్జేయడం ఆమోదయోగ్యం కాదని తెలిపింది. దీనిని న్యాయవ్యవస్థపై ప్రత్యక్షదాడిగా భావించాలని సంఘం పేర్కొంది. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని, పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలిపింది. న్యాయమూర్తిపై ట్రోల్స్ చేసిన వారిని గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె. చిదంబరం, ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్, ప్రధాన కార్యదర్శి సి. సుబోధ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

వైద్య కళాశాలల స్కాంలో.. బత్తల రింగ్‌మాస్టర్!

▸ సజ్జల, మిథున్‌రెడ్డిలకు హరిప్రసాద్ సన్నిహితుడు

▸ చెన్నై కేంద్రంగా అక్రమ వ్యవహారాలు

▸ ఎన్ఎంసీ అధికారులతో సత్సంబంధాలు

▸ కన్సల్టెంట్ పేరుతో దళారీ అవతారం

▸ మెడికల్ కాలేజీల అనుమతులు, సీట్ల కోసం లంచాలు

▸ భారీగా రూ.కోట్లు సంపాదించిన హరిప్రసాద్

▸ గత ఎన్నికల్లో వైసీపీ టికెట్ కోసం ప్రయత్నాలు

▸ సీబీఐ దర్యాప్తులో వెలుగులోకి అక్రమాలు


జగన్‌తో బత్తల హరిప్రసాద్(ఫైల్)

పుట్టపర్తి/కదిరి, జూలై 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగిన మెడికల్ కళాశాలల స్కాంలో శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన వైసీపీ నేత డాక్టర్ బత్తల హరిప్రసాద్ రింగ్ మాస్టర్ అని తేలింది. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అధికారులు, మెడికల్ కాలేజీల యాజమాన్యాలకు మధ్య ఆయన బ్రోకర్‌గా వ్యవహరిస్తూ.. ఆయన రూ.కోట్లు గడించారన్న అభియోగంతో సీబీఐ ఆయనతో పాటు 36 మందిపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. దర్యాప్తులో భాగంగా ఈ నెల 1న కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలోని ఆయన నివాసంపై దాడులు నిర్వహించింది. రోజంతా సోదాలు చేసింది. ఆయన పడక గదిని సీజ్ చేసింది. ఆయన డైరీని సీబీఐ అధికారులు తీసుకెళ్లినట్లు సమాచారం. అనేక మెడికల్ కాలేజీల్లో వసతులు లేకపోయినా, తగినంతమంది బోధనా సిబ్బంది లేకపోయినా.. ఎన్ఎంసీ తనిఖీ బృందాలకు, కేంద్ర ఆరోగ్య శాఖ అధికారులకు లంచాలు ముట్టజెప్పి అనుమతులు ఇప్పించారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఎన్ఎంసీ తనిఖీల సమాచారాన్ని ముందుగానే కాలేజీలకు చేరవేయడం, తనిఖీల్లో అనుకూలంగా నివేదికలు ఇచ్చేందుకు లంచాలు ఇవ్వడం, కాలేజీల అనుమతుల పునరుద్ధరణ కోసం లేఖలు ఇవ్వడం, ముడుపులు ముట్టజెప్పడం వంటి అనేక అక్రమాలకు పాల్పడినట్లు సీబీఐ గుర్తించింది. హరిప్రసాద్‌ది సామాన్య కుటుంబం. ఆయన తండ్రి బత్తల వెంకటరమణ సర్పంచ్‌గా పని చేశారు. సోదరుడు కూడా డాక్టరే. నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజీలో చదువుకున్న హరిప్రసాద్.. కొన్నిరోజులు అక్కడే పనిచేశారు. ఆ తర్వాత చెన్నై వెళ్లిపోయారు. అక్కడే 'మెడికల్' దందాలోకి దిగినట్లు సమాచారం. చెన్నైలో ఉంటూ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు సహా వేర్వేరు రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల వ్యవహారాల్లో గోల్‌మాల్ చేశారని, ఆ కాలేజీలకు అనుమతులు, సీట్లు, డమ్మీ బోధనా సిబ్బందిని సమకూర్చడం వంటి పనులు చేస్తున్నారన్నవి అభియోగాలు. కన్సల్టెంట్ పేరుతో వివిధ రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీలతో పరిచయం పెంచుకున్నారు. చెన్నై కేంద్రంగా ఇతర రాష్ట్రాలకు, ఢిల్లీకి తరచూ వెళ్లేవారని ఆయన సన్నిహితులు అంటున్నారు. ఆయనకు తిరుపతిలో పెద్ద ఆస్పత్రి, హైదరాబాద్‌లోనూ ఓ ఆస్పత్రి, చెన్నైలో హోటల్ సహా రూ.కోట్ల విలువైన అనేక ఆస్తులు ఉన్నాయని కుటుంబ సభ్యులు బాహాటంగానే చెబుతుంటారు. వైసీపీ కీలక నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డికి, ఎంపీ మిథున్‌రెడ్డికి బత్తల సన్నిహితుడు కూడా. అక్రమాలతొం రూ.కోట్లు గడించాక హరిప్రసాద్ చూపు రాజకీయం వైపు కూడా మళ్లింది. 2024 ఎన్నికల్లో కదిరి అసెంబ్లీ స్థానం నుంచి వైసీపీ తరఫున పోటీ చేయడానికి ప్రయత్నించారు. కానీ టికెట్ లభించలేదు. సీబీఐ కేసుపై వైసీపీ నాయకులు నోరు మెదపడంలేదు.

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్

బెంగళూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, ఆర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు.


దుగ్గిరాల మాజీ తహసీల్దార్‌పై అభియోగాలు

▸ లోకాయుక్త ఆదేశాలతో విచారణకు ప్రభుత్వం నిర్ణయం

గుంటూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఫైబర్ నెట్ లిమిటెడ్‌లో ఈడీగా డిప్యూటీ కలెక్టర్ హోదాలో పనిచేస్తున్న సంగా విజయలక్ష్మిపై రెవెన్యూ(విజిలెన్స్-1) డిపార్టుమెంట్ అభియోగాలు నమోదు చేసింది. ఆమె గతంలో గుంటూరు జిల్లా దుగ్గిరాల తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఆ సమయంలో మండలంలోని పెనుములి గ్రామంలో సర్వే నంబర్లు... 257-1, 257-1ఏలలో అడంగల్ నుంచి సాదినేని విజయలక్ష్మి పేరుని తొలగించారు. ఏపీ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదారు పాసుబుక్స్ యాక్టు, 1971కి విరుద్ధంగా ఆమె వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై సాదినేని విజయలక్ష్మి ఏపీ లోకాయుక్తలోనూ ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాలమేరకు విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. నోటీసు అందిన 10 రోజుల్లో అభియోగాలు నమోదుచేయాలని డిప్యూటీ కలెక్టర్‌ను ఆదేశించింది.

వచ్చే ఏడాదికి రాష్ట్రంలో పూర్తిస్థాయి క్వాంటమ్ వ్యాలీ

▸ జేఎన్టీయూకే స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



జేఎన్టీయూకే స్నాతకోత్సవంలో బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యంకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

కాకినాడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ 2026 నాటికి పూర్తిస్థాయి క్వాంటమ్ వ్యాలీని స్థాపించనుందని రాష్ట్ర గవర్నర్, కాకినాడ జేఎన్టీయూకే కులపతి అబ్దుల్ నజీర్ అన్నారు. దీని ద్వారా పూర్తి పునరుత్పాదక శక్తితో నడిచే ప్రపంచంలోనే మొట్టమొదటి నగరంగా అమరావతి అవతరించనుందని ఆయన పేర్కొన్నారు. అబ్దుల్ నజీర్ అధ్యక్షతన కాకినాడలో జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం సాయంత్రం వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకలకు అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబ్బు కోట) ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గౌరవ డాక్టరేట్ (హానరిస్)ను ప్రదానం చేశారు. వేదికపై మొత్తం 99మంది రిసెర్చ్ స్కాలర్స్‌కు పీహెచ్‌డీ అవార్డులు, 35 మందికి బంగారు పతకాలు, ఐదుగురికి ఎండోమెంట్ అవార్డులను గవర్నర్, వీసీ ప్రదానం చేశారు. ఈ స్నాతకోత్సవంలో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, రెక్టార్ ప్రొఫెసర్ కేవీ రమణ, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్, ఓఎస్ ప్రొఫెసర్ డి కోటేశ్వరరావు, డైరెక్టర్లు, జేఎన్టీయూకే కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐవోటీ, ఇ-మొబిలిటీ, పునర్వినియోగ ఇంధనం,రోబోటిక్స్, బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. క్వాంటమ్‌మిషన్‌వల్ల 2026కల్లా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. విద్యార్థుల్లో కష్టపడేతత్వం ఉంటే విజయం దానంతట అదే వస్తుందన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

32 వేల జీతం.. 429 కోట్ల లావాదేవీలు!

▸ వైసీపీ మద్యం కుంభకోణంలో మరో చిత్రం

▸ వరుణ్ పురుషోత్తంను ఏ-40గా పేర్కొన్న సిట్

విజయవాడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల మద్యం కుంభకోణం కేసులో తవ్విన కొద్దీ అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. నెలకు రూ.32 వేల వేతనానికి ఓ కాఫీ షాప్‌లో పనిచేసే ఉద్యోగి.. ఏకంగా రూ.429 కోట్ల మేరకు మద్యం లావాదేవీలు చేసినట్టు ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) గుర్తించింది. హైదరాబాద్‌కు చెందిన వరుణ్ పురుషోత్తం అనే వ్యక్తి ఓ కాఫీ షాప్‌లో రూ.32 వేల వేతనానికి పని చేస్తున్నారు. అయితే, ఆయన పేరు మీద లీలా డిస్టిలరీస్‌లో రూ.429 కోట్ల వరకు లావాదేవీలు జరిగాయి. ఈ విషయాన్ని గుర్తించిన సిట్ అధికారులు ఈ కేసులో ఆయనను 40వ నిందితుడిగా చేర్చారు. ఆయన ఖాతాలను పరిశీలించి.. నగదు లావాదేవీలు జరిగినట్టు నిర్ధారించారు. దీంతో పురుషోత్తంను ఏ-40గా పేర్కొంటూ విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు శుక్రవారం మెమో దాఖలు చేశారు. ఆయనకు సంబంధించిన వివరాలను, నగదు లావాదేవీల వ్యవహారాలను కోర్టుకు సమర్పించారు. కాగా.. మద్యం కుంభకోణం కేసులో నిందితుల జాబితా 40కి చేరింది.

కాగా, మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీగా ఉన్న పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టేసింది. దీనిపై న్యాయాధికారి పి. భాస్కరరావు శుక్రవారం తీర్పును వెలువరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.